ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి


# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

బుధవారం 15 జూలై 2026 | సంపుటి: 28 సంచిక: 101

Wednesday 15 July 2026 | Vol.No 28 Issue No .101

హైదరాబాద్ | Hyderabad

పేజీలు: 12+12 | వెల: రూ.1.00

PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA

www.visionandhra.in







## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి...

- ఫ్యూచర్ సిటీ-బందరు పోర్ట్ గ్రీన్‌ఫీల్డ్ రహదారికి అనుమతులు మంజూరు చేయండి,
- రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి.,
- జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి



ఢిల్లీ: రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి ఇప్పటికే 95 శాతం భూసేకరణ పూర్తయినందున పనుల ప్రారంభానికి కేంద్ర క్యాబినెట్ అనుమతి ఇప్పించాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ఢిల్లీలోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆర్ఆర్ఆర్ రెండువైపులా ఏకకాలంలో మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్



- నేడు శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్
- దివిటిపల్లిలో అమర్ రాజా బ్యాటరీ సెంటర్ ప్రారంభోత్సవం

హైదరాబాద్,జూలై14 : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం మూడు జిల్లాల్లో పర్యటించనున్నారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో పర్యటించి పలు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు సీఎం రేవంత్ భూమిపూజ చేయనున్నారు. మిగతా 2లో..

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు నిర్మించండి...

- ఎంఆర్‌వో, ఎయిర్ కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలి..
- కాకతీయ సంస్కృతికి అద్దం పట్టేలా వరంగల్ విమానాశ్రయం
- ఆదిలాబాద్‌కు అవసరమైన భూ సేకరణ చేపడతాం...
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



ఢిల్లీ: తెలంగాణ రాష్ట్రంలో నిర్మించనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించాలని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. వ్యూహాత్మకంగా, వాణిజ్యపరంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు ఉన్న మెరుగైన పరిస్థితులను సీఎం వివరించారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీలోని పౌరవిమానయాన శాఖ కార్యాలయం రాజీవ్ గాంధీ భవన్‌లో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ విమానాశ్రయ పనులపై కేంద్ర మంత్రితో సుదీర్ఘంగా చర్చించారు. రైలు, రోడ్డు మార్గాలతో అనుసంధానమై ఉండడంతో పాటు కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, ఇతర పరిశ్రమలతో వరంగల్ కీలక నగరంగా ఉందని సీఎం తెలిపారు. రానున్న రోజుల్లో పారిశ్రామికంగా మరింతగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం తెలియజేశారు. మిగతా 2లో..

## ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక

- మెట్ట పంటలకు రైతులు ప్రాధాన్యం ఇవ్వాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



హైదరాబాద్, జూలై14: 'రైతు నేస్తం' కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. రైతులతో నేరుగా మాట్లాడి వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసు కున్నారు. ఈ ఏడాది తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా నమోదవుతోందన్నారు. దీంతో కృష్ణా, గోదావరి ఆయకట్టు ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం మిగతా 2లో..

## పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం..

- కృష్ణా జలాలతో రైతుల కాళ్లు కడుగుతాం ..
- బావ-బామ్మర్దుల'కు గతం లేదు.. భవిష్యత్తూ లేదు
- కుర్తి రావులచెరువు సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం

గద్వాల జూలై 14 (విజన్ ఆంధ్ర బ్యూరో) : తెలంగాణలో దొరల రాజ్యాన్ని కాదని, ప్రజలు కోరుకున్న ప్రజా ప్రభుత్వాన్ని గుండెల్లో పెట్టుకున్నారు. గత పాలకుల అరాచకాలను భరించలేకే 2023లో ప్రజలు బుద్ధి చెప్పారు. మళ్లీ ఏ మొహం పెట్టుకుని వస్తున్నారు అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బిఆర్ఎస్ నేతలను నిలదీశారు. గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామంలో జరిగిన భారీ బహిరంగ సభకు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు.గత పాలకులు కేవలం భూమి పూజలు చేసి, ఆర్భాటంగా ప్రచారం చేసుకోవడానికే ప్రాధాన్యత ఇచ్చారు తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందించలేదని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును గాలికి వదిలేసి, కనీసం భూసేకరణకు కూడా నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. మొదలుపెట్టిన పనులను అర్ధాంతరంగా వదిలేసి జిల్లా రైతాంగానికి ద్రోహం చేశారని ఆరోపించారు.



కృష్ణా జలాలతో పాలమూరును సస్యశ్యామలం చేస్తాం నార్లపూర్ నుండి ఉదండాపూర్ వరకు పెండింగ్‌లో ఉన్న రిజర్వాయర్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, పాలమూరు మిగతా 2లో..

## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

- హోం టూర్ వీడియోల హల్ చల్
- ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తాం
- ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి



హైదరాబాద్,జూలై14 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మిగతా 2లో..

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

మిగతా 2లో..

- కేంద్రమంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు



హైదరాబాద్,జూలై14 : 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను కేంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర మిగతా 2లో..

## సింగరేణిని కాపాడేందుకే భరోసా యాత్ర!!

- కార్మికుల భవిష్యత్తే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం
- సింగరేణిని దోచింది బీఆర్ఎస్-కాంగ్రెస్
- కేసీఆర్ డైలాగులు కాదు.. జవాబు చెప్పాలి
- కార్మికుల కడుపు కొట్టిన కేటీఆర్, హరీష్
- నాణ్యమైన బొగ్గుతో తాడిచెర్ల బ్లాక్-2
- ప్రధాని మోదీతో సింగరేణికి కొత్త భవిష్యత్
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 14 (విజన్ ఆంధ్ర): సింగరేణి సంస్థను గతంలో బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వాలు ఆర్థికంగా దెబ్బతీశాయని, కార్మికుల చెమటతో నడిచే ఈ మహాసంస్థను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం ఓపెన్ కాస్ట్-5 ప్రాజెక్టు వద్ద నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర సభలో ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు దేశానికి గర్వకారణంగా నిలిచిన సింగరేణి నేడు అప్పుల ఊబిలో చిక్కుకోవడం బాధాకరమని అన్నారు. ప్రజల డబ్బుతో అప్పులు చేసి ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటూ ఇప్పుడు కేసీఆర్ పెద్ద పెద్ద డైలాగులు చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కార్మికుల కష్టాన్ని గౌరవించాల్సిన నాయకులు వారి కడుపుపై కొట్టే నిర్ణయాలు తీసుకున్నారని, ముఖ్యంగా కేటీఆర్, హరీష్ రావు మిగతా 2లో..

## ఊరూరా బిఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

- కెసిఆర్ హయంలోనే కూలిన కాళేశ్వరం
- కేంద్ర నిపుణలు సూచనల మేరకు నీటి విడుదల
- మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్,జూలై14 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందే కాళేశ్వరం కుంగిపోయిందని బీఆర్ఎస్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ మరోసారి విరుచుకుపడ్డారు. కాళేశ్వరం కూలడానికి కారణం బీఆర్ఎస్ అని ఆరోపించారు. ఊరూరా తిరిగి బీఆర్ఎస్ చేసిన కుట్రలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రక్తం ప్యాకెట్లతో రాజకీయం చేయాల్సిన అవసరం లేదని బీఆర్ఎస్‌పై మండిపడ్డారు. ఎన్‌డీఎస్ఏ తుది నివేదిక ఇచ్చి కాళేశ్వరంలో నీటిని నింపమని చెబితే.. వెంటనే నింపుతామని చెప్పారు. ఇంజినీర్లు ఇచ్చిన సలహాలను పాటిస్తామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఉపయోగంలోకి రావాలంటే ఏం చేయాలో మిగతా 2లో..

## ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

- ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం
- ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు
- భద్రాద్రని కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష



హైదరాబాద్,జూలై14 : భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. మిగతా 2లో..

## సరిహద్దుల్లో అమెరికాన్ మాజీ సోల్జర్ అరెస్ట్

- అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టివేత
- పొంతన లేని సమాధానాలు చెప్పడంపై అనుమానాలు




న్యూఢిల్లీ,జూలై14 :భారత్-నేపాల్ సరిహద్దులో సశస్త్ర సీమా బల్ మరో అమెరికన్‌ను అదుపులోకి తీసుకుంది. అమెరికా డ్రోన్ మిగతా 2లో..

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

- నెలవారీ ఆర్థిక నివేదికలతో ఆశించిన పురోగతి
- అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి
- ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించాలి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి, జూలై 14 : డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్దేశించారు. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు మిగతా 2లో..



## సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మళ్ళు పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

## ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి , రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన కేంద్రమంత్రి మన్సుక్ మాండవియాను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కేంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేసారు.

## ఊరూరా బీఆర్ఎస్ కుట్రలపై ప్రచారం

నిపుణులు చెబితే వెంటనే అమలు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఎన్‌డీఎస్ఏ సూచనల మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. కరవును దృష్టిలో పెట్టుకొని ప్రజలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలనే మేడిగడ్డ, కన్నెపల్లి విషయంలో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. వర్షాలు తక్కువ పడతాయని శాస్త్రవేత్తలు, పర్యావరణ నిపుణులు చెబుతున్నారన్నారు. ఎల్‌నినోను ఎదుర్కోవడానికి ప్రభుత్వం తరపున సూచనలు చేస్తున్నామని చెప్పారు. కరవును దృష్టిలో పెట్టుకొని రైతులు ప్రత్నామ్యాయ పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలుగా అంతర్గతంగా ఎన్ని సమస్యలు ఉన్నా కలిసి ఎదుర్కోవాలని.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## ఎల్‌నినో పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక

ఉందని, అందుకు అనుగుణంగా రైతులు పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయశాఖ, నీటిపారుదల శాఖ, భూగర్భ జలాల శాఖ, భారత వాతావరణ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు ఇవ్వాలని చెప్పారు. వర్షపాతం తక్కువగా ఉన్నందున జొన్న, సజ్జ, కొర్ర, పెసర, మినుము, కంది వంటి తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలని మంత్రి సూచించారు. అలాగే శాస్త్రవేత్తలు సూచించిన విధంగా తక్కువ కాలంలో పండే, తక్కువ నీరు అవసరమయ్యే అధిక దిగుబడి పంట రకాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా ఐఐఎంఆర్ డైరెక్టర్ మాట్లాడుతూ కొర్ర, సజ్జ, జొన్న వంటి చిరుధాన్యాల సాగును పెంచాలని రైతులకు సూచించారు. భారత వాతావరణ శాఖ, హైదరాబాద్ సంచాలకురాలుస్టెల్లా మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో ఇప్పటివరకు సాధారణం కంటే 30 నుంచి 35 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. వచ్చే మూడు నెలల్లో కూడా తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ ఎగువ రాష్ట్రాల్లో కూడా వర్షపాతం తక్కువగా ఉండటంతో కృష్ణా, గోదావరి నదుల్లో నీటి లభ్యత తగ్గే అవకాశం ఉందన్నారు. అందువల్ల నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాల శాఖ డైరెక్టర్ జిల్లాల వారీగా భూగర్భ జలాల పరిస్థితిని వివరించారు. రాబోయే రోజుల్లో నీటి మట్టం మరింత తగ్గే అవకాశం ఉన్నందున వరి, చెరకు వంటి ఎక్కువ నీరు అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి . సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, సహకార శాఖ ప్రత్యేక సంచాలకులు రాహుల్ రాజ్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్తాస్ జానయ్య, నీటిపారుదల శాఖ ఇంజినీర్-ఇన్-చీఫ్ మధుసూదన్ రావు, భూగర్భ జలాల శాఖ సంచాలకులు లక్ష్మణ్, భారత చిరుధాన్యాల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సత్యవతి, ఐఎండీ శాస్త్రవేత్త డాక్టర్ శ్రావణి, భారత నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ సురేష్, మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.వి. రావు, అలాగే ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ మహాదేవప్ప పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా రంగాలకు సంబంధించిన నిపుణులు రైతులకు ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే పంటల నిర్వహణ, నీటి వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై పలు సూచనలు చేశారు.

## సరిహద్దుల్లో అమెరికాన్ మాజీ సోల్జర్ అరెస్ట్

నిపుణుడు మాథ్యూ వాన్‌డైక్‌ను ఇటీవల మణిపుర్‌లోభారత సైన్యం అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా సరిహద్దుల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న అమెరికా మాజీ సైనికుడిని ఎస్ఎస్‌బి అదుపులోకి తీసుకుంది. అతడిని కాలిఫోర్నియాకు చెందిన జోర్డాన్ బ్రౌన్‌గా గుర్తించారు. సరైన ప్రయాణ పత్రాలు లేకుండా నేపాల్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా అతడిని ఎస్ఎస్‌బి జవాన్ అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జవాన్ నుంచి తప్పించుకొని పారిపోతుండగా.. స్థానికులు పట్టుకొని భద్రతా సిబ్బందికి అప్పగించారన్నారు. విచారణ సమయంలో బ్రౌన్ పొంతన లేని సమాధానాలు చెప్తున్నాడని అధికారులు తెలిపారు. బ్రౌన్ 2025 నవంబర్‌లో సముద్ర మార్గం ద్వారా భారత్‌లోకి ప్రవేశించి.. అప్పటి నుంచి గోవాలో నివసిస్తున్నట్లు గుర్తించామన్నారు. సరైన పత్రాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించినందుకు ఇమ్రిగ్రేషన్ అధికారులు అతడిపై కేసు నమోదు చేశారు. విచారణలో అతడు బెంగళూరు, లఖ్‌నవూ, గోరఖ్‌పూర్‌లకు వెళ్లినట్లు తేలిందన్నారు. తాను కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని.. ఆరేళ్లపాటు అమెరికా సైన్యంలో పని చేశానని బ్రౌన్ వెల్లడించారు. రెండేళ్ల క్రితం సైన్యం నుంచి వైదొలిగానన్నారు. మూడేళ్ల క్రితం తాను ఇటలీ పర్యటనలో ఉన్న సమయంలో ఉత్తరాఖండ్‌కు చెందిన ఒక భారతీయ మహిళను కలిశానని.. 2024 అక్టోబర్‌లో ఆమెను వివాహం చేసుకున్నానని తెలిపారు. అనంతరం టూరిస్ట్ వీసాపై థాయ్‌లాండ్ వెళ్లానని.. అక్కడ పాస్‌పోర్టు పోవడంతో తాను సముద్ర మార్గంలో భారత్‌కు వచ్చినట్లు వెల్లడించారు. గోవాలో పరిచయమైన ఓ నేపాల్ వ్యక్తిని కలవడానికి ఆ దేశానికి వెళ్తున్నట్లు పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ గురించి ప్రశ్నించగా బెంగళూరులోని ఓ పరిచయస్థుడి వద్ద ఉందని చెప్పారు. కొన్నాళ్ల క్రితం కోల్‌కతాలో అరెస్టైన మాథ్యూ వాన్‌డైక్ బృందం ఐరోపా నుంచి తెచ్చిన డ్రోన్లను ఈశాన్య భారతం గుండా మయన్మార్‌లోని తిరుగుబాటుదారుల గ్రూపులకు అందించినట్లు సమాచారం. ఇలా డ్రోన్లను దొంగ రవాణా చేయడం, వాటి కూర్పు, మరమ్మతులు, ఎలక్ట్రానిక్ యుద్ధరీతులలో మయన్మార్ తిరుగుబాటుదారులకు శిక్షణ ఇవ్వడం వాన్‌డైక్ బృందం పని అని నాడు రష్యా వెల్లడించింది. విదేశీయులు మిజోరంలో ప్రయాణించాలంటే రక్షిత ప్రాంత పర్మిట్ (పీఏపీ) తప్పనిసరి. కానీ, నిందితులు అలాంటి అధికార అనుమతులు లేకుండానే ఈశాన్య భారతం నుంచి మయన్మార్‌లోకి ప్రవేశించారనేది ఆరోపణ.వాన్‌డైక్ అరెస్టు ఒక కొత్త ధోరణిని సూచిస్తోంది. విదేశీ కిరాయి సైనికులు భారత భూభాగం గుండా ఇతరులకు ఆయుధాలు, డ్రోన్ల బట్వాడాకు నడుంకట్టారు. వారు భారత్‌ను కీలకమైన రవాణా మార్గంగా వాడుకోవాలని చూస్తున్నారు. వాన్‌డైక్ 'సన్స్ ఆఫ్ లిబర్టీ ఇంటర్నేషనల్' అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు. లిబియా అంతర్యుద్ధ సమయంలో గడాఫీకి వ్యతిరేకంగా పోరాడటం ద్వారా వార్తల్లోకి వచ్చాడు. మోటార్ సైకిల్‌పై ఉత్తర ఆఫ్రికా, పశ్చిమాసియా దేశాల్లో పర్యటించాడు. సిరియా అంతర్యుద్ధంలోనూ పాల్గొన్నాడు. 2022 మార్చి నుంచి అతని సంస్థ ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా పనిచేస్తోంది.

## ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్

మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా సెల్ తయారీ యూనిట్‌ను ప్రారంభించనున్నారు. అలాగే వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. బుధవారం మధ్యాహ్నం 12:00 గంటలకు శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో రంగారెడ్డి జిల్లా ఫ్యూచర్ సిటీకి బయలుదేరుతారు. 12:15 గంటలకు ఫ్యూచర్ సిటీలోని అమెజాన్ డేటా సెంటర్ వేదికకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12:15 నుంచి 12:45 గంటల మధ్య అమెజాన్ డేటా సెంటర్‌కు భూమిపూజ చేస్తారు. అనంతరం 12:50 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లికి పయనమవుతారు. మధ్యాహ్నం 1:15 గంటలకు దివిటిపల్లి చేరుకుని, 1:20 నుంచి 2:20 గంటల మధ్య అమరరాజా సెల్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభోత్సవం, ప్లాంట్ సందర్శన, అనంతరం ప్రసంగం చేయనున్నారు. ధ్యాహ్నం 2:20 గంటలకు దివిటిపల్లి నుంచి వనపర్తి జిల్లా కొత్తకోటకు హెలికాప్టర్‌లో సీఎం రేవంత్ బయలుదేరుతారు. మధ్యాహ్నం 2:40 గంటలకు కొత్తకోటకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2:45 నుంచి 3:45 గంటల మధ్య బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభించి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. అనంతరం 3:45 గంటలకు కొత్తకోట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

## సింగరేణిని కాపాడేందుకే భరోసా యాత్ర!!

హయాంలో కార్మిక సంక్షేమం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. సింగరేణి కార్మికుల శ్రేయస్సు, వారి కుటుంబాల భద్రత, సంస్థ భవిష్యత్తు మాత్రమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని స్పష్టం చేశారు. సంస్థ మనుగడను దృష్టిలో పెట్టుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తాడిచెర్ల బ్లాక్-2 బొగ్గు గనిని సింగరేణికి కేటాయించిందని తెలిపారు. ఈ బ్లాక్‌లో అత్యంత నాణ్యమైన, విలువైన బొగ్గు నిల్వలు ఉన్నాయని, సుమారు 450 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలతో పాటు 40 నుంచి 50 సంవత్సరాల పాటు సంస్థకు ఉపాధి, ఉత్పత్తికి భరోసా కల్పించే సామర్థ్యం ఉందని వివరించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం జెన్కోకు సంబంధించిన రూ.60 వేల కోట్ల బకాయిలను వెంటనే సింగరేణికి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆ బకాయిలు చెల్లించకపోవడం వల్ల సంస్థ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, కార్మికులకు ప్రతి నెల జీతాలు చెల్లించేందుకు కూడా బ్యాంకుల్లో ఓవర్‌డ్రాఫ్ట్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదని, వేలాది కార్మిక కుటుంబాల జీవితాలతో ముడిపడిన అంశమని అన్నారు. సింగరేణి బలంగా ఉంటే తెలంగాణ బలంగా ఉంటుందని, కార్మికుడు సంతోషంగా ఉంటేనే సంస్థ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కార్మికుల చెమటతో వచ్చిన ప్రతి రూపాయి వారికే చేరేలా, సంస్థను లాభాల బాటలో నడిపేలా కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా సింగరేణిని రక్షించాల్సిన బాధ్యత అందరిదని, ఈ సంస్థను కాపాడటం అంటే వేలాది కుటుంబాల భవిష్యత్తును కాపాడటమేనని భావోద్వేగంగా పేర్కొన్నారు. సింగరేణి కేవలం బొగ్గు తవ్వే సంస్థ మాత్రమే కాదని, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని, దానిని దివాళా దిశగా నెట్టిన వారిని ప్రజలు ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల పక్షాన నిలబడి సింగరేణి భవిష్యత్తును మరింత బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకుంటూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సభలో ఎంపీలు ఈటెల రాజేందర్, గోడం నగేష్, ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణా రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, వెంకటనారాయణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామ్ చందర్ రావు, రామగుండం ఇన్చార్జి కందుల సంధ్యారాణి, సోమారపు లావణ్య, కోమల్ల మహేష్, వడ్డేపల్లి భారతి, శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం పనులు ప్రారంభించాలి...

పనులు ప్రారంభమైతే నిర్మాణం త్వరగా పూర్తవుతుందని, నిర్మాణ వ్యయం తగ్గుతుందని సీఎం తెలిపారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధానికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తామని ఏపీ పునర్విభజన చట్టంలో పేర్కొన్నందున వెంటనే ఆ రహదారికి అనుమతులు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్ట్‌కు 12 వరుసల రహదారి మంజూరు చేస్తే హైదరాబాద్-విజయవాడల మధ్య 100 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్‌ను బందరు పోర్ట్‌కు సరకు రవాణా వేగవంతమవుతుందని సీఎం వివరించారు. మన్ననూరు-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి అటవీ శాఖ అనుమతులు ఇప్పించేందుకు కృషి చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయాలు ఈ కారిడార్ పరిధిలో ఉంటాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు ఆరు వరుసల ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రత్యామ్నాయ రహదారికి అవసరమైన భూ సేకరణ తామే చేపడతామని సీఎం తెలిపారు. ఈ ప్రత్యామ్నాయ రహదారి వ్యవసాయ, వ్యాపారపరంగా నూతన అవకాశాలను సృష్టిస్తుందని సీఎం తెలిపారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్ దితరులు పాల్గొన్నారు.

### పాలమూరు ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం..

జిల్లాను కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించారని, ఇప్పటికే అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షలు నిర్వహించారని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని వేల కోట్ల నిధులైనా సరే విడుదల చేసి, పనులను వడివడిగా పూర్తి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారని స్పష్టం చేశారు.

ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ విప్లవం

తెలంగాణ రాష్ట్రంలో పుట్టడం ఒక అదృష్టంగా భావించేలా ప్రజా ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత మరియు ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ అంటేనే కరెంటు.. కరెంటు అంటేనే కాంగ్రెస్, ఉచిత విద్యుత్‌కు పేటెంట్ హక్కు కాంగ్రెస్ పార్టీదే అని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు అంతరాయం లేని ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నాం. ఇందుకోసం ఏటా రైతుల తరఫున రూ. 14,000 కోట్లను ప్రభుత్వమే డిస్కంలకు చెల్లిస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు ఇప్పటివరకు రూ. 67,000 కోట్ల వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశామన్నారు. కోటి అరు లక్షల కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నది దేశంలో తెలంగాణ రాష్ట్రం ఒకటేనని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే మున్నెన్నడూ లేని విధంగా రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న గత ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గద్వాల నియోజకవర్గానికి కావలసిన విద్యుత్ అవసరాలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా తీరుస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు.

'బావ-బామ్మర్దుల' ఆటలు సాగవు..

ప్రతిపక్ష నాయకులపై భట్టి విక్రమార్క తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. వస్తున్నాం.. వస్తున్నాం అంటున్నారు.. ఎక్కడికి వస్తున్నారు,మీ పార్టీ అసలు నాయకుడు ఎక్కడున్నారో మీకు తెలుసా,బావ-బామ్మర్దులకు గతం లేదు.. భవిష్యత్తూ లేదు. ఎవరిని మాయ చేయడానికి వస్తున్నారని ఎంతకాలం ప్రజలను మోసం చేస్తారు అని ప్రశ్నించారు. గతంలో వారు చేసిన పాపాలన్నింటికీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారని, ఆ తర్వాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ గుండు సున్నా ఇచ్చి తిరస్కరించారని గుర్తు చేశారు. సర్పంచ్, మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పినట్టుగా రాబోయే ఎంపీటీసీ ఎన్నికల్లోనూ బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తెలంగాణ సమాజం ప్రజా ప్రభుత్వాన్ని దీవిస్తోందని, ఇక దొరల రాజ్యాన్ని కోరుకోవడం లేదని, వారి ఆటలు తెలంగాణలో సాగవని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, షాద్నగర్ ఎమ్మెల్యే, జడ్చర్ల ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్,పలు కార్పొరేషన్ చైర్మన్లు సరిత తిరుపతయ్య, గట్టు తిమ్మప్ప,జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, జిల్లా ఎస్పీ తోట శ్రీనివాసరావు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యా యన్నారు. జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, హాస్పిటళ్లలో అన్నిరకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ అవేర్‌నెస్ కార్యక్రమాలు కూడా చేపడుతోందన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కూనంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాకూడదు అన్నారు. ఈ నేపథ్యంలోనే గత నెలలోనే ఐటీడీఏ పీవోలతో సమావేశం నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశామన్నారు. సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో ఇప్పటికే 7 డయాలసిస్ సెంటర్లు ఉండగా, కొత్తగా మరో 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కేవలం 20 నిమిషాల ప్రయాణంతో పేషెంట్ డయాలసిస్ సెంటర్‌కు చేరుకునేలా డయాలసిస్ నెట్‌వర్క్‌ను విస్తరించామని తెలిపారు. భద్రాచలం, అశ్వరావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి హామి ఇచ్చారు. ఎమ్మెల్యేలు కోరినట్టుగా కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామి ఇచ్చారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిలో ఎవరికైనా భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉంటే.. వారికి ఆయా హాస్పిటళ్లలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అదే సమయంలో, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని హెల్త్ సెక్రటరీనిని మంత్రి ఆదేశించారు. కొత్తగూడెం ఎంసీహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్పిటల్స్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ మానిటరింగ్ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలకు మంత్రి వివరించారు. ఎమ్మెల్యేలు రెగ్యులర్‌గా హాస్పిటల్స్‌ను విజిట్ చేయాలని మంత్రి సూచించారు.

## అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విమానాశ్రయాలు నిర్మించండి...

ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మంలతో పాటు నల్గొండ జిల్లాలకు కేంద్రంగా వరంగల్ ఉంటుందని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో ఎంఆర్‌వో (మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినందున టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని కోరారు. 2028, జూన్ 2 నాటికి ఎయిర్‌పోర్ట్ పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లపై కేంద్ర మంత్రి, సీఎం చర్చించారు. వరంగల్‌కు ఘనమైన చరిత్ర ఉన్నందున, కాకతీయ చరిత్ర, సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు ఉండాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు. అందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సుముఖత వ్యక్తం చేశారు.

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్‌తో పాటు పౌర విమానాశ్రయం నిర్మించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సీఎం విజ్ఞప్తి చేశారు. రెండు ఎయిర్‌పోర్ట్‌లకు అవసరమైన భూమిని సేకరించి అందజేస్తామని సీఎం తెలిపారు. వరంగల్ విమానాశ్రయంలో మాదిరే ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌లోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వసతులు నెలకొల్పాలన్నారు. వరంగల్, ఆదిలాబాద్ రెండు విమానాశ్రయాల్లోనూ విమాన శిక్షణ సంస్థలు (ఖీూ)నెలకొల్పాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

హుస్సేన్ సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీకి సీ ప్లేన్‌లు నడిపే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సూచించారు. అందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని కేంద్ర మంత్రి సీఎంకు సూచించారు. సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారు, ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, స్పెషల్ సెక్రటరీ కోఆర్డినేషన్ అద్వైత్ కుమార్ సింగ్, పౌరవిమానయాన శాఖ సెక్రటరీ సమీర్ కుమార్ శర్మ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్ విపిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదు**
**: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

అభివృద్ధికి రాజకీయాలతో సంబంధం లేదని, రాజకీయాలు ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశం అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. దేశాల అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన తెలిపారు. తెలంగాణలోనూ విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉద్యోగాల కల్పన, అభివృద్ధికి తాము పాటుపడుతున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ అంశాల్లో తమకు సహకరిస్తుందని, ఎక్కడైనా సమస్యలుంటే కేంద్ర మంత్రులను కలిసి చర్చిస్తున్నామని తెలిపారు. ఏవైనా సమాచారలోపం ఉంటే దానిని పరస్పరం మార్చుకోవడం ద్వారా అధిగమిస్తున్నామని తెలిపారు. అభివృద్ధికి సంబంధించిన అంశాల్లో కేంద్ర మంత్రులను కలిసేందుకు ఢిల్లీకి వస్తున్నామని, దానిపైనా రాజకీయంగా విమర్శలు చేయడం తగదని సీఎం హితవు పలికారు.

**తెలంగాణ మాదిరే ఇతర రాష్ట్రాలు స్పందించాలి..**
**: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

విమానాశ్రయాలతోనే అనేక దేశాలు అభివృద్ధి చెందాయని పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో విమానాశ్రయాల ఏర్పాటుకు రాష్ట్రాలు పోటీపడుతున్నాయని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనంత త్వరగా తెలంగాణ ప్రభుత్వం విమానశ్రయానికి అవసరమైన భూ సేకరణ చేసి ఇచ్చి చరిత్ర సృష్టించిందని ఆయన అభినందించారు. ఇంత త్వరగా స్పందించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. భూ సేకరణ, ఇతర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలు తెలంగాణ మాదిరే స్పందించాలని కేంద్రం మంత్రి సూచించారు. వరంగల్ సంస్కృతికి అద్దం పట్టేలా విమానాశ్రయ డిజైన్ ఉంటుందని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## డేటా డ్రివెన్ గవర్నెన్స్‌తో రియల్ టైమ్ రిజల్ట్స్

వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."2019-2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్థంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. మరిన్ని రంగాల్లో మరింతగా మెరుగుపడాలి. వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పన చేశాం. తలసరి ఆదాయం, జీఎస్డీపీ లక్ష్యాలను నిర్దేశించుకున్నాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. గత పాలనలో ఏపీపై పారిశ్రామికవేత్తలకు నమ్మకం పోయింది. మేం అధికారంలోకి వచ్చాక పరిస్థితిలో మార్పు తెచ్చాం. దేశంలోనే అత్యధిక పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా మారింది. పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగాయి. వనరుల్ని సమర్థంగా వినియోగించుకోవాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. ఇన్నోవేషన్ ద్వారా మెరుగైన ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. టెక్నాలజీ, వనరులు, నాలెడ్జి మన దగ్గర ఉన్నాయి. దానిని అందిపుచ్చుకునే నాయకత్వం మనకు కావాలి. పాలసీలు తీసుకురావటం సులభమే అయినా వాటిని అమలు చేయటమే అత్యంత కీలకం. ఇక నుంచి నెల వారీ ఆర్థిక నివేదికల ద్వారా ముందుకు వెళ్లాలని నిర్ణయించాం. ప్రతీ నెలా ఒకసారి కార్యదర్శులు, హెచ్‌వోడీల సమావేశం ద్వారా ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించుకుందాం." అని ముఖ్యమంత్రి అన్నారు.

అర్జీలు వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన

'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. పీజీఆర్ఎస్‌లో జీరో పెండెన్సీ అనేది లక్ష్యం కావాలని అన్ని శాఖలకూ నిర్దేశిస్తున్నాను. శెట్టిపల్లి, వట్టిచెరుకూరు, కంగుంది, గుటుపల్లి లాంటి ప్రాంతాల్లో భూ సమస్యల్ని పరిష్కరించాం. రీసర్వే ప్రక్రియ ద్వారా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రతీ నెలా 9 తేదీన పంపిణీ చేస్తున్నాం. ఇంకా 72 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ శాఖలు అర్జీల పరిష్కారం కోసం నిబంధనల్లో మార్పులు తీసుకురావడం, లేదంటే చట్టాలను సవరించే అంశంపై విశ్లేషణ చేయాలి. మెరుగ్గా పనిచేస్తే 15 శాతం వృద్ధి రేటును సాధించే అవకాశం ఉంది. పాలన సులభతరం చేసేందుకు, రెవెన్యూ వసూళ్లు పెంచుకునేలా కొన్ని ఏఐ టూల్స్ కూడా రూపొందించాం. ఈ ఏడాది వివిధ ప్రభుత్వ శాఖల్లో 24 శాతం మేర రెవెన్యూ వసూళ్లు పెరిగాయి. జీఎస్డీపీ వృద్ధిరేటు 2017తో పోలిస్తే గత ఏడాదిలో 20 శాతం మేర పెరిగింది. కీలకస్థానాల్లో పనిచేస్తున్న కొందరు వ్యక్తులు అభివృద్ధి నిరోధకులుగా పనిచేయటం సరికాదని హెచ్చరిస్తున్నాను.' అని ముఖ్యమంత్రి అన్నారు.

నాలుగు గోడలు దాటి వెళ్లాలి

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి. మూడో ఏడాదిలోకి అడుగు పెట్టినప్పటికీ విద్యుత్ ఛార్జీలను పెంచలేదు. ఐదేళ్ల పాటు విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పిన మాటను నిలబెట్టుకున్నాం.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# ప్రహసనంగా మారిన సర్ ప్రక్రియ !

ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ కూడా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కాగానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చుకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇంతగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి. తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్రస్థాయిలో ఘోరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫామ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెకలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదుర్కొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫామ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమీక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫామ్‌లు ఎటు పోయాయని ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ మీసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫామ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో కూర్చొని ఫామ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్ నిబంధనల ప్రకారం బీఎల్‌ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారి కూడా క నిపించకుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లో ని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సందర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పుకుంటోది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్‌ఓలు ఒక్కచోటే కూర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్‌ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయకూడదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తించేందుకు ఉపయోగ పడదని ఇప్పటికే ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్ఠమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. పక్కాగా ఓటరు కార్డును తయారు చేయలేని దౌర్భాగ్యస్థితిలో ఎన్నికల సంఘం ఉంది. సరిహద్దులను దాటి దేశంలోకి అక్రమంగా ప్రవేశించినవాళ్లు ఆధార్ కార్డులు పొందివుంటే ..దానిని గుర్తించి ఏరివేయాలి. ఓటరు జాబితాలోచనిపోయిన వారితో పాటు రెండుచోట్ల ఓట్లున్న వారి పేర్లూ ఉన్నాయంటే అందుకు ఎన్నికల సంఘం సక్రమ నిర్వహా లోపమే కారణం. సరైన టెక్నాలజీని వాడడం లేదు. ఎన్నో ఐటి కంపెనీలు ఉన్నాయి. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పులను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యపు కుట్ర

**- ప్రభుత్వ కుట్రపూరిత విధానాలను అడ్డుకుంటాం: ఏబీవీపీ**




రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (విజన్ ఆంధ్ర): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు వీరపట్టం జిల్లాలోని అన్ని యూనివర్సిటీలు, డిగ్రీ, జూనియర్ కళాశాలల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పయ్యంశెట్టి జగదీష్ పటేల్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలపై ఆధారపడి ఉన్నారని, ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో రూ.11,000 కోట్లకుపైగా బకాయిలు పేరుకుపోయాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రతి సంవత్సరం సుమారు 2 లక్షల మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, 4.5 లక్షల మంది విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల తెలంగాణ విద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించిన వారు, ఎన్నికల సమయంలో బకాయిలన్నీ చెల్లిస్తామని, గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల ఫీజులు విడుదల చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి, విద్యాశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నప్పటికీ ఇప్పటివరకు బకాయిలను విడుదల చేయలేదని, ఈ అంశం న్యాయస్థానం దృష్టికి కూడా వెళ్లిందని పేర్కొన్నారు. ప్రైవేట్ కళాశాలలు, ప్రభుత్వం మధ్య జరుగుతున్న నిర్లక్ష్య ధోరణిలో విద్యార్థులే బలవుతున్నారని, బడ్జెట్ లేక అనేక కళాశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని, ఉపాధి కోసం లెక్చరర్లుగా పనిచేస్తున్న నిరుద్యోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కు తప్ప ప్రభుత్వం ఇచ్చే బిక్ష కాదని ఆయన స్పష్టం చేశారు. రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం ప్రశ్నించిన విద్యార్థులపై లాఠీచార్జీలు, అక్రమ కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, కళాశాలలు, విశ్వవిద్యాలయాలను ఉద్యమ వేదికలుగా మార్చి పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్స్ రుద్రపల్లి మహేందర్ ఢిల్లీ భాను స్టేట్ టెక్నికల్ సెల్ కో కన్వీనర్ వి చింతల గుణవంత్ రెడ్డి స్టేట్ ఎస్ఎఫ్ఐ కో కన్వీనర్ పుప్పాల ఆదర్శ్ పటేల్ జిల్లా టెక్నికల్ శివా, కార్తీక్, నాని, భరత్ వంశీ, వంశీ, నవదీప్, విగ్నేష్ , చరణ్, ప్రేమ్ రాజ్, ప్రమోద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ కాంగ్రెస్ లో రాజకీయ "కుట్ర" దారులు !!

**.-రోజుకో ఆడియో అంటూ ఈశ్వరమ్మ యాదవ్ మాట్లాడడం విడ్డూరం**

**-విలేకరుల సమావేశంలో ఎల్బీనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కే శివకుమార్ ఆగ్రహం**




ఎల్బీనగర్, జూలై 14 (విజన్ ఆంధ్ర): ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీలో రాజకీయ కుట్ర దారుల వ్యవహారం రోజుకో విధంగా బయటపడుతుందని, తెలంగాణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా టార్గెట్ చేసి కుట్రపూరిత ఆడియోల పేరుతో రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూస్తే ఇకముందు చూస్తూ ఊరుకోబోమని ఎల్బీనగర్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కే శివకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ శివ చరణ్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆధునిక టెక్నాలజీతో ఆడియోల పేరుతో రాజకీయ పబ్బం కడుక్కోవడానికి జక్కిడి కుటుంబాన్ని టార్గెట్ చేయడం ప్రజలు గమనిస్తున్నారన్న విషయం మర్చిపోవద్దని వారు హెచ్చరించారు. ఓ మీడియా ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈశ్వరమ్మ యాదవ్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారని, రోజుకో ఆడియో విడుదల చేస్తామని ఈశ్వరమ్మ యాదవ్ చెప్పడం కుట్రపూరిత వ్యవహారం కాక మరేమిటి అని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కుట్రధారంలో కాంగ్రెస్ నాయకులు మమేకమై జక్కిడి శివచరణ్ రెడ్డి కుటుంబాన్ని టార్గెట్ చేసిన అంశాన్ని కాంగ్రెస్ పెద్దలు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీలో చిచ్చు పెట్టడానికి ఇతర రాజకీయ పార్టీలు చెందిన నాయకులు ఉత్సాహంగా ఉన్నారని, వాళ్ల బండారం కూడా బయట పెడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. గడిచిన 40 ఏళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీకి నిరంతరం కృషి చేస్తున్నటువంటి జక్కిడి ప్రభాకర్ రెడ్డి, శివ చరణ్ రెడ్డి యొక్క రాజకీయ ప్రస్థానం మొత్తం కాంగ్రెస్ పార్టీకి అంకితం చేశారన్న విషయం ఎల్బీనగర్ ప్రజలందరికీ తెలుసు అన్నారు. కాంగ్రెస్ పార్టీపై బురద చల్లడానికి కుట్రపూరిత వ్యవహారాలు చేస్తున్నటువంటి ఇతర పార్టీల నాయకులు, తెర వెనుక ఉన్న వాళ్ళు ఎవరైనా సరే ఎల్బీనగర్ ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్తారని ఆయన హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఎస్ సాయి, మన్నే రాము యాదవ్, తిరుపతి నాయక్, ఉదయ్ కిరణ్, మహిళా నాయకురాలు ఎం రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడమే ప్రతి పోలీసు అధికారి లక్ష్యం

## - యాదాద్రి జోన్-ఎ డీఐజీ డి.జోయెల్ డేవిస్

**- శాంతిభద్రతల విషయంలో రాజీ లేదు**
**- నేర నియంత్రణకు ముందస్తు చర్యలే విజయానికి మూలం.**
**- ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి శాస్త్రీయ ఆధారాలతో విచారణ చేపట్టాలి.**
**- నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు ప్రశంసనీయం**
**-ఇదే అంకితభావంతో సేవలు కొనసాగించాలి.**




ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో, జులై13,(విజన్ ఆంధ్ర) : యాదాద్రి జోన్-ఎ డీఐజీ డి.జోయెల్ డేవిస్ సోమవారం నల్లగొండ జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి జిల్లా పోలీసు అధికారులతో సమగ్ర నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.సమావేశంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని భౌగోళిక పరిస్థితులు,శాంతిభద్రతలు,నేరాల ధోరణి,పోలీస్ స్టేషన్ల పనితీరు,పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి,బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ,సైబర్ నేరాల నివారణ,మాదకద్రవ్యాల నిర్మూలన, కమ్యూనిటీ పోలీసింగ్ తదితర అంశాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా పోలీసు శాఖ పనితీరు అత్యుత్తమంగా ఉందని అభినందించారు.ప్రజలకు నాణ్యమైన,పారదర్శకమైన, వేగవంతమైన పోలీసు సేవలు అందించడం ప్రతి పోలీసు అధికారి ప్రధాన లక్ష్యంగా ఉండాలని సూచించారు.శాంతిభద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని,ప్రజల ధన,మాన,ప్రాణ రక్షణే పోలీసు శాఖ అత్యున్నత బాధ్యత అని పేర్కొన్నారు.నేరాలు జరిగిన తరువాత స్పందించడం కంటే అవి జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడమే సమర్థవంతమైన పోలీసింగ్ అని తెలిపారు.గ్రామస్థాయిలో విలేజ్ పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై ముందస్తు సమాచారం సేకరించి నేరాలను ప్రారంభ దశలోనే అరికట్టాలని ఆదేశించారు.రౌడీషీటర్లు,బైండోవర్ వ్యక్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాదారులపై నిరంతర నిఘా కొనసాగించాలని,నైట్ పెట్రోలింగ్,నాకాబందీలు మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.నల్లగొండ అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ అత్యంత కీలకమని,శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలు,ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు.సైబర్ నేరాలు,ట్రాఫిక్ అవగాహన,మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.అనంతరం ఎస్పీజిల్లా డీఎస్పీలు, సీఐలు,ఎస్‌హెచ్‌ఓలతో సమావేశమై పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి,శాంతిభద్రతల నిర్వహణపై సమీక్షించి సూచనలు చేశారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ రమేష్,ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి,నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి, దేవరకొండ డీఎస్పీ శ్రీనివాసరావు,డీసీఆర్‌బీ డీఎస్పీ రవి,డీటీసీ డీఎస్పీ నగేష్,సైబర్ క్రైమ్ డీఎస్పీ లక్ష్మీనారాయణ,ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు,జిల్లా సీఐలు,ఆర్‌ఐలు,ఎస్ఐలు ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# సంవత్సరాలు గడచిన ఒకే పోస్టులో

# సీసీ, పీఆర్వో సీపీలు మారినా.. వీరికి వర్తించని బదిలీలు

**- ఆరోపణలు వెల్లువెత్తినా ఒకచోటనే తిష్ట**
**- ఉద్యోగోన్నతి వచ్చినా సీటు వదలని పీఆర్వో**
**- వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పాతుకుపోయిన ఆ ఇద్దరు..?**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై14(విజన్ ఆంధ్ర); వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు పోలీసు శాఖ బదిలీ నిబంధనలు వర్తించవు. అధికారులు, ఇతర సిబ్బందికి స్థానచలనం జరిగినా వీరు మాత్రం కుర్చీని వదలరు.. అక్కడి నుంచి కదలరు. ఏళ్లుగా ఒకే పోస్టులో పాతుకుపోయారు. కమిషనరేట్ ఏర్పడినప్పటి నుంచి పనిచేసిన సుధీర్‌బాబు, రవీందర్, ప్రమోద్, తరుణ్‌జోషి, రంగనాథ్, అంబర్‌కిషోర్‌ఝా, సన్‌ప్రీత్‌సింగ్, ఇప్పుడు కొత్తగా వచ్చిన శ్వేత వరకు వారి క్యాంప్ క్లర్క్ (సీసీ)గా మినిస్టీరియల్ ఉద్యోగి 11 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. అలాగే 20 ఏళ్లుగా పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్వో)గా పనిచేస్తున్న ఉద్యోగి పదోన్నతి వచ్చినా కూడా బదిలీ కాకుండా అదే పోస్టులో కొనసాగుతున్నాడు.

**సీసీపై అనేక ఆరోపణలు..**

వరంగల్ కమిషనరేట్‌కు సీపీగా ఎవరు వచ్చినా తన స్థానాన్ని పదిలం చేసుకుంటూ కుర్చీ వదలకుండా కొనసాగుతున్న సీసీపై అనేక ఆరోపణలున్నాయి. అతడికి స్థాన చలనం అనేదే జరగడం లేదు. ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది ఎవరైనా సరే.. అతను అనుమతిస్తేనే కమిషనర్‌ను కలవాల్సి ఉంటుంది. లేదంటే అంతే సంగతి. ఇక న్యాయం కోసం ఫిర్యాదు చేసేందుకు వచ్చే బాధితుల్లో పైరవీ, పలుకుబడి ఉన్న వారిని మాత్రమే సీపీ వద్దకు పంపిస్తాడనే విమర్శలున్నాయి. ప్రధానంగా భూ వివాదాల విషయంలో అవినీతి అధికారులపై బాధితులు సీపీకి ఫిర్యాదు చేసినప్పుడు వారికి లీకులిచ్చి అలర్ట్ చేస్తాడనే ఆరోపణలున్నాయి. ఇక తనకు అనుకూలంగా ఉన్న అధికారులు, సిబ్బందికి సంబంధించిన ఫైళ్లను కమిషనర్ సంతకాల కోసం త్వరగా పంపించి, మిగతా వారివి వివిధ కారణాలతో పెండింగ్‌లో పెడతాడనే విమర్శలున్నాయి. అవినీతి అధికారులపై సీపీ తీసుకునే సస్పెన్షన్, బదిలీ వేటు సమాచారాన్ని కూడా వారికి ముందుగానే చేరవేస్తాడనే ప్రచారం జరుగుతున్నది. గతంలో ఇద్దరు సీపీలు బదిలీ అయిన సమయంలో సిబ్బందికి స్థానచలనం, ఉద్యోగోన్నతి జాబితాపై హడావిడిగా సంతకాలు చేయించి చేతివాటం ప్రదర్శించాడనే ఆరోపణలు వచ్చాయి. ఇతర జిల్లాల్లో భూ వివాదాన్ని కూడా ఇక్కడ పనిచేసి ప్రస్తుతం హైదారాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఉన్నతాధికారి సహకారంతో సెటిల్ చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది.

**ఖాకీ డ్రెస్ వేయని పీఆర్వో**

ఇక పీఆర్వో కూడా ఏళ్ల తరబడి కుర్చీ వదలకుండా ఒకే పోస్టులో పనిచేస్తున్నాడు. సుమారుగా 18 ఏళ్ల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీగా పనిచేసిన రాష్ట్ర స్థాయి అడిషనల్ డీజీతో సత్సంబంధాలు పెట్టుకొని, ఇక్కడికి సీపీ ఎవరు వచ్చినా అతడితో చెప్పించుకొని తన పోస్టును కాపాడుకుంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఇటీవల హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొంది మహబూబాబాద్‌కు బదిలీ అయినప్పటికీ అక్కడ రెండు రోజులు కూడా డ్యూటీ చేయకుండా వెంటనే హనుమకొండ ట్రాఫిక్‌కు పోస్టింగ్ పొందాడు. ఇక్కడ 30 శాతం ట్రాఫిక్ అలవెన్స్ తీసుకుంటూ పీఆర్వో డ్యూటీనే నిర్వర్తిస్తున్నాడు. పోలీసు ఉన్నతాధికారుల మధ్యే తిరుగుతూ 20 ఏళ్లుగా ఏ ఒక్క రోజు కూడా ఒంటిపై ఖాకీ డ్రెస్ వేయకపోవడం గమనార్హం.

# నవోదయే లక్ష్యం... ప్రతి విద్యార్థికీ అవకాశం

**- జిల్లాలోని 11 వేల మంది ఐదో తరగతి విద్యార్థులందరూ ప్రవేశ పరీక్ష రాయాలి**
**- ఆన్‌లైన్ నమోదు ప్రక్రియపై అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే సమీక్ష**



కరీంనగర్(విజన్ ఆంధ్ర బ్యూరో), జూలై 14: గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించే జవహర్ నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం కల్పించే జేఎన్‌వీఎస్‌టీ2027 పరీక్షకు జిల్లాలోని అర్హత కలిగిన ప్రతి విద్యార్థి దరఖాస్తు చేసి పరీక్ష రాసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. జవహర్ నవోదయ విద్యాలయం, చొప్పదండిలో 202728 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాల కోసం నిర్వహించే ఎంపిక పరీక్ష ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియపై జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో అడిషనల్ కలెక్టర్ మంగళవారం సాయంత్రం తన ఛాంబర్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు.జిల్లాలో ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న సుమారు 11 వేల మంది విద్యార్థులు ఉన్నారని, వారందరూ ఈ ప్రతిష్మాత్మక ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకునేలా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విస్తృత అవగాహన కల్పించి ఒక్క అర్హ విద్యార్థి కూడా ఈ అవకాశాన్ని కోల్పోకుండా చూడాలని ఆదేశించారు.అధికారిక వెబ్‌సైట్: https://navodaya.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.నవోదయ విద్యాలయాలు దేశంలోనే అత్యుత్తమ నివాస పాఠశాలలుగా గుర్తింపు పొందాయని, ఇక్కడ 100 శాతం ఉచిత విద్య, ఉచిత వసతి, భోజన సౌకర్యం, సీబీఎస్ఈ సిలబస్, త్రిభాషా విధానం, ఆధునిక బోధన, నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఒత్తిడి లేని విద్యా వాతావరణం, సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. గ్రామీణ విద్యార్థులకు ఇది జీవితాన్ని మలిచే అరుదైన అవకాశమని పేర్కొన్నారు. జేఎన్‌వీఎస్‌టీ2027కు ఆన్‌లైన్ దరఖాస్తులు జూలై 2 నుంచి ప్రారంభమయ్యాయి. జూలై 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబర్ 28, 2026న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. 202627 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులు. విద్యార్థి చదువుతున్న జిల్లా, నివాస జిల్లా ఒకటే అయి ఉండాలి."Enter to Learn... Leave to Serve" అనే లక్ష్యంతో పనిచేస్తున్న నవోదయ విద్యాలయాల్లో ప్రవేశం పొందేందుకు తల్లిదండ్రులు గడువులోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి, జెడ్పీ సీఈవో పవన్ కుమార్, డీపీఓ జగదీశ్వర్, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అయాజ్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపల్ కమిషనర్లు కిషన్, మల్లికార్జున్, నాగరాజు చొప్పదండి నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

విజన్ ఆంధ్ర



# రామగుండం అందాన్ని పెంచే కొత్త ప్రాజెక్టుకు శ్రీకారం!!

**- ఏ-పవర్ హౌస్ సర్కిల్‌లో ఐలాండ్‌కు స్థల పరిశీలన**

**- ప్రజల సౌకర్యమే ప్రజా పాలన లక్ష్యం - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 14 (విజన్ ఆంధ్ర): రామగుండం పట్టణాన్ని ఆధునిక నగరంగా తీర్చిదిద్దే దిశగా అభివృద్ధి కార్యక్రమాలకు వేగం పెంచుతున్న రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మరో కీలక నిర్ణయానికి శ్రీకారం చుట్టారు. పట్టణ సుందరీకరణలో భాగంగా రామగుండంలోని ఏ-పవర్ హౌస్ సర్కిల్ వద్ద ప్రతిపాదిత ఐలాండ్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని ట్రాఫిక్ పరిస్థితులు, రహదారుల వెడల్పు, వాహనాల రాకపోకలు, ప్రజల రాకపోకలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులతో చర్చించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ఐలాండ్‌ను ఆకర్షణీయంగా, ఆధునిక నమూనాలో రూపొందించాలని సూచించారు. పట్టణానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చేలా సౌందర్యంతో పాటు ప్రయోజనకరంగా ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. రామగుండం అభివృద్ధిలో సుందరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని అందించడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లను దశలవారీగా అభివృద్ధి చేసి నగర రూపురేఖలను మార్చేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఐలాండ్ నిర్మాణం పూర్తయితే ఆ ప్రాంతానికి కొత్త అందం చేకూరడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణ కూడా మరింత మెరుగుపడుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. స్థల పరిశీలన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొని అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.

## మాణికేశ్వరి నగర్‌లో సర్ హెల్ప్‌డెస్క్‌ను పరిశీలించిన ఆదం సంతోష్.



కాప్రా/ జూలై14( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని మాణికేశ్వరి నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన SIR హెల్ప్‌డెస్క్‌ను సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు డీసీసీ జనరల్ సెక్రటరీ గండికోట కుమార్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ, SIR ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయం అందించేందుకు హెల్ప్‌డెస్క్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఫారాలు నింపలేని వారికి అక్కడే ఫారాలు నింపి ఇవ్వడంతో పాటు, ఫారాలు అందని వారి వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించి సంబంధిత BLO వద్ద అందుబాటులో ఉన్న సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తున్న గండికోట కుమార్, ఆయన బృందం సేవలను అభినందించారు. అనంతరం దీూాలు, దీూాలతో మాట్లాడిన ఆయన ఫారాల సేకరణను క్రమబద్ధంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, SIR ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించి ఓటర్లకు అన్ని విధాలుగా సహకరించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గండికోట కుమార్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పారదర్శకంగా జరిపించాలి.

**- పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించిన సీ ఈ ఓ బి నాగలక్ష్మి.**



జూలూరుపాడు జూలై 15 విజన్ ఆంధ్ర : జూలూరుపాడు మండలంలో జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి బి. నాగలక్ష్మి విస్తృత పర్యటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) బి. నాగలక్ష్మి మంగళవారం రోజు జూలూరుపాడు మండలంలో పర్యటించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ూ×=) కార్యక్రమం అమలు తీరును మాచినపేట తండా, అన్నారుపాడు మరియు పాపకొల్లు గ్రామాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్లస్టర్ లెవల్ స్పెషల్ ఆఫీసర్‌గా ఆమె ఈ కార్యక్రమం పురోగతిని సమీక్షించి, ఓటర్లతో మాట్లాడి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి అని సూచించారు. అనంతరం మండలంలోని విలేజ్ ఆర్గనైజేషన్ (ూా) భవనాల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లో ఏర్పాటు చేసిన డ్రైన్ల ఎండ్ సోక్‌పిట్లను పరిశీలించి, వాటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. పాపకొల్లు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) ద్వారా నిర్మించిన గ్రావెల్ రోడ్డును పరిశీలించారు. అలాగే జూలూరుపాడు గ్రామపంచాయతీలో చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమాన్ని పరిశీలించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మండలంలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించిన సీఈఓ , ప్రారంభించాల్సిన అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి, కొనసాగుతున్న పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి తాళ్లూరి రవి మండల పంచాయతీ అధికారి తులసి రామ్, ఏపీవో రామారావు, పి ఆర్ఏ ఈ నవీన్ కుమార్, గ్రామపంచాయతీ సర్పంచులు గ్రామపంచాయతీ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# గ్యారెంటీలు గాలిలో.. యువ సంగ్రామానికి బీఆర్ఎస్ శంఖారావం

**- కాంగ్రెస్ హామీల అమలుపై కేపీ వివేకానంద్, శంబీపూర్ రాజు విమర్శలు**

**- ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపణ**

**- జూలై 18న సరూర్‌నగర్‌లో జరిగే 'యువ సంగ్రామ సభ'ను విజయవంతం చేయాలని పిలుపు**

**- నిరుద్యోగ భృతి, ఉద్యోగాల హామీలు నెరవేరక యువత తీవ్ర నిరాశలో ఉందని వ్యాఖ్య**

**- కుత్బుల్లాపూర్ నుంచి 5 వేల మందితో సభకు తరలివెళ్తామని వెల్లడి**



కుత్బుల్లాపూర్, జూలై 14 (విజన్ ఆంధ్ర ): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు విమర్శించారు. హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తూ, ప్రజలు ప్రశ్నిస్తే అక్రమ కేసులతో బెదిరించే పరిస్థితి నెలకొన్నదని ఆరోపించారు. మంగళవారం పేట్‌బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'యువ సంగ్రామ సభ' సన్నాహక సమావేశంలో వారు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ అధినేత పిలుపు మేరకు ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

**యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?**

అధికారంలోకి వచ్చిన ఏడాదిలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.4 వేల నిరుద్యోగ భృతి అందజేస్తామని, యువతకు రూ.10 లక్షల వడ్డీ లేని రుణాలు ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు కాలేదని వారు విమర్శించారు. ఎంతో ప్రచారం చేసిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కూడా కార్యరూపం దాల్చలేదని ఎద్దేవా చేశారు.

**విద్యార్థులపై నిర్లక్ష్యం**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత విద్య కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలతో ప్రజలను నమ్మించి ఇప్పుడు మాట తప్పడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.

**18న సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సభ**

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈ నెల 18న సరూర్‌నగర్ మైదానంలో భారీ స్థాయిలో 'యువ సంగ్రామ సభ' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యువత, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**కుత్బుల్లాపూర్ నుంచి 5 వేల మంది**

సరూర్‌నగర్ సభకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి సుమారు 5 వేల మంది యువకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీగా తరలివెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని స్పష్టం చేశారు.

# "ఒక్క మొక్క.. లక్ష ప్రాణాలకు ఊపిరి"

**- మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షిద్దాం..**

**- సెయింట్ మేరీస్ హైస్కూల్లో ఘనంగా హరితహారం**



కొత్తగూడెం బ్యూరో జూలై 15(విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా కొత్తగూడెం పట్టణంలోని సెయింట్ మేరీస్ హై స్కూల్లో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు, భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో నీడనిచ్చే వృక్షాలు, పండ్ల మొక్కలు, పూల మొక్కలు, ఔషధ మొక్కలను నాటారు. మొక్కలు నాటిన అనంతరం వాటికి నీరు పోసి, ప్రతి మొక్కను చెట్టుగా పెంచే బాధ్యతను స్వీకరిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా నిరంతరం కృషి చేయాలని సంకల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ, "చెట్లు భూమికి ఊపిరితిత్తులు. మొక్కలు లేకుండా మానవ మనుగడ అసాధ్యం. ప్రతి చెట్టు ప్రాణవాయువును అందించడమే కాకుండా కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచుతుంది. పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులను తగ్గించడంలో మొక్కల పాత్ర అత్యంత కీలకం" అని వివరించారు. అలాగే మొక్కలు వర్షపాతం పెరగడానికి, భూగర్భ జలాల పరిరక్షణకు, నేల కోత నివారణకు, ఉష్ణోగ్రతల నియంత్రణకు దోహదపడతాయని తెలిపారు. పక్షులు, జంతువులు, ఇతర జీవరాశులకు ఆశ్రయంగా చెట్లు నిలుస్తాయని, పర్యావరణ సమతుల్యతను కాపాడే శక్తి ప్రతి మొక్కలో ఉందని పేర్కొన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, "ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచితే పచ్చని తెలంగాణ నిర్మాణం సాకారమవుతుంది. పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా" అని అన్నారు. చిన్ననాటి నుంచే ప్రకృతిపై ప్రేమను పెంపొందించుకోవాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, నీటి వృథాను నివారించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, మొక్కలను సంరక్షించడం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని సూచించారు. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, జాతీయ పండుగలు వంటి ప్రత్యేక సందర్భాల్లో ఒక్కో మొక్కను నాటి వాటిని పెంచాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులు "మొక్కలు నాటుదాం ప్రకృతిని కాపాడుదాం", "ఒక్క మొక్క లక్ష ప్రాణాలకు ఊపిరి", "పచ్చదనమే ప్రగతికి పునాది", "చెట్టును కాపాడితే భవిష్యత్తు సురక్షితం" వంటి నినాదాలతో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ఉత్సాహం, ప్రకృతిపై వారి బాధ్యతాభావం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ మేరిజాన్, ప్రధానోపాధ్యాయిని సిస్టర్ నిర్మలా పోలిశెట్టి, సిస్టర్ బెనెడిక్టా, సిస్టర్ లిల్లీ డానియల్, సిస్టర్ నిర్మల కొపూరి, సిస్టర్ ఉష, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# "సింగరేణిపై మాట్లాడే నైతిక హక్కు లేదు"

**- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



మందమర్రి, జూలై 14 (విజన్ ఆంధ్ర) : సింగరేణి సంస్థపై మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలకు లేదన్నారు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి. ఆ రెండు పార్టీలు సింగరేణి సంస్థపై వేల కోట్ల రూపాయల అప్పులు పెట్టి నష్టాల్లోకి తోసిందన్నారు. ఆ అప్పుల కారణంగా లక్షల మందికి జీతాలు ఇచ్చే పరిస్థితులు లేవన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో క్యాతన్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దె రాగడి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సింగరేణి భరోసా యాత్ర సమావేశంలో మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. సింగరేణికి సంబంధించిన విషయంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఒకప్పుడు వెలుగు వెలిగిన సింగరేణి ప్రాంతంలో ఇప్పుడు నీలి నీడలు కమూతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల జోక్యంతోనే సింగరేణి సంస్థ అప్పులపాలైందన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా పదేళ్లు సింగరేణి సంస్థను అప్పులపాలు చేసి ఇప్పుడు ఫామ్ హౌస్ లో రెస్ట్ తీసుకుంటున్నారని విమర్శించారు. ఇక అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్ మాదిరిగానే వ్యవహరిస్తుందని గుర్తు చేశారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాలంటే కార్మికులంతా ఏకమై కాంగ్రెస్,టిఆర్ఎస్ పార్టీలను నిలదీయాలన్నారు. సింగరేణికి పూర్వవైభవం భారతీయ జనతా పార్టీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తోనే సాధ్యమవుతుందన్నారు.

**అవినీతి తప్ప.. అభివృద్ధి లేదు**

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి అవినీతి తప్ప.. అభివృద్ధి చేయడం చేతకాదన్నారు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు. కమిషన్ల మీద పెట్టిన దృష్టి అభివృద్ధి మీద పెట్టడంలేదన్నారు. ఇచ్చిన ఏ ఒక్క గ్యారెంటీని అమలు చేయడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో విద్యార్థులు ఫీజు బకాయిలు చెల్లించక రోడ్ ఎక్కుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చిన తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**సింగరేణి మనుగడ లేకుండా చేశారు**

పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్,అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థ ఉనికి (మనుగడ) లేకుండా చేశారని మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్ విమర్శించారు. సింగరేణి సంస్థలో అసలు యూనియన్ సంఘాలు లేకుండా చేసిన ఘనత కేసీఆర్ కు చెందుతుందన్నారు. అప్పట్లో సింగరేణిలో అనేక అవినీతి అక్రమాలు,బొగ్గు స్కాం లు జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్ర అభివృద్ధి తోనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆనాడు నరేంద్ర మోదీ మాటలు ఈటెల గుర్తు చేశారు. సింగరేణి భవిష్యత్తు బిజెపి ప్రభుత్వం చేతిలో ఉందన్నారు ఎంపీ ఈటెల రాజేందర్.





## తెలంగాణలో బీఎస్పీనే ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ

**-బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ స్పష్టీకరణ**

**-అక్టోబర్ 9న జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలి**

రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 14 (విజన్ ఆంధ్ర) : తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కంటే బహుజన్ సమాజ్ వాది పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ అని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ స్పష్టం చేశారు. హైదరాబాద్ లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ నేతలు,రాష్ట్ర చీఫ్ సెంట్రల్ కో ఆర్డినేటర్లు అథర్ సింగ్ రావ్, సురేష్ ఆర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలోకి వచ్చేలా రాజకీయాలు చేయబోతున్నామన్నారు. పార్టీని గ్రామగ్రామనా తీసుకెళ్లాలని, బహుజన సమాజాన్ని రాజ్యాధికారం వైపు నడిపించాలని,పార్టీ నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయిని ప్రేరేపించేలా పాలన కొనసాగిస్తోందని ఆరోపించారు. నేరెళ్ల బాధితులకు ఒక్క బీఎస్పీ మాత్రమే న్యాయం చేస్తుందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నేరెళ్ల బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. బహుజనులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బహుజన వర్గాలు బీఎస్పీకి అధికారం కట్టబెట్టి అగ్రకుల పార్టీలను ఓటుతో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అధికారంలో వచ్చేలా వ్యూహ రచన చేస్తున్నామని ఇబ్రాం శేఖర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాం కృష్ణ, చీఫ్ జోన్ ఇన్ చార్జ్ లు దాగిల్ల దయానంద్ రావు, బోడపట్ల ఈశ్వర్, నిశాని రాంచందర్, ప్రధాన కార్యదర్శులు గుండెల ధర్మేందర్, రవీందర్ నాయక్, బండి పృథ్వీరాజ్, కార్యదర్శులు లింగంపల్లి యాదగిరి, అనితా రెడ్డి, అంతటి నాగన్న, కోశాధికారి ప్రణయ్, పార్లమెంట్ ఇన్ చార్జ్ లు, జిల్లాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

# రైతులకు ట్రాన్స్ఫార్మర్లను అందజేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి





మల్దకల్ జూలై 14 (విజన్ ఆంధ్ర బ్యూరో) : ఉమ్మడి జిల్లాలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులను పూర్తి చేసి రైతులకు వ్యవసాయానికి నీటిని అందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, పురావస్తు, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి రోడ్డు మార్గంలో మల్దకల్ మండలం కుర్తి రావులచెరువు గ్రామానికి మంత్రులు చేరుకున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ముఖ్య అతిథులకు ఘనంగా స్వాగతం పలికారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో మంత్రులను, ఇతర అతిథులను సన్మానించారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గంలో కుర్తి రావులచెరువుతోపాటు ఆరగిద్ద, తుమ్మలచెరువు, సోంపురం, పరుమాల, తురుకోనిపల్లి, పెద్దపాడు, ఉలిగేపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కెవి విద్యుత్ ఉప కేంద్రాలను మంత్రులు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. గట్టు మండలం రాయపురం వద్ద రూ.48 కోట్ల నిధులతో 132/33 కెవి విద్యుత్ ఉప కేంద్రం, గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద రూ.3.05 కోట్ల నిధులతో జిల్లా స్టోర్స్ భవనం నిర్మాణానికి కూడా అక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అధ్యక్షతన కుర్తి రావులచెరువు గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఉపముఖ్యమంత్రి ప్రసంగించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్ లో వలసలను సంపూర్ణంగా రూపుమాపి అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గృహజ్యోతి పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఇంటికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందన్నారు. జోగులాంబ గద్వాల జిల్లాలో పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను ప్రారంభించడం జరిగిందని, భవిష్యత్తులోనూ ఈ ప్రాంతంలో ఎలాంటి విద్యుత్ పనులనైన చేపట్టేందుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ఏడాదికి రూ. 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను మహిళా సంఘాలకు అందజేస్తున్నామని, రాబోవు ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు అందించడమే ధ్యేయంగా ముందుకెళ్తున్నామన్నారు. ఇటీవల రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేయడం జరిగిందన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల ఉచిత బీమాను వర్తింప చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న 27 లక్షల విద్యార్థులకు ఉదయం అల్పాహారం, రాగి జావా అందజేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న బియ్యంకు రూ. 500 బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రూ.10 లక్షల వరకు వివిధ చికిత్సల కోసం ప్రభుత్వం సాయం అందిస్తుందన్నారు. అనంతరం నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ సభ్యులు మల్లు రవి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని అభిమానులతో కలిసి ఎంపీ కేక్ కోశారు. అనంతరం రోడ్డు మార్గంలో గద్వాల కలెక్టరేట్ సమీపంలో ఉన్న హెలిపాడ్ వద్దకు చేరుకున్న మంత్రులకు జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, గద్వాల మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, ఏఐసీసీ కార్యదర్శి ,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్ ఏ సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# జయప్రద కాలనీలో కమ్యూనిటీ స్థలం ఆక్రమణ...

**హైడ్రా ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు**

**బీఎన్‌ఎస్ సెక్షన్ల క్రింద చిగుళ్ల మహేందర్, కంది రాములుపై ఎఫ్ఐఆర్ నమోదు**

బోడుప్పల్, జూలై 14 (విజన్ ఆంధ్ర): జయప్రద కాలనీలో కమ్యూనిటీ అవసరాల కోసం కేటాయించిన భూమిని అక్రమంగా ఆక్రమించి, నకిలీ పత్రాలు సృష్టించి నివాస ప్లాట్లుగా మార్చి విక్రయించినట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు మేడిపల్లి ఇన్స్పెక్టర్ జలేందర్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలొని జయప్రద కాలనీ సర్వే నంబర్ 130లో సుమారు 1,200 చదరపు గజాల విస్తీర్ణం గల కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ కోసం కేటాయించిన కమ్యూనిటీ స్థలాన్ని కాలనీ అధ్యక్షుడు చిగుళ్ల మహేందర్, కంది రాము కలిసి అక్రమంగా ఆక్రమించి హైడ్రా రక్షణలో ఏర్పాటు చేసిన సైన్‌బోర్డును తొలగించి, కమ్యూనిటీ స్థలాన్ని అక్రమంగా నివాస ప్లాట్లుగా మార్చడంతో పాటు నకిలీ పత్రాలు సృష్టించి, ఆ ప్లాట్లను మూడో వ్యక్తులకు విక్రయించినట్లు హైడ్రా ఇన్‌స్పెక్టర్ జి. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సోమవారం మేడిపల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 1013/2026గా కేసు నమోదు చేశారు. భారతీయ న్యాయ సంహిత (దీచీూ)లోని సెక్షన్లు 329, 324(4), 318(4), 338, 336(3), 340తో పాటు 3(5) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

**- కలెక్టర్ ఇలా త్రిపాఠి**



నిజామాబాద్, జూలై 14 :( విజన్ ఆంధ్ర) వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరుగనున్న గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. గోదావరి పుష్కరాలు-2027 ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర కన్సల్టెంట్ కుహూ గుప్తాతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గోదావరి పరీవాహక ప్రాంతాలైన తుంగిని, పోచంపాడ్, తడ్ పాకల్ పుష్కర ప్రదేశాల వద్ద చేపట్టాల్సిన పనులు, కల్పించాల్సిన వసతులపై చర్చించారు. శ్రీరాంసాగర్ రిజర్వాయర్ తో కూడిన పోచంపాడ్ పుష్కరఘాట్ వద్ద పుణ్య స్నానాలు ఆచరించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు వీ.ఐ.పీలు, వీ.వీ.ఐ.పీలు తరలివచ్చే అవకాశాలు ఉన్నందున వాహనాల పార్కింగ్, సరైన రోడ్డు వసతి, అత్యవసర ఎగ్జిట్ వంటి అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. తడ్ పాకల్, తుంగిని పుష్కరఘాట్ల వద్ద కూడా అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి తేవాలన్నారు. పుష్కర ఘాట్ల వరకు అప్రోచ్ రోడ్లు, పుష్కర ఘాట్ల మరమ్మతులు వంటి పనులను ప్రాధాన్యతాక్రమంలో చేపట్టాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. నిర్దేశిత పుష్కర ఘాట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి, ఇప్పటికే ఆమోదం తెలిపిన పనులు వెంటనే ప్రారంభం అయ్యేలా చూడాలని, అవసరమైన కొత్త పనులను గుర్తిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీజీవో జిల్లా నూతన కార్యవర్గం



మహబూబ్‌నగర్, జూలై 14 (విజన్ ఆంధ్ర): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త, ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో టీజీవో జిల్లా అధ్యక్షులు ఎస్. విజయకుమార్ నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి డా. బాలు యాదవ్ బైకాని, ఉపాధ్యక్షురాలు డా. ఐ. విజయకుమారి, సంయుక్త కార్యదర్శి సమ్మయ్యలను కలెక్టర్‌కు పరిచయం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్త నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. టీజీవో సంఘానికి గతంలో కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, సంఘ కార్యాలయ భవన నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలుకావడంలో, ప్రభుత్వ పాలన మరింత మెరుగుపడడంలో గెజిటెడ్ అధికారుల సేవలు కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించే దిశగా అధికారులు నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు యాదగిరి, ట్రెజరర్ టైటస్ పాల్, జిల్లా నాయకులు తానాజీ, నరేష్, గంగాధర్, చంద్రకళ, అనంతప్ప, జగదీష్, వెంకట్రాములు తదితర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# డబ్బులు డబుల్ అంటూ మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ డి. జానకి**

**- సెంట్రల్ గవర్నమెంట్ పేరుతో వచ్చే నకిలీ పెట్టుబడి పథకాలను నమ్మొద్దు..**

**- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయండి**



మహబూబ్‌నగర్, అర్బన్ జూలై 14 (విజన్ ఆంధ్ర): "డబ్బులు డబుల్ అవుతాయి", "సెంట్రల్ గవర్నమెంట్ గ్యారెంటీ", "వంద శాతం సురక్షిత పెట్టుబడి" వంటి ఆకర్షణీయమైన ప్రకటనలను నమ్మి ఎలాంటి ధృవీకరణ లేకుండా పెట్టుబడులు పెట్టవద్దని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ప్రజలకు సూచించారు. రోజురోజుకు కొత్త పద్ధతులను అవలంబిస్తున్న సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు కాజేస్తున్నారని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వ పేర్లతో నకిలీ పెట్టుబడి పథకాలు, అధిక లాభాలు వస్తాయని హామీ ఇచ్చే ప్రకటనల ద్వారా సైబర్ మోసగాళ్లు ప్రజలను వలలో వేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. పెట్టుబడి పెట్టే ముందు సంబంధిత సంస్థ నిజమైనదేనా, ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా అనే విషయాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. తక్కువ సమయంలో డబ్బులు రెట్టింపు అవుతాయని చెప్పే పథకాలు ఎక్కువగా మోసపూరితమైనవేనని హెచ్చరించారు. జిల్లాలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సైబర్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు నిరంతరం సూచనలు అందిస్తున్నట్లు చెప్పారు. అనుమానాస్పద పెట్టుబడి లింకులు, సామాజిక మాధ్యమాల్లో వచ్చే పోస్టులు లేదా ఫోన్ కాల్స్ ద్వారా డబ్బులు పెట్టుబడి పెట్టాలని కోరితే వెంటనే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారిక ధృవీకరణ లేని లింకులను క్లిక్ చేయకూడదని, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు, యూపీఐ పిన్ వంటి వ్యక్తిగత ఆర్థిక సమాచారాన్ని ఎవరికీ వెల్లడించవద్దని ఎస్పీ స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్కు ఫోన్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలని జిల్లా ప్రజలకు ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. ప్రజల అప్రమత్తతే సైబర్ మోసాల నివారణకు అత్యంత కీలకమని ఆమె పేర్కొన్నారు.

# ప్రాణాంతక వ్యాధికి అరుదైన శస్త్ర చికిత్స

**- తల్లి, బిడ్డల ప్రాణాలను కాపాడిన సోమాజిగూడ యశోద ఆస్పత్రి వైద్యులు.**

**- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డాక్టర్ జి. విక్రమ్ కుమార్.**




నిజామాబాద్ జులై 14:( విజన్ ఆంధ్ర) : ప్రాణాంతకమైన వ్యాధితో బాధపడుతున్న ఒక యువ గర్భిణీ కీ సకాలంలో వైద్యం అందించి రెండు ప్రాణాలను కాపాడగలిగామని సోమాజిగూడ యశోద హాస్పిటల్ కన్సల్టెంట్ క్లినికల్ హెమటాలజిస్ట్ అండ్ బీఎంటీ ఫిజీషియన్, డాక్టర్ జి.విక్రమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని యశోద మెడికల్ సెంటర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన యువ గర్భిణికి ప్రాణాంతకమైన థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా (టీటీపీ ) అనేఅరుదైన, రక్తసంబంధిత వ్యా ధితో బాధపడుతుండగా, సకాలంలో వ్యాధిని గుర్తించి వైద్యం అందించడం జరిగిందన్నారు. పేషేంట్ అత్యంత విషమ పరిస్థితిలో ఆసుపత్రిలో చేరగా,ఆసుపత్రిలోని మల్టీడిసిప్లినరీబృందం వేగంగా స్పందించి వ్యా ధిని నిర్ధారించిందన్నారు. తక్షణమేఅత్యవసర చికిత్సను అందించి,తల్లి, గర్భస్థశిశువు ఇద్దరికీ ఎలాంటి ప్రాణాపాయం లేకుండా భదత్ర కల్పించిదన్నారు. హెమటాలజీ బృందం వెంటనేవ్యా ధిని నిర్ధారించి, టీటీపీ కి అంతర్జాతీయంగా ఆమోదించబడిన అత్యుత్తమ చికిత్స అయిన థెరప్యూ టిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ (ప్లాస్మా ఫెరిసిస్) ను, కార్టికోస్టెరాయిడ్ థెరపీతో కలిపి వెంటనే ప్రారంభించమన్నారు. పేషేంట్ ఈ చికిత్సకు అద్భుతంగా స్పందించిన్నట్లు పేర్కొన్నారు , ఆమె ప్లేట్లెట్ కౌంట్ వేగంగా కోలుకొని మొత్తం ఆరోగ్యం నిలకడగా మారిందన్నారు. హెమటాలజీ ప్రసూతి బృందాల నిరంతర పర్యవేక్షణలో ఆమె గర్భం సురక్షితంగా కొనసాగుతోందన్నారు., ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారన్నారు. "థ్రోంబోటిక్ థ్రోంబోసైటోపెనిక్ పర్పు రా అనేది అరుదైన కానీ ప్రాణాంతకమైన మెడికల్ ఎమర్జెన్సీ . చికిత్స చేయకపోతే ఇదిచాలా వేగంగా తీవ్రమవుతుందన్నారు . గర్భధారణ సమయంలో తల్లి, బిడ్డ ఇద్దరినీ రక్షించడానికి, వ్యాధిని ముందుగా గుర్తించడం, వేగంగా నిర్ధారించడం తక్షణం థెరప్యూటిక్ ప్లాస్మా ఎక్స్ ఛేంజ్ ప్రారంభించడం చాలా ముఖ్యం అని సకాలంలో నిపుణుల జోక్యం సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ విజయవంతమైన ఫలితాలను సాధించడంలో ఎంత ముఖ్యమో ఈ కేసు స్పష్టం చేస్తుందని అన్నారు. టీటీపీ అనేది ఒక అరుదైన రక్తసంబంధ వ్యాధి అని ఇందులో శరీరం అంతటా చిన్న చిన్న రక్తపు గడ్డలు ఏర్పడతాయన్నారు. దీనివల్ల ప్లేట్లెట్ కౌంట్ తీవ్రంగా పడిపోవడం, ఎర్రరక్తకణాలు నాశనం కావడం, మెదడు, మూత్రపిండాలు, గుండెవంటి ముఖ్యమైన అవయవాలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉంటుందన్నారు. గర్భధారణ సమయంలో ఇతర సమస్యల లక్షణాలు ఈ వ్యాధి లక్షణాలు ఒకేలా ఉండటం వల్ల, ఈ వ్యా ధిని గుర్తించడం సవాలుతో కూడుకున్నదన్నారు. కాబట్టి వ్యాధిని త్వరగా గుర్తించడం మరింత కీలకం. ఈ విజయవంతమైన ఫలితం, అత్యధునాతన రోగనిర్ధారణ పద్ధతులు, థెరప్యూ టిక్ ప్లాస్మా ఎక్స్ఛేంజ్ సౌకర్యాలు సమన్వయంతో కూడిన మల్టీడిసిప్లినరీకేర్ ద్వార సంక్లిష్టమైన హెమటాలాజికల్ ఎమర్జెన్సీ లను నిర్వహించడంలో సోమాజిగూడ యశోద హాస్పిటల్ కు ఉన్న అత్యుత్తమ నైపుణ్యాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ఈ సమావేశంలో సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ రూపేష్ షిండే, సీనియర్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎం. అమర్నాథ్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి నోట అసంతృప్తి మాటలు..!!

**- కిషన్ రెడ్డి టూర్‌కు తూతూ మంత్రపు ఏర్పాట్లు**

**- సగం టెంట్....పూర్తి అసంతృప్తి**

**- కేంద్ర మంత్రికి ఇదేనా గౌరవం..?**

**- సింగరేణిలో అధికారుల నిర్లక్ష్యం..?**

**- ఓసిపి-5 ఏర్పాట్లపై బీజేపీ ఆగ్రహం**

**- ఆర్జీ-1 అధికారులపై చర్యలు కోరిన కాషాయం**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 14 (విజన్ ఆంధ్ర): కేంద్ర మంత్రి పర్యటనను లైట్ తీసుకున్న సింగరేణి అధికారులు..? భరోసా యాత్ర సభలో కనిపించిన తూతూ మంత్రపు ఏర్పాట్లు చర్చనీయాంశం. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మంగళవారం ఆర్జీ-1 పరిధిలోని ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-5 గని ప్రాంగణంలో నిర్వహించిన "సింగరేణి భరోసా యాత్ర" సభలో ఏర్పాట్లు వివాదానికి దారితీశాయి. దేశ స్థాయి కేంద్ర మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరైన సభకు తగిన స్థాయిలో ఏర్పాట్లు చేయలేదని బీజేపీ, బీఎంఎస్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా ప్రాంగణంలో వేసిన టెంట్ సగం మాత్రమే ఉండటంతో పలువురు కార్యకర్తలు, సింగరేణి కార్మికులు ఎండలోనే నిలబడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తమైంది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం సభా ఏర్పాట్లపై సగం టెంట్ అనే అసంతృప్తి మాటలను వ్యక్తం చేశారు. దేశంలో బొగ్గు రంగానికి కీలకమైన సింగరేణిలో కేంద్ర మంత్రికి ఇలాంటి స్వాగతమా? కాషాయ జెండా కింద పనిచేసే ప్రజాప్రతినిధులకు ఇదేనా గౌరవం? అంటూ కార్యకర్తలు సభలోనే చెవులు కొరుక్కున్నారు. వందలాది మంది వస్తారని ముందే సమాచారం ఉన్నప్పటికీ అధికారులు కనీస అంచనా కూడా వేయలేదా అనే విమర్శలు వినిపించాయి. సభా నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ప్రతిష్ఠకే మచ్చ తెచ్చారని బీజేపీ, బీఎంఎస్ నాయకులు ఆరోపించారు. ఈ ఘటనపై ఆర్జీ-1 జీఎం, ఓసీపీ-5 ప్రాజెక్టు మేనేజర్ బాధ్యత వహించాలని, వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలో కేంద్ర మంత్రి పర్యటనకు కూడా సరైన ఏర్పాట్లు లేకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ ఆరోపణలపై సింగరేణి అధికారుల స్పందన రావాల్సి ఉంది.

# సెయింట్ ఆన్స్ స్కూల్‌లో విద్యార్థుల భద్రత ప్రశ్నార్థకం

## - హైడ్రా కూల్చివేతల తర్వాత రక్షణ గోడ లేక చిన్నారుల ప్రాణాలకు ముప్పు

**-ప్రహారీ గోడ కూల్చివేత తర్వాత ప్రత్యామ్నాయ భద్రతా చర్యలు చేపట్టని యాజమాన్యం**

**-స్కూల్ ప్రాంగణంలోకి విచ్చలవిడిగా వస్తున్న వీధి కుక్కలు, పందులు**

**-అనుమానిత వ్యక్తుల ప్రవేశానికి అవకాశం ఉందని తల్లిదండ్రుల ఆందోళన**

**-వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నా భద్రతపై నిర్లక్ష్యమా?**

**-తాత్కాలిక కంచె ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు**

**-విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**-విద్యాశాఖ అధికారులు, స్థానిక యంత్రాంగం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**-భద్రత కల్పించకపోతే ఆందోళనకు సిద్ధమని తల్లిదండ్రుల హెచ్చరిక**




కుత్బుల్లాపూర్, జూలై 14 (విజన్ ఆంధ్ర ): పేట్ బషీరాబాద్‌లోని ప్రముఖ విద్యాసంస్థ సెయింట్ ఆన్స్ స్కూల్లో వందలాది మంది విద్యార్థుల భద్రత ప్రస్తుతం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇటీవల ప్రభుత్వ భూమి ఆక్రమణకు సంబంధించిన చర్యల్లో భాగంగా హైడ్రా అధికారులు స్కూల్ ఆవరణలోని ప్రహరీ గోడలో భాగాన్ని కూల్చివేశారు. అయితే కూల్చివేతలు జరిగి రోజులు గడిచినా స్కూల్ యాజమాన్యం ప్రత్యామ్నాయ రక్షణ చర్యలు చేపట్టకపోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రక్షణ లేకుండా మారిన పాఠశాల ప్రాంగణం**

ప్రహరీ గోడ తొలగించబడిన తర్వాత పాఠశాల ప్రాంగణం పూర్తిగా బహిరంగంగా మారింది. తాత్కాలిక కంచె, ఇనుప బారికేడ్లు లేదా ఇతర భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో పాఠశాల ఆవరణలోకి వీధి కుక్కలు, పందులు విచ్చలవిడిగా ప్రవేశిస్తున్నాయని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆటలు ఆడే సమయంలో లేదా తరగతులకు వెళ్లే సమయంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

**అనుమానితుల ప్రవేశానికి అవకాశం**

ప్రహరీ గోడ లేకపోవడంతో ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తులు కూడా పాఠశాల ఆవరణలోకి ప్రవేశించే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఇది అత్యంత ఆందోళనకర అంశమని, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరిగినా బాధ్యత ఎవరు వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**ఫీజుల వసూళ్లలో చురుకుదనం... భద్రతలో ఎందుకు నిర్లక్ష్యం?**

ప్రతి ఏడాది వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థ విద్యార్థుల కనీస భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం సమంజసం కాదని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం యాజమాన్యం బాధ్యత అని వారు స్పష్టం చేస్తున్నారు.

**తక్షణమే భద్రతా చర్యలు చేపట్టాలి**

కూల్చివేసిన ప్రాంతంలో చట్టపరమైన పరిమితులను గౌరవిస్తూ, స్కూల్‌కు చెందిన పరిధిలో వెంటనే తాత్కాలిక రక్షణ కంచె లేదా బలమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అనంతరం శాశ్వత ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**అధికారులు జోక్యం చేసుకోవాలి**

విద్యార్థుల భద్రతకు సంబంధించిన ఈ అంశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు, స్థానిక పాలనా యంత్రాంగం, సంబంధిత శాఖలు అత్యవసరంగా పరిశీలించి భద్రతా ప్రమాణాలను సమీక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకముందే తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజాసంఘాలు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ప్రయాణికుల అవస్థలు

**- భద్రాచలం-వెంకటాపురం రూట్‌లో బస్సుల కొరత**

**- ఎటు వెళ్ళిన రెండు గంటల ప్రయాణం**




అవస్థలు పడుతున్నారు

చర్ల, జులై 14 (విజన్ ఆంధ్ర): భద్రాచలం నుండి చర్ల మీదుగా వెంకటాపురం వరకు సాగే ప్రయాణం నిత్యం వేలాది మందికి జీవనాధారం కానీ, ప్రస్తుతం ఈ మార్గంలో బస్సుల సంఖ్య గణనీయంగా తగ్గడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, ఒకప్పుడు పదిహేనుకు పైగా సర్వీసులు అందుబాటులో ఉండగా, ఇప్పుడు ఆ సంఖ్య ఏడుకు పడిపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది

**తగ్గిన సర్వీసులు - పెరిగిన కష్టాలు**

గతంలో ఉన్న బస్సు సర్వీసులతో పోలిస్తే ప్రస్తుతం సర్వీసుల సంఖ్య సగానికి పైగా తగ్గిపోయింది, ఫలితంగా బస్టాండ్లలో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది, నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో బస్సులు సరిపడా లేకపోవడంతో, ఉన్న బస్సుల్లోనే జనం కిక్కిరిసి ప్రయాణించాల్సి వస్తోంది , సీటు దొరకడం మాట అటుంచి, కనీసం నిలబడటానికి కూడా స్థలం లేక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు

**వాగ్వాదాలకు దారితీస్తున్న రద్దీ**

బస్సుల రాకలో జాప్యం, రద్దీ పెరగడం వల్ల ప్రయాణికుల మధ్య తరచుగా వాగ్వాదాలు, చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి, అత్యవసర పనుల మీద వెళ్లేవారు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ, అసలు సమయానికి బస్సులు లేకపోవడం వల్ల ఆ సౌకర్యం తమకు శాపంగా మారిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

**దుర్భరమైన రహదారి - ఆందోళనలో ప్రయాణికులు**

ప్రధాన రహదారి పరిస్థితి ఇప్పటికే అంతంతమాత్రంగా ఉంది, దీనికి తోడు రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణించడం వల్ల ఎమర్జెన్సీ సమయాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి, ఉన్న ఏడు బస్సులు కాక ఒకటి రాజమండ్రికి, ఈ ఏడు బస్సులలో రెండు చర్లకు, ఐదు వెంకటాపురానికి పరిమితం కావడం వల్ల ప్రయాణికుల డిమాండ్‌కు తగ్గట్టుగా సర్వీసులు లేక వ్యవస్థ కుంటుపడుతోంది, గతంలో భద్రాచలం నుంచి చర్ల మీదిగా వెంకటాపురం చేరుకొని ఏటూరునాగారం వరకు బస్ సర్వీసు ఉండేది దానివల్ల వరంగల్ లాంటి దూర ప్రయాణాలు చేసే ప్రయాణికులకు ఎంతో సౌలభ్యంగా ఉండేది, ఉచిత బస్తులతో బస్ సర్వీస్ల సంఖ్యను తగ్గించారా లేక బస్సుల కొరతల కొరతతో బస్ సర్వీసులు అనేది స్పష్టంగా తెలీయక పొగుడంతో మహిళా ప్రయాణికులు మండి పడుతున్నారు

**పల్లె వెలుగు బస్సులు ప్రధాన రహదారికే అంకితం**

పల్లె వెలుగు బస్సులు పల్లెల్లోకి ప్రవేశించిన దాకలాలు లేవు, కొన్ని ప్రాంతాలలో రహదారి మార్గం చక్కగా ఉన్నప్పటికీ పల్లె వెలుగు బస్సులు ఆ ప్రాంతాలకు వెళ్ళకపోవడం గమనార్హం , భద్రాచలం డివిజన్ గిరిజన ప్రాంతం కావడంతో గిరిజనులు బస్సులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు, ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, అధికారులు తక్షణమే స్పందించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు, బస్సుల సంఖ్యను పెంచడం ద్వారా మాత్రమే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించాలని వారు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



# 'నసీర్ మిర్జా' సమర్పణలో సుమనోహరంగా సాగిన 'సోమా డాలీ' మ్యూజికల్ నైట్



హైదరాబాద్ జులై 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ప్రఖ్యాత ఈవెంట్ ఆర్గనైజర్ "నసీర్ మిర్జా" సమర్పణలో సుమనోహరంగా, శ్రవణానందకరంగా సాగిన ప్రముఖ గాయని 'సోమా డాలీ' మ్యూజికల్ నైట్ ప్రేక్షకులను విశేషంగా అలరించింది, ఆకట్టుకుంది, పాటల పల్లకిలో విహరింపజేసింది. సోమవారం సాయంత్రం రవీంద్రభారతి మెయిన్ హాల్ , సఫాబాద్, హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన ఈ సుమధుర గాయని 'సోమా డాలీ' హిందీ హిట్ పాటల ముజికల్ నైట్ అలాగే హైదరాబాదీ మత్వాలే 'హమీద్ కమల్', కామెడీ కింగ్ 'ఖాదర్ షరీఫ్' కామెడీ కి షామ్ కార్యక్రమం ఎంతో సుమనోహరంగా సాగుతూ ప్రేక్షకుల హృదయాలను దోచుకుంది, సమ్మోహితులను చేసింది. ఈ మ్యూజికల్ నైట్ అండ్ కామెడీ షో కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫస్ట్ ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా 'ఇఫ్తేఖర్ షరీఫ్" హాజరై ఎంతో సుమధురంగా పాటలు పాడి ప్రేక్షకులను ఉర్రూతలూగించిన 'సోమా డాలీ' పాటలను తాను ఆస్వాదించానని తెలుపుతూ, ఆమెకు ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని కిటాబు ఇచ్చి సత్కరించారు. అలాగే ఇతర గాయనీ గాయకులను కామెడీ కళాకారులను సత్కరించారు. ఈ మ్యూజికల్ నైట్ లో 'సోమ డాలీ' తో పాటుగా గాయని ఆమ్నా జీ, జి. నగేష్, ప్రముఖ గాయకులు యాదగిరి, షేక్ అబ్బాస్, బర్కత్ షరీఫ్ అద్భుతంగా పాడి అందరినీ అలరించారు. ఈ మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా, మహమ్మద్ ముస్కిన్ మిశ్రీ, సయ్యద్ సికందర్ అలీ, బర్కత్ షరీఫ్, నంద పండత్, స్వప్న దత్తా ఇతర ప్రముఖులు పాల్గొని ఎంతో అద్భుతమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి అందరినీ సంగీత ప్రపంచంలో విహరింపజేసి, ఆనందింపజేసిన కార్యక్రమ నిర్వాహకుడు ఆర్గనైజర్ 'నసీర్ మిర్జా' ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమానికి జావిద్ నసీం యాంకర్ గా వ్యవహరించారు.

# బాధితురాలుకు రూ 25 వేల ఆర్థిక సహాయం అందజేసిన కాంగ్రెస్ నాయకుడు కపిలేశ్వర్



మల్కాజిగిరి, జూలై 14,(విజన్ ఆంధ్ర): ఓ బాధితురాలుకు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతమల్ల కపిలేశ్వర్ రూ 25,000 ఆర్థిక సహాయం అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. కాకతీయనగర్ 187 డివిజన్ పరిధిలోని శివ నగర్ లో ఎండీ సాజిదా బేగం ఇంటిలో షాట్ సర్క్యూట్ ఏర్పడి నిత్యవసర వస్తువులు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, నియోజకవర్గ ఇంచార్జీ తోట లక్ష్మి కాంత్ రెడ్డి,బి బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి కే శ్రీనివాస్ సూచనతో సోమవారం కాకతీయనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతమల్ల కపిలేశ్వర్, బాధితురాలు కుటుంబానికి రూ 25,000 రూపాయలను శివనగర్ కమిటీ సభ్యుల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ 187 డివిజన్ కాకతీయనగర్ డివిజన్ ప్రెసిడెంట్ యూసుఫ్ బాయ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజు యాదవ్, సీనియర్ నాయకు లు గిరియాదవ్, రొట్టెల ధరన్, సాయి, నరేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**- ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య**



మల్కాజిగిరి, జూలై 14,(విజన్ ఆంధ్ర): ప్రతి ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను పాటించాలని ట్రాఫిక్ ఏసిపి సుబ్బయ్య సూచించారు. మంగళవారం ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూ ట్ ఆధ్వర్యంలో గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని జ్యోతి నగర్ లిల్లీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డుపై మీ వాహనంపై వెళుతున్నప్పుడు మీ భద్రతతో పాటు, ఇతరుల భద్రత కోసం ట్రాఫిక్ నియమ,నిబంధనలను పాటించాల్సిన అవశ్యకత ఉందన్నారు. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడప రాదని, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతివేగం, ట్రిపుల్ రైడ్ వంటివి మానుకోవాలన్నారు. ఈ విషయాలపై ఇంటికి వెళ్లిన తరువాత మీ కుటుంబ సభ్యులకు బంధుమిత్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీటన్నింటిపై స్క్రీన్ పై స్లైడ్స్ వేసి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ట్రాఫిక్ సిఐ నరసింహులు, ట్రాఫిక్ ఇన్స్టిట్యూట్ ఎస్సై సోమనాదం, పాఠశాల కరస్పాండెంట్ షేక్ సయ్యద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# అద్దె వాహనాల బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**- హైర్ వెహికల్స్ అసోసియేషన్.**



ములుగు, జూలై 14, విజన్ ఆంధ్ర ప్రతినిధి : రాష్ట్రంలోని అద్దె వాహనాల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ లితెలంగాణ హైర్ వెహికల్స్ అసోసియేషన్లి ప్రతినిధులు ములుగు జిల్లా కలెక్టర్కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ గత 18 నెలలుగా పెండింగ్లో ఉన్న అద్దె వాహనాల బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అమలులో ఉన్న అద్దె చార్జీలు 2017లో నిర్ణయించినవేనని, అప్పటి నుంచి డీజిల్ ధరలు, డ్రైవర్ల వేతనాలు, ఈఎంఐలు, బీమా, వాహనాల నిర్వహణ వ్యయాలు భారీగా పెరిగాయని తెలిపారు. ఈ నేపథ్యంలో నెలవారీ అద్దె చార్జీలను రూ. 34 వేల నుంచి రూ. 55 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతి నెల 5వ తేదీలోపు అద్దె బిల్లులు చెల్లించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. తమ వినతిపత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్ను కోరారు. ఈ కార్యక్రమంలో లిఅసోసియేషన్ ప్రతినిధులు శరత్ కుమార్, రాజేశ్ కుమార్, భద్రయ్య, భీకారు, కక్కెర్ల నరేష్, సంతోష్, అనంతరావులి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటన నేపథ్యంలో కొత్తకోటలో ట్రాఫిక్ దారి మళ్లింపు

**- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జూలై 15న కొత్తకోట పర్యటన నేపథ్యంలో ప్రజల భద్రత, ట్రాఫిక్ సజావుగా నిర్వహించేందుకు తాత్కాలిక ట్రాఫిక్ దారి మళ్లింపు అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు వనపర్తి ఃః ఆత్మకూరు పెద్దగూడెం రాయన్పేట ఎన్హెచ్-44 మీదుగా ఆత్మకూరు ఃః వనపర్తి ఎన్హెచ్-44 రాయన్పేట పెద్దగూడెం మీదుగా -వనపర్తిః మహబూబ్నగర్/హైదరాబాద్: పెద్దమందడి ఎన్హెచ్-44 మీదుగా -మహబూబ్నగర్ః వనపర్తి: ఎన్హెచ్-44 నుండి పెద్దమందడి మార్గం ఈ సమయంలో అనవసరంగా కొత్తకోట పట్టణంలోకి ప్రవేశించవద్దని, ట్రాఫిక్ పోలీసుల సూచనలు, మార్గ సూచిక బోర్డులను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ను సజావుగా నిర్వహించడం సాధ్యమవుతుందన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి

**- నిర్ణీత గడువులోపు ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పూర్తి చేయాలి**

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**



ములుగు జూలై 14, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రజలందరి సహకారంతో విజయవంతం చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లాలోని 2,36,970 మంది ఓటర్లలో ఇప్పటివరకు 1,46,583 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజ్ చేయబడి 61.86 శాతం పురోగతి నమోదైందని తెలిపారు. ఇంకా 82,994 ఫారాలు 38.14 శాతం డిజిటలైజేషన్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు వంద శాతం లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్నికల అధికారులు, బీఎల్ఓలు, బీఎల్ఏలు, రాజకీయ పార్టీలు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ప్రతి ఇంటిని బీఎల్ఓలు తప్పనిసరిగా సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, పూర్తిగా నింపిన ఫారాలను తిరిగి సేకరించాలని సూచించారు. ఇంటికి తాళం వేసి ఉంటే మరోసారి వెళ్లి ఫారాలు సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను రోజువారీగా బీఎల్ఓ యాప్లో డిజిటలైజ్ చేసి, పెండింగ్ లేకుండా నమోదు చేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. డేటా నమోదు సమయంలో ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. బీఎల్ఓలు ప్రజలతో మర్యాదగా, స్నేహపూర్వకంగా మమేకమై వారి సందేహాలను నివృత్తి చేయాలని, అర్హులైన ప్రతి ఓటరికి అవసరమైన సమాచారం అందించాలని తెలిపారు. బీఎల్ఏలు కూడా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా పనిచేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు కూడా ఎన్నికల సిబ్బందికి పూర్తి సహకారం అందించి, తమ వివరాలను సరిచూసుకుని ఎన్యుమరేషన్ ఫారాలను సక్రమంగా నింపి, అవసరమైన పత్రాలతో నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్ఓలకు అందించాలని కలెక్టర్ కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వకుండా, ఓటరు జాబితా ఖచ్చితత్వాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు నమోదై ఉన్న ఏ ఓటరినీ ముందస్తు నోటీసు ఇవ్వకుండా తొలగించే అవకాశం లేదని,అందువల్ల ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా, ప్రతి ఓటరు తప్పనిసరిగా తన ఎన్యుమరేషన్ ఫారాన్ని పూర్తిగా నింపి, నిర్ణీత గడువులోపు సంబంధిత బీఎల్ఓకు సమర్పించాలని కోరారు. ప్రతి ఓటరు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో భాగస్వామి కావడం ద్వారా ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు సహకరించాలన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ఎలాంటి అపోహలకు తావివ్వకుండా ఎన్నికల సంఘం జారీ చేస్తున్న అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

# సి.యం. పర్యటనను విజయవంతం చేయాలి

**- పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పిలుపు**

**- అధికారులకు దిశానిర్దేశం చేసిన కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి. సునీత రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : కొత్తకోట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి విచ్చేయుచున్న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు అధికారులు సమష్టిగా పని చేసి విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సూచించారు. మంగళవారం కొత్తకోటలో సి.యం సెక్యూరిటీ ఎ.ఎస్.ఎల్ కార్యక్రమానికి సి.యం స్పెషల్ సెక్యూరిటీ అధికారులతో పాటు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డి సునీత రెడ్డి తో కలిసి పాల్గొన్నారు. కొత్తకోట సంత వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుండి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు ఎ.ఎస్.ఎల్ కాన్వాయి నిర్వహించిన అనంతరం పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రికి విద్యాశాఖ పై ఉన్న ప్రత్యేక దృష్టి కారణంగా కేవలం ఒక పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి విచ్చేస్తున్నారని, ఈ ప్రభుత్వ కార్యక్రమానికి అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ హెలిప్యాడ్ ఏర్పాటు, బారికేడింగ్ బాధ్యతలను ఆర్ అండ్ బి అధికారులకు బాధ్యతలు అప్పగించి దిశానిర్దేశం చేశారు. వేదిక, విద్యార్థులను తీసుకురావడం, పద్ధతిగా కూర్చోబెట్టడం జిల్లా విద్యా అధికారికి బాధ్యతలు అప్పగించారు. పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, లైవ్ కవరేజీ వంటివి చూసుకోవాలని సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. పారిశుధ్యం విషయంలో రాజీ లేకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ కంట్రోల్, వేదిక వద్ద ముఖా ముఖి కార్యక్రమం సజావుగా జరిగే విధంగా పోలీస్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కార్యక్రమం ఆసాంతం ప్రశాంతంగా నిర్వహించే విధంగా చూడాలని పోలీస్ అధికారులకు, బాధ్యతలు అప్పగించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఎన్ ఖీమ్యా నాయక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, సి.యం. సెక్యూరిటీ ఇంచార్జి శ్రీధర్, జిల్లా అధికారులు తదితరులు ఉన్నారు.

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

**- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**- 40 మంది రైతులకు ట్రాన్స్ఫార్మర్ల పంపిణీ**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూలై 14 (విజన్ ఆంధ్ర) : పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల పంపిణీ కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పాల్గొని 40 మంది రైతులకు విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమన్వయంతో రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు డీడీలు చెల్లించి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ల కోసం సంవత్సరాల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అలాంటి పరిస్థితికి పూర్తిగా ముగింపు పలికిందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రస్తుతం రైతులు డీడీ చెల్లించిన రెండు నుంచి మూడు నెలల వ్యవధిలోనే ట్రాన్స్ఫార్మర్లు మంజూరవుతున్నాయని, మంజూరైన ట్రాన్స్ఫార్మర్లను పారదర్శకంగా రైతులకు అందజేస్తున్నామని చెప్పారు. వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు సాగునీటి సౌకర్యాలు మెరుగుపడేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వెంటనే పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ట్రాన్స్ఫార్మర్లు మంజూరైన ప్రతి రైతుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీలైనంత త్వరగా వాటిని క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేయాలని, పనుల్లో నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు నాణ్యమైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో సాకారమైన సొంతింటి కల

**- కాంగ్రెస్ పార్టీకి జీవితకాలం రుణపడి ఉంటాం లబ్ధిదారులు**

**- కంచిరావుపల్లి తండా, రంగాపురంలో 23 గృహప్రవేశాలు**

**- నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : పేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు. మంగళవారం పెబ్బేరు మండలం కంచిరావుపల్లి తండా, రంగాపురం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 23 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారికి నూతన వస్త్రాలు అందజేసి, ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. నూతన గృహాల్లోకి ప్రవేశించిన లబ్ధిదారులు ఆనందంతో భావోద్వేగానికి గురయ్యారు. ఎన్నో ఏళ్లుగా పూరి గుడిసెలు, రేకుల ఇళ్లలో జీవిస్తూ.. పాములు, తేళ్లు, విషపురుగుల భయంతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీశామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు తమ సమస్యలను పట్టించుకోలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే తమ సొంతింటి కల నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. మా కుటుంబాలకు భద్రత, సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని అందించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాం. సొంత ఇంటి కలను నిజం చేసిన కాంగ్రెస్ పార్టీకి జీవిత కాలం రుణపడి ఉంటాం" అని లబ్ధిదారులు భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. నిరుపేదల ముఖాల్లో ఆనందం చూడటమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని నియోజకవర్గ పరిధిలో మిగిలిన అర్హులకూ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ గృహప్రవేశాల కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. వారితో పాటు పెబ్బేరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు జాపర్ల రాంరెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, యుగేందర్ రెడ్డి, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పేదరిక నిర్మూలన అందరి బాధ్యత

***బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థే ప్రధాన శాపాలు***

***డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి. కృష్ణయ్య***




వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : నేటి ఆధునిక ప్రపంచం లో పేదరికాన్ని నిర్మించాలని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి కృష్ణయ్య అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా కార్యదర్శి శ్రీమతి జి. కళార్చన గారి ఆదేశాలనుసారశీ మంగళవారం వనపర్తి జిల్లా గొల్లపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ వద్ద చట్టాలపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికానికి బాల్య వివాహాలు, బాల కార్మికులు ముఖ్య కారణాలని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా 18 సంవత్సరాల లోపు బాలికకు, 21 సంవత్సరాల లోపు బాలురకు వివాహాలు జరిపించడం చట్టరీత్యా నేరం అని తెలియజేశారు. తల్లిదండ్రుల సంరక్షణ చట్టం, మోటార్ వాహనాలు చట్టం గురించి వివరించారు మరియు ఉచిత న్యాయ సలహాలు పొందడానికి 15100 టోల్ ఫ్రీ నెంబర్ కు కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమాలలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి, పారా లీగల్ వాలంటీర్ బి.సురేష్, గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్స్ మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఓటే వజ్రాయుధం - ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

**"సర్" ప్రక్రియను సమీక్షించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి**



వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో పట్టణ "సర్" (ఓటర్ జాబితా సవరణ) ప్రక్రియను పార్టీ ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ బీఎల్ఏలతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా పట్టణంలో మందకొడిగా సాగుతున్న ఓటర్ నమోదు కార్యక్రమాన్ని మరింత చురుకుగా చేపట్టాలని పిలుపునిచ్చారు. నిజమైన ప్రజాసంక్షేమ పాలన రావాలంటే నీతిమాలిన రాజకీయాలు పోయి నిజమైన ఓటర్లు గుర్తింపు పొందాలన్నారు. నాయకులు, కార్యకర్తలు, బీఎల్ఏలు నిత్యం ప్రజల్లో ఉండి ఓటర్ నమోదుతో పాటు వారి సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వచ్చే 10 రోజులు బూతులవారిగా తిరిగి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. సమీక్షలో పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్, గట్టు యాదవ్, బి.లక్ష్మయ్య, వాకిటి శ్రీధర్,మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, కురుమూర్తి యాదవ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# "సర్" కార్యక్రమాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**- 80% పూర్తిచేసిన బిఎల్ ఓ లను సన్మానం**





వనపర్తి జిల్లా ప్రతినిధి, జులై 14 (విజన్ ఆంధ్ర) : సమగ్ర ఓటర్ జాబితా సవరణ "సర్" కార్యక్రమాన్ని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మంగళవారం పరిశీలించారు. పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో బిఎల్ ఓ లు, కాంగ్రెస్ నాయకులు నిర్వహిస్తున్న నమోదు ప్రక్రియను సందర్శించి పురోగతిపై ఆరా తీశారు. "సర్" పత్రాల నమోదులో ఎదురవుతున్న ఇబ్బందులు, ప్రజల సహకారం గురించి బిఎల్ ఓలను అడిగి తెలుసుకున్నారు.నమోదు ప్రక్రియను పొరపాట్లు లేకుండా, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 80 శాతం నమోదు పూర్తిచేసిన బిఎల్ ఓలను ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించి అభినందించారు. ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో నమోదు కావడం ప్రజాస్వామ్య బలోపేతానికి కీలకమన్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, పెబ్బేరు మండల అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి, పెబ్బేరు పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, సురేందర్ గౌడ్, రంజిత్ కుమార్, యుగేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పలు గ్రామలో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు.



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై14(విజన్ ఆంధ్ర); వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలోని చౌటపల్లి, కొంకపాక, గోపనపల్లి అనంతారం గ్రామలలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో స్టానికా సర్పంచ్లు వేంకటేశ్వర రావు,విజయఅశోక్ తో కలిసి పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి.ఈ సందర్భంగా ఇస్లావత్ సావిత్రి మాట్లాడుతూ ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తు, ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీకి చెందిన బీఎల్ఎ లను భాగస్వామ్యం చేయాలని, ప్రక్రియ పారదర్శకంగా కొనసాగేలా చుడలాని నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం అని,సర్పంచ్లకు, గ్రామ అధ్యక్షులకు, పార్టీ బీఎల్ఎ లకు సూచించారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షులు వేంకటేశ్వర రావు మొదటి సారి గ్రామానికీ వచ్చిన మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇస్లావత్ సావిత్రి ని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తె లిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎం పి టి సి బోట్ల మహేంద్ర,అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు రాజు,పార్టీ బి ఎల్ ఎ లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14 ( విజన్ ఆంధ్ర ) : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా డిజిటలైజేషన్ ను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు. మంగళవారం పరిగి నియోజకవర్గం చౌడాపూర్ మండలంలో తహసిల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, మరికల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ పంట సాగును జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆకస్మిక పర్యటన గావించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునే విధంగా బిఎల్ఓ లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి తీసుకునే క్రమంలో ఫారాలు పూరించడంలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాల్సిన బాధ్యత బిఎల్ఓ లపై ఉందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని అదేవిధంగా మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యాధికారికి సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల విద్యా బోధనను పరిశీలించారు. విద్యార్థుల పడక గదులను, టాయిలెట్లు, మధ్యాహ్న భోజన వంటకాలను కలెక్టర్ పరిశీలించారు. నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిబ్బందికి సూచించారు. విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. మరికల్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించారు. ఆయిల్ ఫామ్ సాగు అధిక లాభాలు ఉంటాయని, ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. కలెక్టర్ తో పాటు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) సచిన్ బస్వరాజ్ గుట్టూరు, జెడ్పి సీఈఓ సుదీర్, డిఎంహెచ్ఓ సుధాకర్ లాల్ లు ఉన్నారు.

## ఆటలతోనే అభ్యాసానికి బాట - కలెక్టర్ సత్యశారద

**- కరీంబాద్ ప్రీ-ప్రైమరీ విభాగం సందర్శన**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై14(విజన్ ఆంధ్ర) : చిన్నారులకు ఆటలు, పాటలు, కథల ద్వారా బోధన అందిస్తే నేర్చుకోవాలనే ఆసక్తి పెరిగి సమగ్ర వికాసం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డా. సత్యశారద అన్నారు.మంగళవారం జీపీఎస్ కరీంబాద్ లోని ఫ్రీ ప్రైమరీ పాఠశాలను సందర్శించి బోధనఅభ్యాస కార్యక్రమాలను పరిశీలించారు.ప్రీ-ప్రైమరీ తరగతుల్లో ప్లే వే మెథడ్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, బోధనఅభ్యాస సామగ్రి (టీఎల్ఎం) వినియోగం, చిన్నారుల భాగస్వామ్యాన్ని పరిశీలించిన కలెక్టర్.. చిన్నారులతో మమేకమై వారితో మాట్లాడారు. అనంతరం పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ రైమ్స్ చెప్పిస్తూ ఉత్సాహపరిచారు.ప్రతి ప్రీ-ప్రైమరీ పాఠశాలలో ప్లే వే మెథడ్, యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్, టీఎల్ఎం వినియోగంతో ఆనందదాయకమైన అభ్యాస వాతావరణాన్ని కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, డీఈఓ రంగయ్యనాయుడు, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, ఏఎంఓ ఉంద్రాతి సుజన్ తేజ, ప్రధానోపాధ్యాయులు జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి- జిల్లా కలెక్టర్ రాజర్షిషా

**- ఉపాధి కల్పనకు జిల్లా యంత్రాంగం పూర్తి మద్దతు**
**- ఎస్టీయూ భవన్‌లో ఘనంగా ఉద్యోగ మేళా.. నియామక పత్రాల అందజేత**




ఆదిలాబాద్, జూలై 14 (విజన్ ఆంధ్ర): జిల్లాలోని నిరుద్యోగ యువత జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలను పొందాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎస్టీయూ భవనంలో జిల్లా ఉపాధి కల్పన శాఖ, శ్రీ అష్టలక్ష్మీ స్పిన్నింగ్ మిల్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ ఉపాధి మేళాను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తుండటంతో ఈ జాబ్ మేళాకు 1000 మందికి పైగా అభ్యర్థులు హాజరై పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్స్ యాజమాన్యం తమ పరిశ్రమలోని ఖాళీల వివరాలతో ముందుకు రావడం సంతోషకరమన్నారు. టెక్స్‌టైల్ పరిశ్రమలలో టెక్నీషియన్లు, సూపర్‌వైజర్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు వంటి విభాగాల్లో నిరంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఇప్పటికే ఈ పరిశ్రమలో వందలాది మంది మహిళలు ఎంతో సురక్షితమైన వాతావరణంలో షిఫ్టుల వారీగా విజయవంతంగా పనిచేస్తున్నారని ఆయన గుర్తుచేశారు. ఈ జాబ్ మేళా ద్వారా ఎంపికైన అభ్యర్థులకు సంస్థ తరపున ఆరు నెలల పాటు ప్రత్యేక ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఏ ఉద్యోగంలోనైనా శిక్షణ అనేది అత్యంత కీలకమని, ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనా అభ్యర్థులు కష్టపడి పని నేర్చుకోవాలని సూచించారు. ఆరు నెలల శిక్షణ కాలంలో అభ్యర్థులు చూపే ప్రతిభ, వారి పనితీరు ఆధారంగా ఉద్యోగాలను పర్మనెంట్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇప్పటికే జిల్లాలో 4 నుంచి 5 జాబ్ మేళాలు నిర్వహించామని, ఈరోజు అవకాశం రాని అభ్యర్థులు నిరాశ పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో స్థానిక కంపెనీలతో కలిసి మరిన్ని మేళాలు నిర్వహిస్తామని, యాజమాన్యాలు ముందుకు వస్తే జిల్లా యంత్రాంగం నుండి వంద శాతం మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం జాబ్ మేళాలో ఎంపికైన పలువురు అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జాబ్ మేళాను విజయవంతంగా నిర్వహించినందుకు గాను అధికారులను, స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా, అష్టలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ప్రతినిధులు విక్రాంత్ కేతన్, గణేష్, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైన్స్‌పై పరిశోధనా దృక్పథం పెంపొందించుకోవాలి - కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి బ్యూరో జులై 14(విజన్ఆంధ్ర) : విద్యార్థులు సైన్స్‌పై అవగాహనతో పాటు పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన మంగళవారం రామారెడ్డి మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామంలో పర్యటించిన కలెక్టర్, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. - ఇందిరమ్మ ఇండ్లు గ్రామానికి మంజూరైన 25 ఇందిరమ్మ ఇండ్లలో 10 ఇళ్ల నిర్మాణం పూర్తై లబ్ధిదారులు గృహప్రవేశం చేశారు. మిగిలిన 15 ఇళ్లు రూఫ్ లెవెల్‌లో ఉన్నాయని అధికారులు వివరించారు. నిర్మాణాన్ని వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యస్ ఐ ఆర్ ప్రక్రియ: సుమారు 80 శాతం పని పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేస్తామని మండల తహసీల్దార్ ఉమామలత తెలిపారు. పాఠశాల తనిఖీ శాస్త్రీయ దృక్పథం ప్రోత్సాహం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన బోధనపై ఉపాధ్యాయులను అభినందించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ల్యాబ్ ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తరించాలని సూచించారు. పక్షుల పరిశీలన పాఠశాల పరిసరాలకు వచ్చే పక్షుల రాకపోకలు, వాటి ప్రవర్తన, సంఖ్య, జీవన విధానంపై విద్యార్థులు ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో 20 రోజులపాటు పరిశీలన నిర్వహించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఇలాంటి పరిశోధనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనా విధానం, పరిశీలనా నైపుణ్యం పెంపొందుతుందని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 41 అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఉన్న పాఠశాలలన్నీ ఈ కార్యక్రమాన్ని ఒక సవాల్‌గా స్వీకరించి అమలు చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మల్లికార్జున్, పీడీ హౌసింగ్ విజయ్‌పాల్ రెడ్డి, మండల తహసీల్దార్ ఉమామలత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు విస్తరణకు వేగం పెంచాలి

**- ప్రతి ఏఈఓ 20 రోజుల్లో 15 ఎకరాలు లక్ష్యంగా పనిచేయాలి**
**- తగ్గుతున్న భూగర్భ జలాల దృష్ట్యా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు చైతన్యపరచాలి**
**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-14(విజన్ ఆంధ్ర)ది: జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచడంతో పాటు, నీటి లభ్యతకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, పంటల ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలు ప్రస్తుతం దిగుబడులు ఇవ్వడం ప్రారంభించాయని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరుగుతుండటంతో ఇతర రైతుల్లోనూ ఈ పంటపై ఆసక్తి పెరుగుతోందని కలెక్టర్ తెలిపారు. గత 45 రోజుల్లోనే సుమారు 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తయ్యాయని, ఇదే ఊపుతో ముందుకెళితే జిల్లాకు నిర్దేశించిన 1,100 ఎకరాల లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చన్నారు. ప్రతి క్లస్టర్‌లో 15 ఎకరాలు ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వచ్చే 20 రోజుల్లో కనీసం 15 ఎకరాలను ఆయిల్ పామ్ సాగుకు మార్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి క్లస్టర్‌లో ఈ నెలాఖరులోగా కనీసం 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఒకే ప్రాంతంలో 30 నుంచి 40 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరిగితే అవసరమైన బోర్‌వెల్లు, ప్రత్యేక విద్యుత్ లైన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని కలెక్టర్ తెలిపారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కార చర్యలు చేపడతామన్నారు. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు సుమారు ఒకటిన్నర మీటరు మేర తగ్గాయని కలెక్టర్ పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలు నిండితేనే దిగువ ప్రాంతాలకు నీటి లభ్యత ఉంటుందని, ప్రస్తుతం పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని చెప్పారు. జిల్లాలోని 90 శాతం చెరువుల్లో 50 శాతం కన్నా తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలు సాగు చేసేలా నిరంతరం అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన విక్రేతలు, ఆదర్శ రైతులు గ్రామస్థాయిలో వాస్తవ పరిస్థితులను రైతులకు వివరించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల పంటలకే కొనుగోలు సదుపాయం ఉంటుందని, ఇతర పంటలకు బోనస్ వర్తించదనే విషయాన్ని ప్రతి రైతుకు స్పష్టంగా తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు బీమా క్లెయిమ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. 20 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జనగామ జిల్లాలో ప్రతి క్లస్టర్‌లో మహిళా శక్తి కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్న తరహాలో జిల్లాలో కూడా ప్రతి క్లస్టర్‌కు ఒక మహిళా శక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈవో కళ్యాణ్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఉద్యానవన శాఖ అధికారి శ్యాం ప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతినగర్‌లో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన కంది శ్రీనివాస రెడ్డి



ఆదిలాబాద్, జులై 14 (విజన్ ఆంధ్ర): ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ప్రతి పేదవాని సొంతింటి కలను నెరవేరుస్తోందని ఆదిలాబాద్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో లబ్ధిదారులు జరీనా బేగం, సంగర్తి ప్రియాంక, రజితలకు చెందిన నూతన ఇందిరమ్మ ఇండ్లను ఆయన పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలను బహుకరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, కాంగ్రెస్ నాయకులు కొండా గంగాధర్, బండారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు 'సర్' ప్రక్రియపై ఆర్డీవో సుమ హెచ్చరిక



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై14(విజన్ ఆంధ్ర); ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'సర్' ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ ఆర్డీవో (రెవెన్యూ డివిజనల్ అధికారిణి) సుమ హెచ్చరించారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్నారం షరీఫ్,అన్నారం పెద్ద తండా,కోంకపాక గ్రామాల్లో నిర్వహిస్తున్న 'సర్' డేటా డిజిటలైజేషన్ ప్రక్రియను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీవో శంకర్ నాయక్‌లతో కలిసి రికార్డులను, ఓటరు నమోదు మార్పులు చేర్పులు తొలగింపు సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆర్డీవో సుమ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాలతో పోలిస్తే పర్వతగిరి మండలంలో ఎన్యూమరేషన్ ప్రక్రియ అత్యంత నత్తనడకన సాగడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మందగించడంపై అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఓటర్లు ఫారాలను నింపి అందజేయడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.ఎన్యూమరేషన్ ఫారాల్లో పేర్లు ఇతర వివరాలు నమోదు చేయడంలో బీవోలు, బిఎల్ఎలు ఓటర్లకు సహకరించాలని సూచించారు. తహసీల్దార్, ఎంపీడీవోలు ప్రతిరోజూ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, సిబ్బందిని సమన్వయం చేసుకొని పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ హరిత,ఎపియం రాజిర్,కార్యదర్శి రఘు,స్థానిక ఉప సర్పంచ్ అనిత,బిఎల్వోలు,బిఎల్ఎలు మేడిశెట్టి కరుణాకర్, స్వప్న, అనిత, నర్మద,కందికట్ల అనిల్, బోట్ల మధు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంపై అవగాహన కల్పించిన జిల్లా కలెక్టర్ డా. సత్యశారద

**- కలెక్టర్ చైతన్యంతో కదిలిన ఓటర్లు**



వరంగల్ జిల్లా ప్రతినిధి జూలై14(విజన్ ఆంధ్ర) : ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ డా. సత్యశారద మంగళవారం వరంగల్ నగరంలోని చింతల్, లెనిన్‌నగర్, రంగసాయిపేట ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లతో మాట్లాడిన కలెక్టర్, ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొని బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) పూర్తి సహకారం అందించాలని కోరారు. చింతల్ లో మైనారిటీ ఓటర్లు ఎక్కువగా ఉన్నందున వారి ఓటు భద్రంగా ఉంటుందని, ప్రతి ఒక్కరు వారి వారి ఓటరు వివరాలను సకాలంలో అందజేసి, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్ఓలకు అందించాలని సూచించారు.ఓటరు జాబితా స్వచ్ఛంగా, పారదర్శకంగా రూపొందేందుకు ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్న కలెక్టర్, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకునేలా బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ పరిశీలనలో కిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ తదితరులు జిల్లా కలెక్టర్ వెంట ఉన్నారు.



## నైని బ్లాక్ కోసం మంత్రులు ముఖ్యమంత్రి కొట్లాడుకుంటున్నారు

**- సింగరేణి నీ బిఆర్ ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు బంగారు బాతు లాగా వాడుకుంటున్నాయి**
**- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి**



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14,(విజన్ ఆంధ్ర ) : సింగరేణి నీ బిఆర్ ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు బంగారు బాతు లాగా వాడుకుంటున్నాయని, నైని బ్లాక్ కోసం మంత్రులు, ముఖ్యమంత్రి కొట్లాడుకుంటున్నారని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, గంగవరపు కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం సింగరేణి భరోసా యాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ 3 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్ లో వారు మీడియతో మాట్లాడారు.మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు కోల్ ఇండియా లో 2 లక్షల 60 వేల కోట్ల కుంభకోణం జరిగిందని,మంత్రులు ఇష్టం వచ్చిన రీతిలో కోల్ బ్లాక్ లను నామినేషన్ పద్ధతిలో అమ్ముకున్నారని ఆరోపించారు.కొందరు మంత్రులను సైతం బొగ్గు కుంభకోణం లో అరెస్ట్ చేశారని గుర్తుచేశారు.మణుగూరు గని 3 డీప్ సైడ్ ఎక్స్టెన్షన్ విషయం లో కార్మికులకు త్వరలో శుభ వార్త చెపుతానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి లో సంబరాలు చెయ్యాలని ఆదేశాలు ఇచ్చిందని,సింగరేణిలో ఎందుకు సంబరాలు చెయ్యాలో కాంగ్రెస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. సింగరేణి లో కార్మికులకు జీతాలు ఇవ్వడానికి యాజమాన్యం బ్యాంక్ ల చుట్టూ తింపుతుందన్నారు.సింగరేణి ఈరోజు మేడిపండు లాగా ఉన్నదని,సింగరేణి అంటేనే తెలంగాణకు గౌరవం అని అన్నారు.దక్షిణ భారతదేశంలో ఉన్నటువంటి ఏకైక బొగ్గు సంస్థ సింగరేణి అని,సింగరేణి సంస్థ నష్టాల్లో, కష్టాల్లో ఉందని,ఈరోజు సింగరేణి ఉత్పత్తి తగ్గిపోయిందని పేర్కొన్నారు. జీతాలు ఇవ్వాలంటే బ్యాంకులలో అప్పు తీసుకొని ఇస్తున్న పరిస్థితి నెలకొందని, నరేంద్రమోదీ ప్రధాని అయిన తరువాత దేశంలో ని 15 కంపినిలలో వేలం పాట ద్వారానే కేటాయించడం జరిగిందన్నారు.ఒడిశా లోని నైని బ్లాక్ విషయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. సింగరేణి అధికారుల కార్యాలయలలో ఉన్న బాత్రూం లను సైతం బాగు చేసే ఆర్థిక పరిస్థితులు లెవ్వని కిషన్ రెడ్డి అన్నారు.తన పార్టీ రాజకీయాల గురించి మాట్లాడే సమయం కేసీఆర్ కు దొరికింది కానీ, నైని బ్లాక్ గురించి మాట్లాడే సమయం దొరకలేదని ఇద్దేవ చేశారు. సింగరేణి నీ బిఆర్ ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు బంగారు బాతు లాగా వాడుకుంటున్నాయని బీఆర్ఎస్ హయాంలో కేటీఆర్, హరీష్ రావు, కవిత కను సైగల తో సింగరేణి ని దోచుకున్నారని విమర్శించారు.నైని కోల్ బ్లాక్ నాణ్యమైన బొగ్గు గని అని, 40 వేల కార్మికుల ఆస్తి నైని బ్లాక్ అని పేర్కొన్నారు.సింగరేణి ని బంగారు బాతు లాగా ఎవరికి వచ్చినట్లు వారు దోచుకున్నారన్నారు.కరెంట్, బొగ్గు సింగరేణి నుంచి వాడుకొని రూ .25 వేల 902 కోట్లు సింగరేణికి ఇవ్వకుండా కేసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నాడని అన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేసీఆర్ ఎలా చేసాడో అలానే చేస్తున్నారని ఆరోపించారు.సింగరేణి కి సంబంధించిన డబ్బులు తీసుకునే హక్కు గత బీఆర్ఎస్ కు ఇప్పటి కాంగ్రెస్ పార్టీ కి ఎవరు ఇచ్చారని అన్నారు.సింగరేణి కార్మికుల మీద, ఉత్తర తెలంగాణ మీద ప్రేమ ఉన్న సింగరేణి కి రావాల్సిన 60 వేల కోట్ల రూపాయల బకాయిలు చెల్లించండని స్పష్టం చేశారు. తాడిచెర్ల 1 కమిషన్ల కోసం కేసీఆర్ ప్రవేట్ వాళ్లకు అమ్ముకున్నారని,ఏ అధికారం తో సింగరేణి కి తాడిచెర్ల బ్లాక్ 2 కేటాయిస్తున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారన్నారు.సింగరేణి కార్మికుల పక్షాన నిలబడ్డ దేశ ప్రధాని నరేంద్రమోదీ కి ధన్యవాదాలు తెలిపారు. వేలంలో వచ్చే బొగ్గు బ్లాక్ లు సింగరేణి కి వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు.అంతకు ముందు సింగరేణి అధికారులు కిషన్ రెడ్డి కి ఘనంగా స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి వెంట ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, మల్కాజ్గిరి ఎంపీ, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే లు మహేశ్వర్ రెడ్డి,పాయల్ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియ వేగవంతం..

**- ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలు తిరిగి ఇవ్వాలి..**

**- మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14,(విజన్ ఆంధ్ర ) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) ప్రక్రియ వేగవంతం గా పూర్తి చేయాలని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య మహేష్ అన్నారు. మంగళవారం 54 వ డివిజన్ లో ఎన్యూమరేషన్ ఫారంలు పూర్తి చేస్తున్న కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సల్ల రమ్య మహేష్ మాట్లాడుతూ ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారంలు పూర్తి చేసి తిరిగి బి ఎల్ వో లకు ఇవ్వాలని అన్నారు. ఈ ప్రక్రియ మారో పది రోజులు మాత్రమే ఉందని,చివరి రోజువరకు వేచి చూడకుండా త్వరితగతిన ఫారంలు నింపి అందించలన్నారు. ఎన్యూమరేషన్ ఫారంలు నింపి ఇవ్వకపోతే ప్రభుత్వ పథకాలకు అర్హులు కారని, తర్వాత ఇబ్బందులు పడతారని తెలిపారు.ఓటు ఎంతో విలువైనదని అన్నారు.ఇప్పటివరకు డివిజన్ లో 50 శాతం ఫారంలు పూర్తయినట్లు తెలిపారు.బిఎల్వో లు సైతం మీ ఇంటివద్దకు వచ్చినప్పుడు ఫారంలు అందించవచ్చ న్నారు. ఎన్యూమరేషన్ ఫారంలు పూర్తి చేయలేనివారు పి ఎస్ ఆర్ టెంట్ హౌస్ వద్దకు వచ్చి పూర్తి చేయించుకోవాలని పేర్కొన్నారు. సర్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కాగా పలువరు సల్ల రమ్య మహేష్ కు సర్ ఫారంలు పూర్తి చేసిన వాటిని అందించారు. ఈ కార్యక్రమం లో వార్డు ఆఫీసర్ పవన్ కుమార్, బిఎల్వో స్వర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు గుంట మల్లేష్,సంపత్ కుమార్,జగదీశ్, శ్రవణ్,ప్రశాంత్,రంజిత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోరెన్సిక్ నుంచి ఫింగర్ ప్రింట్స్ వరకు..

**- అన్ని విభాగాల్లో భద్రాద్రి పోలీసుల సత్తా**



కొత్తగూడెం బ్యూరో జూలై 15(విజన్ ఆంధ్ర) : జోన్×ం పోలీస్ డ్యూటీ మీట్2026లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 12 పతకాలు కైవసం చేసుకున్నారు. ఇందులో 3 స్వర్ణ, 7 రజత, 2 కాంస్య పతకాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. కొత్తగూడెం× టౌన్ ఇన్స్పెక్టర్ ఎం. కరుణాకర్ లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్, ఫింగర్ ప్రింట్స్ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు, ఫోరెన్సిక్ సైన్స్ విభాగంలో రజత పతకం, ఆఫీస్ ఆటోమేషన్ విభాగంలో కాంస్య పతకం సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎస్కే నాగుల్మీరా నార్కోటిక్ డాగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించగా, అశ్వారావుపేట సీఐ పి. నాగరాజు రెడ్డి క్రైమ్ ఇన్వెస్టిగేషన్ విభాగంలో, ఇల్లందు ఎస్ఐ కె. ఉమా దర్యాప్తు ఆధారిత ఫోటోగ్రఫీ విభాగంలో, ఐటీ కోర్ పీసీ కె. నరేష్ ప్రోగ్రామింగ్ సామర్థ్య విభాగంలో, చెర్ల పీసీ ఎస్. అయ్యప్ప పోలీస్ ఫోటోగ్రఫీ విభాగంలో, ఏఆర్ పీసీ కె. మహేష్ ట్రాకర్ డాగ్ విభాగంలో రజత పతకాలు అందుకున్నారు. అలాగే బూర్గంపాడు డబ్ల్యూపీసీ బి. పావని పోలీస్ అబ్జర్వేషన్ విభాగంలో రజత పతకం, పోలీస్ పోర్ట్రెయిట్ విభాగంలో కాంస్య పతకం సాధించి జిల్లా పోలీసు శాఖకు మరోసారి గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పతక విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా పోలీస్ డ్యూటీ మీట్లలో మరిన్ని విజయాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

# తెలంగాణ, ఏపీలో స్టార్ హెల్త్ మెగా హెల్త్ క్యాంప్‌లు



హైదరాబాద్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ తమ 20 ఏళ్ల సేవల సందర్భంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో మెగా హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తూ ప్రివెంటివ్ హెల్త్‌కేర్‌పై అవగాహన కల్పిస్తోందని స్టార్ హెల్త్ బిజినెస్ హెడ్ శ్రీనివాస్ కేబీబీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, కాకినాడ, ఏలూరు, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మంలలో ఇప్పటివరకు 5 వేల మందికిపైగా లబ్ధి పొందినట్లు చెప్పారు. క్యాంప్‌లలో బీఎమ్ఐ, డయాబెటిస్, హైపర్‌టెన్షన్, ఈసీజీ, లిపిడ్ ప్రొఫైల్, కంటి, దంత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మెడికవర్, మ్యాక్స్ విజన్, క్లోవ్ డెంటల్, యశోద, శ్రీకర, కిమ్స్, అర్చన హాస్పిటల్స్, ఆనంద ఇన్స్టిట్యూట్, మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం కొనసాగుతోందని తెలిపారు. అలాగే విశాఖపట్నం, కర్నూలు, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్‌లలో సీఎస్ఆర్ కింద 'ఆరోగ్య సేవ కేంద్ర'(ఎఎస్కె) క్లినిక్‌లు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు ఉచిత 24/7 వర్చువల్ డాక్టర్ సేవలు 'స్టార్ హెల్త్ కస్టమర్ యాప్' ద్వారా కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# పోలీసింగ్‌లోనే కాదు.. క్రీడల్లోనూ భద్రాద్రి పోలీసుల సత్తా..



కొత్తగూడెం బ్యూరో జూలై 15 (విజన్ ఆంధ్ర) : మల్కాజిగిరి కమిషనరేట్‌లో జూలై 7 నుంచి 9 వరకు నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ & గేమ్స్2026లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచి 5 స్వర్ణ, 2 రజత, 4 కాంస్య పతకాలతో మొత్తం 11 పతకాలు సాధించి జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో చాటారు. డబ్ల్యూపీసీ బి. రజని ఆర్మ్ రెజ్లింగ్‌లో స్వర్ణ పతకం సాధించడంతో పాటు బాక్సింగ్, యోగా ఆర్టిస్టిక్ పెయిర్, యోగా రిథమిక్ పెయిర్ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. డబ్ల్యూపీసీ బి. రత్న కుమారి వృషు, యోగా రిథమిక్ పెయిర్ విభాగాల్లో రెండు స్వర్ణ పతకాలు, యోగా ట్రెడిషనల్, జిమ్నాస్టిక్స్ విభాగాల్లో రెండు రజత పతకాలు సాధించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. డబ్ల్యూపీసీ డి. సుశ్మా బాయి పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం, పీసీ వి. వంశీకృష్ణ కూడా పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణ పతకం సాధించి జిల్లా పోలీసు శాఖకు మరింత గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు విజేతలను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో జాతీయ స్థాయిలోనూ విజయాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు శాఖకు మరింత పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా చర్యలు

**- శాస్త్రీయ దర్యాప్తుతో బాధితులకు సత్వర న్యాయం అందించాలి - జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే**



రాజన్న సిరిసిల్ల, జూలై 14 విజన్ (ఆంధ్ర బ్యూరో): జిల్లాలో నమోదవుతున్న ప్రతి కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన విచారణ నిర్వహించడం ద్వారా నిందితులకు శిక్షలు పడేలా అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సిరిసిల్ల సబ్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు, నిందితుల అరెస్టులు, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు, శాంతిభద్రతల పరిరక్షణ, పోలీసు సిబ్బంది పనితీరును ఎస్పీ సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేసులో ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్, ఇతర శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నాణ్యమైన దర్యాప్తు ద్వారానే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడటంతో పాటు బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లను మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేసి నేరాల నియంత్రణను మరింత పటిష్ఠం చేయాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సైబర్ నేరాలను వేగంగా ఛేదించాలని ఎస్పీ పేర్కొన్నారు. బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని సూచించారు. అదేవిధంగా గంజాయి, గుడుంబా, పేకాట, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, అక్రమ ఇసుక రవాణా వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి, నిరంతర దాడులు నిర్వహించి వాటిని పూర్తిగా అరికట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, మొగిలి, మధుకర్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రి ఉత్తమ్ పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు..

**- క్షేత్రస్థాయిలో కలెక్టర్ అంకిత్ తనిఖీ**



కొత్తగూడెం బ్యూరో, జూలై 15(విజన్ ఆంధ్ర) : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సీతమ్మసాగర్, సీతారామ ఎత్తిపోతల (లిఫ్ట్ ఇరిగేషన్) ప్రాజెక్టుల పరిశీలనతో పాటు నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ పనులను పరిశీలించిన కలెక్టర్, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని సూచించారు. హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అవసరమైన భద్రతా చర్యలు, బారికేడింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వాహనాల పార్కింగ్, రాకపోకల ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అమ్మగారిపల్లి వద్ద నిర్వహించనున్న సమీక్ష సమావేశం ప్రాంగణాన్ని పరిశీలించి, సమావేశ వేదిక, అధికారుల, ప్రజాప్రతినిధుల కూర్చునే ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. సమావేశానికి హాజరయ్యే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని పనులు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, పోలీసు, రెవెన్యూ, నీటిపారుదల, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖలతో పాటు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక సాగునీటి ప్రాజెక్టుల పరిశీలన, సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ తనిఖీలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, నీటిపారుదల శాఖ, ఆర్ అండ్ బీ శాఖతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వర్షాభావ పరిస్థితులతో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేయాలి..

**- జిల్లా కలెక్టర్ కె. హరిత**



అసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14, (విజన్ ఆంధ్ర) : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులు వరి సాగుపై ఆధారపడకుండా తక్కువ నీటి అవశ్యకత గల ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండకపోవడం, భూగర్భ జలాలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉండటంతో చెరువులు, కాలువలు, బోరుబావుల ఆధారంగా సాగుచేసే వరి పంట విస్తీర్ణంపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ పరిస్థితులలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటలు ఎంపిక చేసుకోవాలని సూచించారు. బోరుబావుల ఆధారంగా సాగు చేస్తున్న రైతులు కూడా వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, కంది వంటి తక్కువ నీరు అవసరమయ్యే పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను నివారించవచ్చని తెలిపారు. ఈ నెల జూలై 31 వరకు కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగితే, ఆగస్టు మొదటి వారంలో కందులు, ఉలవలు, అలసందలు, ఆముదం, నువ్వులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాల విత్తనాలు విత్తుకోవడం రైతులకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. తద్వారా వరి సాగు వల్ల కలిగే నష్టాల నుంచి రైతులు బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు. 2025 వానాకాలం సాగు వివరాల ప్రకారం జిల్లాలో మొత్తం 47 వేల 576 ఎకరాలలో వరి సాగు జరగగా, అందులో 22 వేల 876 ఎకరాలు బోరుబావుల ఆధారంగా, 24 వేల 700 ఎకరాలు చెరువులు, కుంటలు, వర్షాధారంపై సాగు జరిగిందని తెలిపారు. ఈసారి చెరువులు, వర్షాధారంపై ఆధారపడే రైతులు తక్కువ కాలంలో దిగుబడి ఇచ్చే, తక్కువ నీరు అవసరమయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి లాభదాయకమైన వ్యవసాయాన్ని చేపట్టాలని తెలిపారు. రైతులు పంటల ఎంపిక, విత్తనాల లభ్యత, సాగు విధానాలు, సాంకేతిక సూచనల కోసం తమ సమీప మండల వ్యవసాయ అధికారులను సంప్రదించి వ్యవసాయ శాఖ సూచనల మేరకు పంటలు సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు.

# ఆపరేషన్ ముస్కాన్ సమర్థవంతంగా అమలు చేయాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14,(విజన్ ఆంధ్ర ) : జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, బాల కార్మికులు, వీధి బాలలు, ప్రమాదకర పరిస్థితులలో ఉన్న చిన్నారులను గుర్తించి తక్షణమే రక్షించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని హోటళ్లు, దాబాలు, టీ స్టాళ్లు, గ్యారేజీలు, వర్క్‌షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, నిర్మాణ పనులు, షాపింగ్ సముదాయాలు, వ్యవసాయ క్షేత్రాలు తదితర ప్రాంతాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను గుర్తించి వెంటనే రక్షించాలని అధికారులను ఆదేశించారు. రక్షించిన ప్రతి చిన్నారికి వైద్య పరీక్షలు, కౌన్సిలింగ్, విద్యలో పునఃప్రవేశం, కుటుంబ పునరావాసం / అవసరమైతే బాలల సంరక్షణ సంస్థలలో ఆశ్రయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులు, చిన్నారులను దుర్వినియోగం చేసే వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి నేరపూరిత చర్యలను అరికట్టాలని పోలీసు శాఖకు సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌శ×× లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేయాలని, ప్రతి రెస్క్యూ చర్యను పకడ్బందీగా నమోదు చేసి, సంబంధిత శాఖలకు సకాలంలో నివేదికలు సమర్పించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు గ్రామాలు, పట్టణాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల హక్కుల పరిరక్షణపై ప్రజలలో చైతన్యం కల్పించాలని, బాలల రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అనే సందేశాన్ని ప్రజలలోకి తీసుకెళ్లాలని తెలిపారు. డి.సి.పి. మాట్లాడుతూ బాలల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాలలపై జరుగుతున్న దోపిడీ వంటి అంశాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, కార్మిక, విద్యా, వైద్య ఆరోగ్య, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా బాలల పరిరక్షణ యూనిట్, చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

## బోధనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలి - కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, జులై 14 (విజన్ ఆంధ్ర): పాఠశాలల్లో ఉపాధ్యాయులు వినూత్న సాంకేతిక సాధనాలను ఉపయోగించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం తిరుపెల్లి, బొక్కల్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో భౌతిక శాస్త్రం, ఆంగ్ల ఉపాధ్యాయులకు 'శిక్షా కో-పైలట్' సాఫ్ట్‌వేర్‌పై నిర్వహించిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా పాఠ్యాంశాల ప్రణాళికను సులభంగా తయారు చేసుకుని, డిజిటల్ బోధనతో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా చెప్పవచ్చన్నారు. ఉపాధ్యాయుల శిక్షణ వివరాలను యూ-డైస్ ప్లస్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఈ ఏడాది బడిబాటలో విద్యార్థుల నమోదును 10% పెంచాలని అధికారులను ఆదేశించారు. ఇందులో డీఈఓ మాధవి, అధికారులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారం పోడు భూముల సమస్యల పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14,(విజన్ ఆంధ్ర ) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టంకు లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామంలో నిబంధనలను అతిక్రమించి సాగు చేస్తున్న అటవీ భూములను జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, కోటపల్లి సి.ఐ. కృష్ణ, అటవీ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్.ఓ.ఎఫ్.ఆర్. చట్టానికి లోబడి పోడు భూముల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. చట్టం ప్రకారం 2005 కు ముందు సాగులో ఉండి పట్టా పొందిన అర్హులైన గిరిజన రైతులకు మాత్రమే చట్టం వర్తిస్తుందని తెలిపారు. చట్ట ప్రకారం 2005 నాటికి 75 సంవత్సరాలు కాస్తులో ఉండి పట్టా పొందిన గిరిజనేతరులకు మాత్రమే అవకాశం ఉంటుందని, 2005 తర్వాత నూతనంగా అటవీ భూములు సాగు చేస్తున్న వారు చట్ట పరిధిలోకి రారని తెలిపారు. అనర్హులు, నూతనంగా అటవీ భూములను సాగు చేయకుండా స్థానికులు అర్థమయ్యేలా వివరించాలని తెలిపారు. ఇట్టి భూములకు సంబంధించి చెన్నూర్ అటవీ రేంజ్ కార్యాలయంలో మ్యాప్ అందుబాటులో ఉందని, సందేహాలు ఉన్నవారు మ్యాప్ ను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జిల్లా ప్రతినిధి జులై 14,(విజన్ ఆంధ్ర ) : జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సింగరేణి అతిథి గృహానికి విచ్చేసిన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ లతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

# మా రక్తం తీసుకో... రైతన్నకు సాగునీరు ఇవ్వు

**- రక్తదాన శిబిరంతో ప్రభుత్వానికి బీఆర్ఎస్ హెచ్చరిక**



వేములవాడ రాజన్న సిరిసిల్ల , జూలై 14 విజన్ ఆంధ్ర బ్యూరో: రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో మంగళవారం వేములవాడలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా "రేవంత్ రెడ్డికి రక్తదానం" పేరుతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ, కళ్లముందే రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం సాగునీటి సమస్యను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుల సమస్యలపై స్పందించాల్సిన ముఖ్యమంత్రి, రైతులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయడం బాధాకరమని విమర్శించారు. రైతు పంట పండించేందుకు తన చెమటతో పాటు రక్తమాంసాలను సైతం కరిగిస్తాడని, అలాంటి రైతుల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే కాళేశ్వరం నీటిని పంట పొలాలకు మళ్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కూడా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కాళేశ్వరం నీటిని రైతులకు విడుదల చేయడంలో ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 25 మందికి పైగా పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేసి, రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, జోగిని శంకర్, క్రాంతికుమార్, గూడూరు మధు, నరాల దేవేందర్, గోపు పరశురాములు, మల్యాల దేవయ్య, నూకలమర్రి సర్పంచ్ నరేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వడ్డెర కాలనీ స్మశానవాటిక పనులకు మళ్లీ శ్రీకారం

*మట్టి నింపేందుకు అంగీకరించిన 6వ వార్డు కౌన్సిలర్ కాశ శ్రీనివాస్*



వేములవాడ రాజన్న సిరిసిల్ల, జూలై 14 (విజన్ ఆంధ్ర): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి 6వ వార్డు వడ్డెర కాలనీలో కొంతకాలంగా నిలిచిపోయిన స్మశానవాటిక అభివృద్ధి పనులు తిరిగి ప్రారంభం కానున్నాయి. స్మశానవాటికలో మట్టి నింపే పనులను చేపట్టేందుకు 6వ వార్డు కౌన్సిలర్ కాశ శ్రీనివాస్ అంగీకారం తెలిపారు. స్థానికుల విజ్ఞప్తికి స్పందించిన కౌన్సిలర్, పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్మశానవాటికను ప్రజలకు ఉపయోగపడేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్ణయంతో వడ్డెర కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్య పరిష్కారానికి ముందుకొచ్చిన కౌన్సిలర్ కాశ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థి నాయకుల అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

**- యంసిపిఐ(యు)రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి**

**- విద్యార్థి నేతలను బేషరతుగా విడుదల చేసి విద్యారంగ సమస్యలపై చర్చలు జరపాలని డిమాండ్**



మేడ్చల్ /బోడుప్పల్,జూలై 14(విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి): రాష్ట్రంలో విద్యారంగ సమస్యల పరిష్కారం, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు సోమవారం చేపట్టిన సచివాలయం ముట్టడి కార్యక్రమానికి ముందు విద్యార్థి నాయకులను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని యంసిపిఐ(యు) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి ఒక ప్రకటనలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని, అలాంటి కార్యక్రమాలను అడ్డుకునేందుకు అర్ధరాత్రి అరెస్టులకు పాల్పడటం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని విమర్శించారు. అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గడ్డం నాగార్జునను హన్మకొండలో, రాష్ట్ర నాయకుడు మాలోతు జబ్బర్ నాయక్‌తో పాటు పలువురు జిల్లా నాయకులను కామారెడ్డిలో, కామ్రేడ్ సబ్బని రాజేంద్ర ప్రసాద్, పసులేటి వెంకటేష్‌లను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో, కామ్రేడ్ నాగరాజును వరంగల్ జిల్లా నల్లబెల్లిలో, చుక్క ప్రశాంత్‌ను వరంగల్ నగరంలో అరెస్టు చేశారని తెలిపారు. అలాగే వివిధ జిల్లాల్లో విద్యార్థి సంఘాల నాయకులను ముందస్తుగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే చర్య అని ఆరోపించారు.విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం విద్యార్థి సంఘాలతో వెంటనే చర్చలు ప్రారంభించాలని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అరెస్టు చేసిన విద్యార్థి నాయకులను బేషరతుగా విడుదల చేయాలని గాదగోని రవి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య హక్కులను హరించే చర్యలను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన కోరారు.

# వర్షపు నీటిని ఒడిసిపట్టడమే భవిష్యత్‌కు భరోసా

సూర్యాపేట జూలై 14:(విజన్ ఆంధ్ర) : వర్షపు నీటిని సంరక్షించడం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భావితరాలకు నీటి వనరులను భద్రపరచవచ్చని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత , మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి లు అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'వర్షాన్ని పట్టుకోండి' ప్రచార కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వర్షపునీటి సంరక్షణపై సోమవారం పట్టణంలో విస్తృత అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది, మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి ర్యాలీని ప్రారంభించి ప్రజలకు వర్షపు నీటి సంరక్షణ అవసరాన్ని వివరించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాది మాట్లాడుతూ, ప్రతి ఇంటి వద్ద, ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు భవనంలో వర్షపు నీటి సేకరణ గుంతలను ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరమన్నారు. వర్షపు నీటిని వృథాగా వదిలేయకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు తీసుకుంటే భూగర్భ జలాలు పెరిగి, భవిష్యత్తులో తాగునీటి కొరతను అధిగమించవచ్చని తెలిపారు. ప్రతి పౌరుడు నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించి వర్షపునీటి సేకరణకు సహకరించాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషనర్ హన్మంత రెడ్డి మాట్లాడుతూ, వర్షపునీటి సేకరణ గుంతలు భూగర్భ జలాలను పునరుజ్జీవింపజేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.



వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా బోర్లలో నీటి మట్టాలు పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు నీటి వనరులను భద్రపరచవచ్చని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, గృహాల వద్ద వర్షపునీటి సేకరణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని ప్రజలకు సూచించారు.అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రవి మహల్ కన్వెన్షన్ హాల్, పి.ఎం. శ్రీ జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వర్షపునీటి సేకరణ గుంతలను పరిశీలించారు. వాటి నిర్మాణం, పనితీరు, ప్రయోజనాలపై ప్రజలకు వివరించారు. ఈ అవగాహన ర్యాలీలో వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డీఈ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భాష బోధన విద్యార్థికి సులభంగా అర్థమయ్యేలా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



రాజన్న సిరిసిల్ల, జూలై 14 విజన్ (ఆంధ్ర బ్యూరో): విద్యార్థులకు భాషా బోధన సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలని, నిత్య జీవితంలో ఉపయోగించే పదాలను నేర్చుకునేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న హిందీ శిక్షణను మంగళవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి శిక్షణా తరగతిలో కూర్చుని బోధన విధానాన్ని పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడి వారి అనుభవాలు, శిక్షణ ద్వారా కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పనిసరిగా తరగతి గదిలో అమలు చేయాలని సూచించారు. విద్యార్థి కేంద్రంగా, కార్యకలాపాల ఆధారిత బోధన చేపట్టాలని, టీఎల్ఎంలు, రంగుల వినియోగంతో పాఠాలు ఆసక్తికరంగా బోధించాలని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రోజువారీ జీవితంలో ఉపయోగించే పదాలు, అంకెలు, పండ్లు, వస్తువులు వంటి అంశాలను సులభంగా నేర్పించాలని సూచించారు. దీంతో విద్యార్థుల్లో భాషా సామర్థ్యాలు పెరగడంతో పాటు బడిపై ఆసక్తి కూడా పెరుగుతుందని అన్నారు. ఇంగ్లీష్, గణితం తదితర అంశాల్లో విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిరిసిల్లలో, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడలో, ప్రాథమిక స్థాయి ఎంఆర్‌పీలకు తెలుగు, ఇంగ్లీష్, గణితం అంశాల్లో ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడాలి..

**- గంజాయి హాట్‌స్పాట్స్‌పై ఉక్కుపాదం..**

**- సైబర్ నేరాలు, డ్రగ్స్, అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి..**

**- నెలవారీ సమీక్షలో ఎస్పీ దిశానిర్దేశం**

కొత్తగూడెం బ్యూరో, జూలై 15 (విజన్ ఆంధ్ర): ప్రతి కేసులో సమగ్ర, శాస్త్రీయ దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు తప్పనిసరిగా శిక్ష పడేలా పోలీసు అధికారులు కృషి చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్ష సమావేశంలో ఆయన జిల్లాలోని నేరాల పరిస్థితి, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, శాస్త్రీయ ఆధారాలతో పటిష్ఠమైన దర్యాప్తు నిర్వహించి నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల దర్యాప్తులో జాప్యం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని హెచ్చరిస్తూ, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై క్రమశిక్షణా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య, నాట్‌గ్రిడ్ వంటి ఆధునిక సాంకేతిక వనరులను సమర్థవంతంగా వినియోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు గంజాయి హాట్‌స్పాట్లను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, ర్యాపిడ్ డ్రగ్ టెస్ట్ కిట్లతో తనిఖీలు నిర్వహించి నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ మద్యం, జూదం,



పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతర దాడులు కొనసాగించాలని సూచించిన ఎస్పీ, ప్రాపర్టీ కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని సీసీటీవీ ఫుటేజీలు, ఇతర సాంకేతిక ఆధారాల సహాయంతో త్వరితగతిన ఛేదించి దొంగిలించిన సొత్తును బాధితులకు అప్పగించాలని ఆదేశించారు. వాహన తనిఖీలు, రాత్రి పెట్రోలింగ్, కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లు, బెయిల్‌పై ఉన్న నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, డయల్-100కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి బాధితులకు సత్వర సహాయం అందించాలని ఆదేశించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం, ర్యాష్ డ్రైవింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు, భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్‌తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# 31వ వార్డులో ముమ్మరంగా ఎస్ఐఆర్ ప్రక్రియ

**- వార్డులో మొత్తం ఎస్ఐఆర్ ఓటర్లు 1570, ఇప్పటి వరకు 887 ఆన్లైన్లో అప్లోడ్ పూర్తి**

**- బిఎల్ఓలు రాజమణి, యాదమ్మ, సల్మా, విజయలక్ష్మి**

**- వార్డు కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14 ( విజన్ ఆంధ్ర ) : ఎస్ఐఆర్ ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతున్నదని 31వ వార్డు కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్ అన్నారు. మొత్తం ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు 1570, 100% ఓటర్లకు అందజేశామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలో గల 31 వ వార్డులో వార్డ్ కౌన్సిలర్ దుర్గం మల్లికార్జున్ గౌడ్ విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. ఇప్పటివరకు 887 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ చేశారని ఆయన పేర్కొన్నారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్న ఓటర్ యొక్క పూర్తి వివరాలు తప్పులు లేకుండా పూరించాలని ఆయన సూచించారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఉన్న ఓటర్ యొక్క తల్లి, తండ్రి, నాయనమ్మ / అమ్మమ్మ, తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి పూర్తి వివరాలు పూరించాలని కౌన్సిలర్ స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పూర్తిచేసే ముందు ఏవైనా అనుమానాలు ఉంటే బిఎల్ఓలు రాజమణి యాదమ్మ సల్మా విజయలక్ష్మి లను ఎవరినో ఒకరిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కౌన్సిలర్ హితవు పలికారు. నిర్దేశిత గడువులో ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తామని కౌన్సిలర్ ధీమా వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు తీసుకున్న ఓటర్లు బిఎల్ఓలకు తిరిగి ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని కౌన్సిలర్ హెచ్చరించారు. వార్డు ప్రజలు సహృదయంతో బిఎల్ఓలకు సహకరిస్తే ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేసే అవకాశం ఉంటుందని కౌన్సిలర్ స్పష్టం చేశారు.

# సీడబ్ల్యూసీ గోదాం నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్



రాజన్న సిరిసిల్ల, జూలై 14 విజన్ (ఆంధ్ర బ్యూరో): జిల్లాలో సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో ప్రతిపాదిత గోదాం నిర్మాణానికి అనువైన స్థలాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ వద్ద జిల్లా ఇందిరా మహిళా శక్తి భవనం సమీపంలో ప్రతిపాదించిన స్థలాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సీడబ్ల్యూసీ రీజినల్ మేనేజర్ విష్ణువర్ధన్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అందుబాటులో ఉన్న భూమి విస్తీర్ణం, గోదాం నిర్మాణానికి అవసరమైన స్థలం, ప్రతిపాదిత నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై అధికారులను కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో నిర్మాణం చేపట్టనున్నారో, గోదాం ఎంత టన్నుల నిల్వ సామర్థ్యంతో ఏర్పాటు చేయనున్నారో తెలుసుకుని సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ పరిశీలనలో సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, సీడబ్ల్యూసీ అధికారులు, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ప్రభుత్వ ధ్యేయం

**- జిల్లాలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు**

**- ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క**

వడ్డేపల్లి జూలై 14 (విజన్ ఆంధ్ర బ్యూరో) : నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంగళవారం జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్దకు చాపర్ లో వచ్చిన ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర అతిథులకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలతో స్వాగతం పలికి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జులేకల్ గ్రామానికి రోడ్డు మార్గంలో చేరుకొని అలంపూర్ నియోజకవర్గంలోని జులేకల్, పచ్చర్ల, పుల్లూరు, మేడికొండ ప్రాంతాల్లో నిర్మించిన 33/11 కెవి ఉపకేంద్రాలను ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, మత్స్య, పశుసంవర్ధక, క్రీడల శాఖల మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. అలాగే ఎర్రవల్లి మండల కేంద్రం వద్ద రూ.155 కోట్ల నిధులతో 220/132/33 కెవి ఉపకేంద్రం నిర్మాణానికి కూడా ఇక్కడే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ట్రాన్స్ఫార్మర్లను పంపిణీ చేశారు. అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా మంగళవారం రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ ఉప కేంద్రాల ప్రారంభోత్సవాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఆలంపూర్ ఎమ్మెల్యే







విజయుడు, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్పర్సన్ సరిత, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, డీసీసీ అధ్యక్షుడు రాజీవ్ రెడ్డి, ట్రాన్స్కో సీఎండి కృష్ణ భాస్కర్, టీజీ ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, సంస్థ డైరెక్టర్లు శివాజీ, నరసింహులు, రూరల్ జోన్ సీఈ బాలస్వామి, అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఇన్చార్జి ఎస్ఈ నాగరాజు, డిఈ రవి ప్రసాద్, ఇతర ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు, జిల్లా నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సర్పంచ్ ల ముందస్తు అరెస్ట్



వరంగల్ జూలై-14(విజన్ ఆంధ్ర) : వరంగల్ జిల్లా కేంద్రంలోని పర్వతగిరి మండలంలో సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వినతి పత్రం అందజేయాలనే తలపెట్టిన కార్యక్రమాన్ని కాంగ్రెస్ సర్కార్ పోలీసులను ఇంటింటికి పంపించి ముఖ్యమంత్రి ఇంటికి రాకుండా అడ్డుకోవడం సరైనది కాదు అని మాజీ సర్పంచుల పదవీకాలం అయిపోయి 31 నెలలు అవుతున్నవి అప్పులు చేసి గ్రామాలు అభివృద్ధి చేసిన వడ్డీలు చెల్లించలేక అనేకమంది ఆత్మహత్యలు చేసుకున్నారు సర్పంచుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో చాలా బాధపడుతున్నారు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించి మాజీ సర్పంచులకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరుచున్నాము అని మాజీ సర్పంచ్ లు వాపోయారు అరెస్ట్ చేసిన వారిలో ప్రస్తుత సోమారం సర్పంచ్ ఏర్పుల శ్రీనివాస్, వడ్లకొండ మాజీ సర్పంచ్ మాజీ సర్పంచుల ఫోరం పర్వతగిరి మండల అధ్యక్షుడు అమడగాని రాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# సింగరేణి రిటైర్డ్ కార్మికుల 3 వేల లోపు ఉన్న పెన్షన్ పెంచాలి

*3 సశే.లకు ఒకసారి పెంచుతానన్న పెన్షన్ ఇంతవరకు పెంచలేదు. గుండేటి సమ్మయ్య*




భూపాల్ పల్లి జిల్లా 14 జులై (విజన్ ఆంధ్ర) : సింగరేణిలో పర్యటన భాగంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రివర్యులు జి కిషన్ రెడ్డి భూపాలపల్లి కి వచ్చిన సందర్భంగా సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గుండేటి సమ్మయ్య ఆధ్వర్యంలో సింగరేణి రిటైర్డ్ కార్మికుల సమస్యలపై మెమోరాండం ఇవ్వడం జరిగింది ముఖ్యంగా సింగరేణి రిటైర్డ్ కార్మికులకు 1998లో పెన్షన్ విధానం తీసుకురావడం జరిగింది . అప్పుడు దిగిపోయిన కార్మికులకు వారి బేసిక్ ప్రకారంగా 300, 500, 800 ,1000,3000 రూపాయల లోపు వస్తుంది ఇప్పటివరకు అదే పెన్షన్ తీసుకుంటున్నారు . పెన్షన్ విధానం తీసుకొచ్చినప్పుడు పెన్షన్ను ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెంచుతామని అప్పుడు రూల్స్ లో రాశారు కానీ మూడు శతాబ్దాలు గడిచిన ఇంతవరకు ఒక్క రూపాయి కూడా పెంచలేదు మరి 3000 రూపాయల లోపు పెన్షన్ తో విశ్రాంత కార్మికులు బ్రతికేది ఎలా తెలంగాణ గవర్నమెంట్ ఇచ్చే ఆసరా పెన్షన్ కన్నా తక్కువగా ఉంది కనీసం విశ్రాంతి కార్మికులకు వచ్చే పెన్షన్తో చాయ్ తాగడానికి పాలు కూడా రావడం లేదు కాబట్టి దయచేసి నిబంధనలో ఉన్నట్టు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి పెన్షన్ పెంచాలని మినిమం పెన్షన్ 15 వేలకు తగ్గకుండా ఉండాలని పెంచే పెన్షన్ డిఏ తో కూడిన 50% పెన్షన్ పెంచాలని గౌరవనీయులైన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి గారికి వెంటనే సింగరేణి కార్మికుల పెన్షన్ పెంచే విధంగా తగు చర్యలు చేపట్టాలని మెమోరాండం లో విన్నవించడం జరిగింది ఈ కార్యక్రమంలో గుండేటి సమ్మయ్య అధ్యక్షులు గీట్ల రాజిరెడ్డి జనరల్ సెక్రటరీ మాడుగుల సమ్మిరెడ్డి ఉపాధ్యక్షులు కొండపాక సాంబయ్య గోలి మోహన్ రెడ్డి బందెల భూమయ్య తదితరులు పాల్గొన్నారు

# దశాబ్దం దాటినా పెద్దపల్లి ఆర్టీఏకు శాశ్వత భవనం కరువు

**- జిల్లా ఏర్పడినా అద్దె భవనంలోనే రవాణా శాఖ కార్యాలయం**

**- డ్రైవింగ్ పరీక్షల నిర్వహణలో సమస్యలు**

**- ప్రభుత్వ భూమి కేటాయించి ఆధునిక కార్యాలయం నిర్మించాలని విజ్ఞప్తి**

పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై-14(విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దానికి పైగా గడిచినా, జిల్లా పునర్విభజనలో పెద్దపల్లి జిల్లా ఏర్పడినా జిల్లా రవాణా శాఖ (ఆర్టీఏ) కార్యాలయానికి ఇప్పటికీ శాశ్వత భవనం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. జిల్లా కేంద్రంలో కీలక ప్రభుత్వ శాఖగా ప్రజలకు సేవలు అందిస్తున్న కార్యాలయం ఇప్పటికీ ప్రైవేట్ అద్దె భవనంలోనే కొనసాగుతుండటంతో ప్రజలు అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారు.




**-భూమి కేటాయింపు ప్రతిపాదనలు పెండింగ్**

జిల్లా ఏర్పడినప్పటి నుంచి రవాణా శాఖకు సొంత భూమి కేటాయించి ఆధునిక సౌకర్యాలతో కార్యాలయ భవనం నిర్మించాలని అధికారులు పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. గతంలో పనిచేసిన జిల్లా రవాణా అధికారులు సంబంధిత శాఖలతో సమావేశాలు నిర్వహించినప్పటికీ భూమి కేటాయింపు ప్రక్రియ ముందుకు సాగలేదు. ప్రస్తుతం అధికారులు కూడా ఇదే అంశంపై ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

**-ప్రజలకు ఇబ్బందులు**

ప్రస్తుతం కొనసాగుతున్న అద్దె భవనంలో స్థలం సరిపోకపోవడంతో ప్రతిరోజూ డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు తదితర సేవల కోసం వచ్చే వందలాది మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేచి ఉండేందుకు సరైన వసతులు లేక ఎండ, వర్షంలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది.

**-డ్రైవింగ్ ట్రాక్ లేక పరీక్షలకు ఆటంకం**

డ్రైవింగ్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ప్రత్యేక ట్రాక్ లేకపోవడం కూడా ప్రధాన సమస్యగా మారింది. దీంతో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడం అధికారులకు సవాలుగా మారుతోంది. కార్యాలయం వద్ద వాహనాల పార్కింగ్‌కు కూడా తగిన స్థలం లేక ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

**-శాశ్వత భవనం నిర్మించాలని డిమాండ్**

జిల్లాలో ఇతర ప్రభుత్వ శాఖలకు ఆధునిక భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో, ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందించే రవాణా శాఖకు కూడా శాశ్వత కార్యాలయ భవనం నిర్మించాలని వాహనదారులు, డ్రైవింగ్ లైసెన్స్ అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెద్దపల్లిలో ప్రభుత్వ భూమిని కేటాయించి అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన ఆధునిక ఆర్టీఏ కార్యాలయాన్ని నిర్మిస్తే ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు శాఖ పనితీరు మరింత సమర్థవంతంగా మారుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో సచిన్‌తో స్పిన్నీ 'గాడ్ ప్రామిస్' ప్రచారం



హైదరాబాద్, జూలై 14 (విజన్ ఆంధ్ర) : స్పిన్నీ తన 'గాడ్ ప్రామిస్' ప్రచారాన్ని దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ తో కలిసి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో తెలుగులో ప్రారంభించినట్లు స్పిన్నీ వ్యవస్థాపకుడు, సీఈఓ నీరజ్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ 'సెల్‌రైట్ బై స్పిన్నీ' ద్వారా వాడిన కార్ల విక్రయ ప్రక్రియను సులభతరం, పారదర్శకంగా, న్యాయబద్ధంగా మార్చడమే లక్ష్యమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నాలుగు స్పిన్నీ కార్ హబ్‌లు, విశాఖపట్నంలో ఒక స్పిన్నీ పార్క్ ద్వారా సేవలందిస్తున్న స్పిన్నీ, విజయవాడ, గుంటూరు, వరంగల్ వరకు కార్యకలాపాలను విస్తరించినట్లు తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా నెలకు 10 వేలకుపైగా కార్ల విక్రయాలు, 57కు పైగా కార్ హబ్‌లు, 76 నగరాల్లో సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

## ఘనంగా సీతారామచంద్రస్వామి మాస కళ్యాణం



సూర్యాపేట జూలై 14:(విజన్ ఆంధ్ర) : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బొడ్రాయి బజార్ లో గల శ్రీ వేదాంత భజన మందిరంలోని శ్రీ సీతారామచంద్రస్వామి పునర్వసు జన్మ నక్షత్ర సందర్భంగా మంగళవారం మాస కల్యాణం ను దేవాలయ అర్చకులు దరూరి సింగరాచార్యుల ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహములకు పంచామృత అభిషేకం నిర్వహించారు. పట్టు వస్త్రాలు అలంకరింపజేసి, వివిధ రకాల పూలతో అలంకారం చేసి వివిధ రకాల పండ్లతో నైవేద్యం సమర్పించారు. శాస్త్రక్తంగా మాంగల్య దారణతో కళ్యాణ తంతు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వేదాంత భజన మందిరం అధ్యక్షులు రాచర్ల వెంకటేశ్వరరావు, కోశాధికారి సోమ అశోక్,భక్తులు ఈగ వెంకటేశ్వర్లు, షీలా శంకర్, సోమ సుమన్, గోదాదేవి, మౌనిక, ప్రసన్న, రేణుక, హేమలత, స్వాతి, అర్చకులు ధరూరి రాఘవాచార్యులు, మందిర మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

## విద్యా రంగానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట

**- తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత,**

**- మేడిపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన గోగుల సరిత,తుంగతుర్తి రవి**




బోడుప్పల్,జూలై 14(విజన్ ఆంధ్ర) : మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ పరిధిలోని మేడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు గోగుల సరిత, మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, పార్టీ నాయకులు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గోగుల సరిత విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన ఆమె భోజన నాణ్యత, పరిశుభ్రత, పాఠశాల వసతులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి పాఠశాలలో సిబ్బంది కొరతతో పాటు ఇతర సమస్యలను తెలుసుకున్నారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పాఠశాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బలరాం, మహ్మద్ మజర్, ప్రణయ్, బర్రె నాగరాజు, సోమయ్య, కాటపాక కుమార్, సునిల్, జయందర్, పంగ రాజు, శరత్ గౌడ్, సాయిరాం గౌడ్, భరత్, మేడిపల్లి మండల ఎంఈఓ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు సత్య ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి

**- గ్రామంలో మొత్తం ఓటర్లు 1602, ఆన్లైన్లో అప్లోడ్ అయినవి 1276**

**- బిఎల్ఓలు పడిగల్ల కవిత, కార్యదర్శి సోలిపేట రమేష్**

**- మదన్ పల్లి గ్రామ సర్పంచ్ బిల్లపాటి విజయలక్ష్మి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14 ( విజన్ ఆంధ్ర ) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ తుది దశకు చేరుకున్నదని మదన్ పల్లి గ్రామ సర్పంచ్ బిల్లపాటి విజయలక్ష్మి, బిఎల్ఓలు పడిగల్ల కవిత, కార్యదర్శి సోలిపేట రమేష్ అన్నారు. గ్రామంలో మొత్తం ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు 1602 ఓటర్లకు వంద శాతం అందజేశామని వారు తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలోగల మదన్ పల్లి గ్రామంలో వారు విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారం లో ఎడమవైపు పూరించాలని వారు సూచించారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఓటర్ యొక్క తల్లి, తండ్రి, నాయనమ్మ / అమ్మమ్మ, తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి పూర్తి వివరాలు పూరించాలని వారు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు ఆన్లైన్లో అప్లోడ్ చేశామని వారు స్పష్టం చేశారు. బిఎల్ఏలు పడిగళ్ళ బందయ్యా విజేందర్రెడ్డి నాగేష్ జయరాంరెడ్డి కరోబా శేఖర్ ఎస్ ఐ ఆర్ దరఖాస్తు ఫారాలు పూరించడానికి సహకరించాలని వారు పేర్కొన్నారు.

## చైనాను వణికిస్తున్న టైఫూన్ బావి

**X వరదనీటిలో కార్లు కొట్టుకుపోయిన దృశ్యాలు**

బీజింగ్,జూలై14 :చైనాను టైఫూన్ బావి వణికిస్తోంది. భారీ వర్షాలతో.. రహదారులు జలమయంగా మారాయి. లియావోనింగ్ ప్రావిన్స్‌లోని 2,60,000 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరదనీటిలో కార్లు బొమ్మల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షాలకు అవకాశం ఉందని చైనా జాతీయ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అన్ని విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. 13 రోజుల క్రితం పసిఫిక్ సముద్రంలో ఏర్పడిన ఈ టైఫూన్ ఫ్రాన్స్ దేశమంతా విస్తీర్ణాన్ని కలిగి ఉంది. దీని ప్రభావం జపాన్, తైవాన్, ఫిలిప్పీన్స్, ఉత్తర కొరియాలోనూ కనిపిస్తోంది.

# పడబడ్డ పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం..!

**- మళ్లీ కళకళలాడే రోజులు ఎప్పుడో..?**

**- కార్యకర్తలకు అందుబాటులోకి పార్టీ కార్యాలయం వస్తుందా..**

**- పూర్తిగా తాళం వేసినట్టేనా కాంగ్రెస్ పట్టణ కార్యాలయానికి ..!**

**- నూతన అధ్యక్షుడి ముందున్న తొలి సవాలు..!**

**- కొత్త నాయకత్వంతో కొత్త ఊపు వస్తుందా..?**

**- రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,పటేల్ రమేష్ రెడ్డి కార్యాలయానికి పూర్వ వైభవం తెచ్చేనా..**




సూర్యాపేట జూలై 14:(విజన్ ఆంధ్ర) : ఒకప్పుడు పార్టీ సమావేశాలు, కార్యకర్తల రద్దీ, రాజకీయ చర్చలకు కేంద్రంగా నిలిచిన కాంగ్రెస్ పట్టణ కార్యాలయం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురై పడబడి కనిపిస్తోందనే చర్చ స్థానికంగా వినిపిస్తోంది. పార్టీ కార్యక్రమాలు కార్యాలయంలో కాకుండా ఇతర ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల కార్యాలయం ప్రాధాన్యం కోల్పోయిందని పట్టణ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి పట్టణ కార్యాలయాన్ని మళ్లీ కార్యకలాపాలకు కేంద్రంగా మార్చాలని, పార్టీ సమావేశాలు, సభ్యత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చలు క్రమం తప్పకుండా అక్కడే నిర్వహించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న కార్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావడం ద్వారా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నింపవచ్చని వారు భావిస్తున్నారు. పార్టీ శ్రేణులను ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం కార్యాలయానికి మళ్లీ పూర్వ వైభవం తీసుకురావాలని కార్యకర్తల ఆకాంక్ష.. కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా నిలిచిన పట్టణ కార్యాలయం ప్రస్తుతం నిశ్శబ్దంగా మారిందనే చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. సమావేశాలు, సమీక్షలు, కార్యకర్తల రద్దీతో కళకళలాడిన కార్యాలయం ఇప్పుడు ఆ సందడికి దూరంగా ఉండటం పట్ల పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల నూతన పట్టణ అధ్యక్షుడి ఎన్నికతో పార్టీ శ్రేణుల్లో కొత్త ఆశలు చిగురించాయి. కార్యాలయాన్ని మళ్లీ పార్టీ కార్యకలాపాల కేంద్రంగా తీర్చిదిద్దడం, అన్ని వర్గాల నాయకులను సమన్వయం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత చురుకుగా మార్చడం కొత్త అధ్యక్షుడి ముందున్న ప్రధాన బాధ్యతలుగా కార్యకర్తలు భావిస్తున్నారు. రానున్న స్థానిక రాజకీయ పరిణామాల దృష్ట్యా బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని పార్టీ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అందుకు పట్టణ కార్యాలయం కేవలం ఒక భవనం కాకుండా, పార్టీ నిర్ణయాలు, వ్యూహాలు, కార్యకర్తల సమన్వయానికి కేంద్రంగా మారాలని సూచిస్తున్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్యకర్తలకు కార్యాలయం ఒక నమ్మకమైన వేదికగా ఉండాలని, క్రమం తప్పకుండా సమావేశాలు, సభ్యత్వ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చలు నిర్వహించాలని వారు కోరుతున్నారు. నూతన పట్టణ అధ్యక్షుడు చొరవ తీసుకుని కార్యాలయాన్ని పునరుద్ధరించి, పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపగలిగితే అది సంస్థాగత బలోపేతానికి దోహదం చేస్తుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా శ్రమించిన కార్యకర్తలు, పట్టణ కార్యాలయాన్ని మళ్లీ పూర్తిస్థాయిలో ప్రారంభించి, ప్రతిరోజూ అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. కొత్త పట్టణ అధ్యక్షుడి నాయకత్వంలో కార్యాలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని, ప్రజలకు అందుబాటులో ఉండే రాజకీయ వేదికగా మార్చాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర



కామారెడ్డి బ్యూరో జులై 14(విజన్ఆంధ్ర) : కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగాదజిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్రతనిఖీ చేశారు. బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా పనిచేయాల్సి ఉంటుందని అన్నారు. స్టేషన్‌లో పెండింగ్ కేసులను నాణ్యమైన దర్యాప్తుతో సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులపై ప్రజలకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. డయల్-100 కాల్స్ వచ్చిన వెంటనే స్పందించి బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.

పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను అమలు చేసి, రోడ్డు ప్రమాదాలను నివారించాలని సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం కామారెడ్డి టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ, సిబ్బంది రోల్‌కాల్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశమై శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పురోగతి ప్రజలకు అందుతున్న సేవలపై సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించే ప్రతి బాధితుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజలకు పోలీస్ శాఖపై మరింత విశ్వాసం కలిగేలా ప్రతి అధికారి బాధ్యతగా మరియు జవాబుదారీతనంతో సేవలు అందించాలని స్పష్టం చేశారు. స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని, నాణ్యమైన దర్యాప్తు ప్రమాణాలను పాటిస్తూ పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రైమ్ ప్రాపర్టీ భద్రతపై ఎస్పీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. స్వాధీనం చేసుకున్న ఆస్తులను చట్టపరమైన నిబంధనల ప్రకారం భద్రపరచాలని, వాటి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాత్రి సమయాల్లో పటిష్టమైన వాహన తనిఖీలు గస్తీ నిర్వహించాలని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్పీ చెప్పారు. ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు, లాటరీ మోసాలు, ఫేక్ లింకులు ఓటీపీ మోసాల పట్ల గ్రామాలు, విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్లలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో డయల్-100 ద్వారా వచ్చే పిలుపులకు అత్యంత వేగంగా స్పందించి, సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు తక్షణ సహాయం అందించి భరోసా కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కామారెడ్డి పట్టణ ట్రాఫిక్ నిర్వహణపై ఎస్పీ ప్రత్యేక సమీక్ష జరిపారు. ట్రాఫిక్ ఎస్ఐ చంద్రశేఖర్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా సమర్థవంతమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, టౌన్ ఎస్ఐలు , ట్రాఫిక్ ఎస్ఐ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ 1 జాబితాలో గల కచ్చ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలి..

**- జిల్లా కలెక్టర్ కె.హరిత...**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14,(విజన్ ఆంధ్ర) : ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎల్ 1 జాబితాలో ఉన్న కచ్చ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారులు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో ఎల్ 1 జాబితాలోని కచ్చ ఇండ్లు గల లబ్ధిదారుల జాబితా పరిశీలన, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల 2వ విడత కొరకు ఎల్ 1 జాబితాలో గల కచ్చా ఇండ్లు గల లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి వాస్తవ పరిస్థితులపై విచారణ జరిపి నివేదికలు వెంటనే అందించాలని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే గృహ నిర్మాణ శాఖ పి.డి. దృష్టికి తీసుకురావాలని, ఎల్ 1 జాబితాలో కచ్చా ఇండ్లుగా నమోదైన ఇండ్ల వివరాల సంఖ్య 2 వేల 300 గా ఉందని, అందులో ఇప్పటి వరకు 1 వేయి 800 ఇలా పరిశీలన పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 500 ఇండ్లు పరిశీలన పూర్తి చేయవలసి ఉందని తెలిపారు. గెజిటెడ్ అధికారులు ఇండ్ల పరిశీలన త్వరగా పూర్తిచేయాలని, మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి సాధించాలని తెలిపారు. మొదటి విడతలో 9 వేల 306 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇప్పటివరకు 683 ఇండ్లు పూర్తి చేశారని, మిగతా ఇండ్లు వివిధ దశలలో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా ఇండ్లు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు లబ్ధిదారులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ పి.డి. ప్రకాష్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, గెజిటెడ్ అధికారులు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అత్వెల్లిలో తుదిదశకు చేరుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియ

**- మొత్తం ఎస్ఐఆర్ ఓటర్లు 1341కాగా 1030 ఆన్లైన్లో డిజిటలైజేషన్ పూర్తి**

**- బిఎల్ఓలు కావలి నారాయణ, కావలి ప్రమీల, కార్యదర్శి కలేటి పూర్ణిమ**

**- గ్రామ సర్పంచ్ అర్థ విజయలక్ష్మి మహేందర్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూలై 14 ( విజన్ ఆంధ్ర ) : ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ప్రతి ఓటరు తమ ఓటు హక్కును కోల్పో రాదని అత్వెల్లి గ్రామ సర్పంచ్ అర్థ విజయలక్ష్మి మహేందర్ రెడ్డి సూచించారు. గ్రామంలో మొత్తం ఓటర్లు 1341 మందికి వంద శాతం ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను అందజేశారని ఆమె స్పష్టం చేశారు. మంగళవారం వికారాబాద్ మండల పరిధిలో గల అత్వెల్లి గ్రామ సర్పంచ్ అర్థ విజయలక్ష్మి మహేందర్ రెడ్డి విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. ఇప్పటివరకు 1030 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను ఆన్లైన్లో అప్లోడ్ చేశారని ఆమె స్పష్టం చేశారు. ఇంకా కేవలం మిగిలి ఉన్న 311 ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు ఆన్లైన్లో అప్లోడ్ చేస్తామని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. 2002 ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు వారి వివరాలను ఎడమవైపు పూరించాలని స్పష్టం చేశారు. 2002 ఓటరు జాబితాలో పేరు లేకపోతే ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారంలో ఓటరు యొక్క తల్లి, తండ్రి, నాయనమ్మ / అమ్మమ్మ, తాతయ్యల ఎవరిదో ఒకరి పేరు రాసి వారి పూర్తి వివరాలు తప్పులు లేకుండా పూరించాలని ఆమె సూచించారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పూరించిన ఓటర్లు బి ఎల్ ఓ లు కావలి నారాయణ కావలి ప్రమీల కార్యదర్శి కలేటి పూర్ణిమ లకు ఇవ్వాలని ఆమె తెలిపారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాన్ని పూర్తిచేసి బిఎల్ఓ లకు ఇవ్వకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ఆమె హెచ్చరించారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలు నింపేముందు ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే బిఎల్వోలు కార్యదర్శిని సంప్రదించాలని ఆమె సూచించారు. ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను పూరించడానికి విలేజ్ బుక్ కీపర్ విఓఏ ఎస్ రేఖ గ్రామ యువత గ్రామ విద్యావంతులు సహాయ సహకారాలు అందజేశారని ఆమె గుర్తు చేశారు.

## ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు ఎస్ఐఆర్ లో భాగస్వామ్యం కావాలి

**- ఫీర్జాదిగూడ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి**

**- ఎస్ఐఆర్ ఎన్ రోల్ మెంట్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్,మాజీ కార్పోరేటర్లు**



బోడుప్పల్,జూలై 14(విజన్ ఆంధ్ర) : మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9.10 వార్డులలో కొనసాగుతున్న సంక్షిప్త ఓటర్ సవరణ కార్యక్రమంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి పాల్గొని ఎస్ఐఆర్ నిర్వహణ, ఎదురవుతున్న సమస్యలపై బిఎల్ఓ బీఆర్ఎస్ పార్టీ బీఎల్ ఎ లతో సమీక్షించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఐదవ డివిజన్ మాజీ అధ్యక్షుడు మునికుంట్ల కిరణ్ గౌడ్ ఆధ్వర్యంలో పర్వతాపూర్ శభరి గార్డెన్ ముందు నిర్వహించిన ఎస్ఐఆర్ ఎన్ రోల్ మెంట్ అవగాహన కార్యక్రమం లో వాలంటీర్స్ తో దరఖాస్తు ఫారాలు పూరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి పౌరుడు ఎస్ఐఆర్ లో భాగస్వామ్యం కావాలని మాజీ మేయర్ సూచించారు. లేని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ మాజీ ప్రదాన కార్యదర్శి ఎడవెల్లి రఘువర్ధన్ రెడ్డి, వివిధ డివిజన్ ల మాజీ అధ్యక్షులు కోనేటి వెంకట్,యాసారం శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు శశిధర్ రెడ్డి, సతీష్, అమర్ పటేల్, సుబాన్,లారెన్స్,సురేష్,అబ్దుల్, మునికుంట్ల ప్రదీప్ ,సందీప్ రాజీవ్ గౌడ్,బిపిఎం కాలనీ అధ్యక్షుడు మునికుంట్ల నరేష్ గౌడ్,బాలక్ష్మి కాలనీ మాజీ అధ్యక్షుడు సబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ నమోదు కార్యక్రమంలో దుబ్బాక మున్సిపల్ పరిధిలో ధర్మాజీపేట వార్డులో హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సందర్శించిన బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్



దుబ్బాక విజన్ ఆంధ్ర రిపోర్టర్ : SIR నమోదు కార్యక్రమంలో భాగంగా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 08వ వార్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ కేంద్రాన్ని సిద్ధిపేట జిల్లా బీజేపీ అధ్యక్షులు బైరి శంకర్ ముదిరాజ్ గారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మాజీపేట వార్డు పరిధిలో SIR ప్రక్రియ విజయవంతంగా జరుగుతుందని, స్థానిక కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్ గౌడ్ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు, 100% ఎన్యుమరేషన్ కార్యక్రమం పూర్తయ్యే వరకు ఇది స్ఫూర్తిని కొనసాగించి ఎస్ఐఆర్ ని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సుభాష్ రెడ్డి , దుబ్బాక నియోజకవర్గ SIR పార్టీ ఇంచార్జ్ పల్లె వంశీకృష్ణ గౌడ్ , 08వ వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయి కుమార్ గౌడ్ , జిల్లా కార్యదర్శి మారటి బాబు , దుబ్బాక మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్ యాదవ్ , ప్రధాన కార్యదర్శి గట్టు ప్రసాద్ , సీనియర్ నాయకులు పొసరిగల్లా కనకరాజు, పెద్దోళ్ళ వెంకట నర్సింహా గౌడ్, సాయి తేజ గౌడ్, గజాభింకర్ సాయి కృష్ణ, బొల్లి భాను, కుమ్మరి నవీన్, దుద్దెడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమలుకు నోచుకోని జర్నలిస్టుల సంక్షేమ హామీలు

**- నిరసనగా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ ముందు ధర్నా,**





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జులై 13 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నిర్దిష్టంగా అమలుచేయాలని మీడియా స్వేచ్ఛ కాపాడాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ ( టీడబ్ల్యూజేఎఫ్) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాపిత పిలుపులో బాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని భారీగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు ఎస్ కె సలీమా, గుమ్మడి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కార్యదర్శి బనావత్ రవి నాయక్ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అర్హులైన వారందరికీ వెంటనే అక్రిడేషన్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పిల్లలకు స్కూల్ ఫీజుల్లో రాయతీలు ఇండ్ల స్థలాల హామీలు అమలు విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవరిస్తుందని అన్నారు. ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని లేందంటే ఆందోళ తీవ్రతరం చేస్తామని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా, నియోజక వర్గం ఇంచార్జ్ లు నాయకులు పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# చరిత్ర తిరగరాసిన మంచూరి

**- కార్యకర్తల్లో భరోసా నింపిన కొత్త ఇన్చార్జి**

**- బద్వేలు నియోజకవర్గ అభివృద్ధి ఖాయం**

**- టిడిపి లీడర్ డాక్టర్ కొంకుల రాంబాబు**



బద్వేలు, జూలై 14 (విజన్ ఆంధ్ర) బద్వేలు నియోజకవర్గం లో ముప్పై ఏండ్లుగా వరుస పరాజయాలను మూట కట్టుకున్న తెలుగుదేశం పార్టీకి నేడు కొత్త రథసారథి మంచురి సూర్యనారాయణ రెడ్డి రాకతో కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపిందని బద్వేలు మాజీ టిడిపి మున్సిపాలిటీ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు అన్నారు. టిడిపి ఇన్చార్జి మంచూరి కి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేదల కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నత కోసం అనేక సంక్షేమాలతో ఆశయాలతో ఆవిర్భవించిన క్రమశిక్షణ గల పార్టీ అని అన్నారు. నాటి నుండి నేటి వరకు బద్వేలు నియోజకవర్గం లో టిడిపిని నమ్ముకున్న నాయకులు కార్యకర్తలు నిస్వార్థంగా పార్టీకి సేవలు అందిస్తూనే ఉన్నారని అన్నారు. మండల స్థాయి నుండి తెలుగుదేశం పార్టీకి నాయకుల, కార్యకర్తల బలం ఉన్నప్పటికీ సరైన నాయకత్వం లేక గత 25 సంవత్సరాల నుండి టీడీపీ వరుస పరాజయాలను మూట కట్టుకుందని అన్నారు. బద్వేలు నియోజకవర్గంలో గత 15 సం,,రాలు నియోజకవర్గంలో వైసిపి పార్టీ ఎమ్మెల్యే అధికారంలో ఉన్న ఏ మాత్రం అభివృద్ధి చెందలేదని, వారి అవినీతి,భూ కబ్జాలు,అక్రమ దందాలతో బద్వేలు అభివృద్ధి 50 సంవత్సరాలు వెనక్కి తీసుకెళ్లారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు ఇక్కడ అభివృద్ధి జరగాలంటే టిడిపి నూతన ఇంచార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి తోనే సాధ్యమని అన్నారు. ప్రజలకు సేవ అందించాలని పట్టుదలతో, క్రమశిక్షణతో అడుగులు వేస్తున్న మంచూరి కి సహకరిస్తామని అన్నారు. టిడిపి ఇన్చార్జి మంచూరి తో కలిసి మండల స్థాయి నుండి పల్లెలకు మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు మరియు ఇంటింటికీ పర్యటించి టిడిపి విజయానికి కృషి చేస్తామని నూతన శకానికి నాంది పలుకుతామని ఆయన అన్నారు.

# ఉపాధ్యాయ సంఘాల సమస్యలు పరిష్కరించాలని టీపీయూఎస్ ధర్నా

**పోస్ట్ ఆఫీస్ వద్ద నినాదాలతో మార్మోగిన ములుగు**



ములుగు జిల్లా 14; విజన్ ఆంధ్ర ప్రతినిధి : మంగళవారం ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లితెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం – టి పి యు ఎస్ ములుగు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పోస్ట్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. 53% ఫిట్మెంట్ తో పి ఆర్ సి అమలు, పెండింగ్ డి ఎ బకాయిలు, అరియర్స్, మెడికల్ బిల్లులు చెల్లింపు, పాత పెన్షన్ ఓ పి ఎస్ పునరుద్ధరణ, 10 వేల టీచర్ పోస్టుల భర్తీ, ఈ హెచ్ ఎస్ సేవల విస్తరణ తో పాటు 36 డిమాండ్ల సాధన కోసం ఈ ధర్నా చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ప్రభుత్వం ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలను విడనాడాలని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని నినాదాలు చేశారు. మోడల్, గురుకుల, గిరిజన పాఠశాలల్లో ఖాళీల భర్తీ, మహిళా టీచర్లకు చైల్డ్ కేర్ లీవ్ పెంపు, ప్రతి పాఠశాలకు క్లీనర్, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టిపియూఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లు పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపియూఎస్ ములుగు జిల్లా అధ్యక్షురాలు వాంకుడోత్ జ్యోతి, ప్రధాన కార్యదర్శి గోని రవీందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పద్మాకర్ రెడ్డి, జోనల్ ఇన్చార్జి వెంకటరమణారావు, ఉపాధ్యాయులు భద్రన్న, గొల్ల కుమార్, శ్యామ్, బలరాం, సుగుణ, కేజీబీవీ ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన ముడియం శ్రీధర్ మృతదేహానికి నివాళులర్పించిన మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాషా



కడప, జూలై 14 (విజన్ ఆంధ్ర) కడప నగరంలోని ఓంశాంతి నగర్‌లో నివాసంగల వియత్నాం బోటు ప్రమాదంలో దుర్మరణం చెందిన ముడియం శ్రీధర్ భౌతికకాయం కడప నగరానికి చేరుకున్న సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం, కడప నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.బి. అంజాద్ భాషా పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి శ్రీధర్ పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా అంజాద్ భాష మాట్లాడుతూ శ్రీధర్ అకాల మరణం చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారి కుటుంబానికి ఆ దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షఫీ, ఓబుల్ రెడ్డి,రామ్మోహన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# కడప పారిశ్రామిక ప్రగతికి మరో మైలురాయి

**- రూ.3,478 కోట్ల పెట్టుబడితో దాల్మియా సిమెంట్ లైన్2 విస్తరణ.**

**- నేడు (15న) రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా శంకుస్థాపన**



కడప,జూలై 14 (విజన్ ఆంధ్ర) వైఎస్సార్ కడప జిల్లాను ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా పారిశ్రామిక రంగంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం కానుంది. దేశంలోని ప్రముఖ సిమెంట్ తయారీ సంస్థలలో ఒకటైన దాల్మియా సిమెంట్ (భారత్) లిమిటెడ్ చేపడుతున్న లైన్2 విస్తరణ ప్రాజెక్టుకు ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేయనున్నారు. జమ్మలమడుగు సమీపంలోని మైలవరం మండలం చిన్నకొమెర్లలోని దాల్మియా సిమెంట్ ప్లాంట్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. కడప జిల్లాను పారిశ్రామిక కేంద్రంగా ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా తీర్చిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషీ ఫలితంగా జిల్లాలో యువత, పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయి. పరిశ్రమల కారిడార్ గా ఎదుగుతున్న కడప జిల్లాలో వేల సంఖ్యలో చిన్న, కుటీర పరిశ్రమలతో పాటు.అనేక భారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వృద్ధిరేటులో కీలకమైన భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయి. జిల్లాలో సిమెంట్ పరిశ్రమ బలంగా ఎదుగుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 16 మిలియన్ టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో పెద్ద సిమెంట్ యూనిట్లు పనిచేస్తుండగా, మరిన్ని విస్తరణ ప్రాజెక్టులు ప్రతిపాదిత దశలో ఉన్నాయి. ఈ విజయ పరంపరలో జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్న దాల్మియా సిమెంట్ కర్మాగార యూనిట్‌కు రెట్టింపు ఉత్పత్తి సామర్థ్యంతో రెండో భారీ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టనుంది.ఈ బృహత్తర శుభకార్యానికి రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ శుభారంభం చేయనున్నారు.రూ.3,478 కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టు పూర్తయితే సంస్థ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12.6 మిలియన్ టన్నులకు పెరగనుంది. ఈ విస్తరణతో 354 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించగా, మొత్తం ప్రత్యక్ష ఉద్యోగాల సంఖ్య 954కు చేరుకోనుంది.ఈ ప్రాజెక్టుకు ఇటీవలే కేంద్ర పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ నుంచి పర్యావరణ అనుమతి, అలాగే ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి స్థాపన అనుమతి (సీటీఈ) లభించడంతో నిర్మాణ పనులకు మార్గం సుగమమైంది.కాగా దాల్మియా సిమెంట్స్ విస్తరణతో కడప జిల్లాలో పారిశ్రామిక వాతావరణం మరింత బలోపేతం కానుంది. ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు రవాణా, నిర్మాణం, గనుల తవ్వకం, యంత్రాల నిర్వహణ, సేవారంగం, చిన్నతరహా పరిశ్రమల్లో వేలాది మందికి పరోక్ష ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది.స్థానిక యువతకు ఉపాధి, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు ఊతం, కొత్త పెట్టుబడులకు ప్రోత్సాహం లభించే ఈ ప్రాజెక్టు కడప పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక అధ్యాయంగా నిలవనుందని పారిశ్రామిక వర్గాలు, ఉద్యోగార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# బిల్లుల విడుదలకు లంచం.. ఏసీబీ వలలో మున్సిపల్ ఏఈ

**- పెద్దపల్లి మున్సిపాలిటీలో రూ.2.50 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత**



పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జూలై 14(విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లాలో అవినీతిపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మరోసారి ఉక్కుపాదం మోపింది. పెద్దపల్లి మున్సిపాలిటీలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా విధులు నిర్వహిస్తున్న సతీష్‌ను రూ.2.50 లక్షల లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం, మున్సిపల్ పరిధిలో కాంట్రాక్టర్ బత్తుల శ్రీను చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను విడుదల చేయడానికి ఏఈ సతీష్ రూ.2.50 లక్షలు డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీంతో బాధిత కాంట్రాక్టర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు పక్కా ప్రణాళికతో ఉచ్చు బిగించారు. మంగళవారం కాంట్రాక్టర్ నుంచి లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు మెరుపుదాడి నిర్వహించి ఏఈ సతీష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆయనను మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లి సంబంధిత బిల్లులు, ఫైళ్లు, ఇతర రికార్డులను పరిశీలించారు. డీఎస్పీ నేతృత్వంలో ఆపరేషన్ ఈ ఆపరేషన్‌కు కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ మహేందర్ రెడ్డి నేతృత్వం వహించారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొని సాక్ష్యాధారాలను సేకరించారు. కేసుకు సంబంధించి తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ మహేందర్ రెడ్డి మీడియాకు తెలిపారు. ఏఈ అరెస్టుతో పెద్దపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఈ ఘటన అధికార వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అవినీతికి పాల్పడే ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ నిరంతరం నిఘా కొనసాగిస్తోందని ఈ ఘటన మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేసినట్లయితే వెంటనే అవినీతి నిరోధక శాఖను సంప్రదించాలని ఏసీబీ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు అవినీతికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# TPUS ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ఉపాధ్యాయుల ధర్నా



భూపాలపల్లి జిల్లా 14 జులై (విజన్ ఆంధ్ర) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (TPUS) ఆధ్వర్యంలో నేడు భూపాలపల్లి కలెక్టరేట్ ఎదుట జిల్లా స్థాయి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, మొదటి దశ ఉద్యమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మండల తహసీల్దార్ల ద్వారా వినతిపత్రాలు సమర్పించిన అనంతరం, రెండో దశ ఉద్యమంలో భాగంగా జిల్లా స్థాయి ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ఖాఖా జోనల్ ఇంచార్జ్ కొడకండ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ :- పెండింగ్లో ఉన్న పి.ఆర్.సి నివేదికను వెంటనే విడుదల చేసి 51% ఫిట్మెంట్స్ ప్రకటించాలి. పెండింగ్ లో ఉన్న 6 డి ఏ లను వెంటనే ప్రకటించాలి. ఇంతవరకు మనకు నెంబర్ 190 ను పూర్తిగా అమలు చేసిన అర్హులందరికీ బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలి. కేజీబీవీ సమగ్ర శిక్ష ఉద్యోగులు పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్లకు సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లిస్తూ ఎంటిఎస్ అమలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు గ్రాంట్లు విడుదల చేయాలి. జిహెచ్ఎం ఆపై స్థాయి ప్రమోషన్లకు ప్రత్యేక కార్యచరణ ప్రత్యామ్నాయ మార్గాలు ప్రకటించాలి. సర్వీస్ టీచర్లకు ప్రత్యేక మార్కుల అర్హతను నిర్ణయం చేయాలి. ఉద్యోగుల ఉపాధ్యాయుల పెన్షన్లకు సంబంధించిన ఇండిపెండెంట్ బిల్లులను వెంటనే చెల్లించాలి. అన్ని రకాల గురుకుల రెసిడెన్షియల్ మైనారిటీ పాఠశాలలకు ఉపాధ్యాయులకు సమస్యలను పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి. సి పీ ఎస్ ను రద్దుచేసి అందరికీ పాత పెన్షన్ విధానాన్ని (OPS ) అమలు చేయాలి.మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 వర్తింపు చేస్తూ వారిని విద్యాశాఖలో విలీనం చేయాలి. జీవో నెంబర్ 25న సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉండేలా పోస్టులను భర్తీ చేయాలి. అన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.హైదరాబాదు ఆగస్టు 01 న ఇంద్ర పార్కులో చేసేటువంటి ధర్నాకు యావత్ తెలంగాణ పర్మనెంట్ ఉపాధ్యాయులు సుమారు 1లక్ష 30 వేల మంది, కాంట్రాక్టు ఉపాధ్యాయులు సుమారు 30 వేల నుండి 40,000 మంది ఇసుకేస్తే రాలకుండా ఉండేటట్లుగా రావాలని కోరారు. ఈ కార్యక్రమం లో జోనల్ ఇంచార్జీ వీరమల్ల వెంకట రమణ రాష్ట్ర అదనపు కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు, మల్లకల్ల తిరుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి వెంకటరాం రెడ్డి, పరమరాజుల సుధాకర్, మరబోయిన మహేందర్, కొడకండ్ల శ్రీనివాస్, కడివెండి ప్రభాకర్, బోయిన విజయ్ కుమార్, నాసగొణి రాజు, లేకల ఇంద్రసేనా రెడ్డి, కామరపు మధు, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

# సరస్వతీ పుత్రికకు 10 వేల ఆర్థిక సాయం..



సూర్యాపేట జూలై 14:(విజన్ ఆంధ్ర) : ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో, ప్రతి రంగంలో ప్రతిభ ఉన్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సాయం చేయడం అభినందనీయమని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని వైట్ హౌస్ లో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాస శృతి సౌజన్యంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నూతనకల్ లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని సప్పిడి నందినికి 10 వేల రూపాయలు ఆర్థిక సాయం ను రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు.ఈ సందర్భంగా సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ చదువులో రాణించే వారికి, అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న నిరుపేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనందించడం హర్షణీయమని అన్నారు.వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. విద్య, వైద్య, క్రీడా, సాంస్కృతిక, సామాజిక రంగాలలో విశేష సేవలందిస్తున్న అక్షర ఫౌండేషన్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రామ్ కుమార్ రెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాసు సుభాష్ చంద్రబోస్, బత్తిని ఉపేందర్, కాసర్ల సైదులు, గడ్డం వీరబాబు, ధరావత్ వీరా సింగ్, గంగాధర్, పాపయ్య మొదలగు వారు పాల్గొన్నారు.

# వియత్నాం బోటు ప్రమాద బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా కలెక్టర్.



కడప,జూలై 14 (విజన్ ఆంధ్ర)వియత్నాం బోటు ప్రమాదంలో మృతి చెందిన ముడియం శ్రీధర్ భౌతికకాయం కడపకు చేరుకున్న సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి. వారి అకాల మరణం తీవ్ర విషాదకరమనన్నారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, జిల్లా యంత్రాంగం వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.మృతుడు శ్రీధర్ పనిచేసిన కంపెనీ తరపున అందించాల్సిన పరిహారం,సహాయ సహకారాలు,ఇతర అవసరమైన చర్యలు త్వరగా పూర్తయ్యేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. శ్రీధర్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు గట్టి మనోధైర్యాన్ని ఆ దేవుడు ప్రసాదించాలని ఆకాంక్షిస్తూ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట కడప ఆర్డీవో మురళి, కేఎంసీ కమిషనర్ భవానీ ప్రసాద్, అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యుత్ సామగ్రి మంజూరు చేయాలి

***ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే విజయుడు***



అలంపూర్ జూలై 14 (విజన్ ఆంధ్ర) : అలంపూర్ నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్,ఏబీ కేబుల్స్ , డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు) తదితర సామగ్రిని మంజూరు చేయాలని అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కి వినతిపత్రం అందజేశారు. ఇటీవల ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతులు దెబ్బతిన్నాయని, రైతులు, గ్రామీణ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన సామగ్రిని అత్యవసరంగా మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా అలంపూర్ నియోజకవర్గానికి అవసరమైన విద్యుత్ సామగ్రి వివరాల జాబితాను కూడా ఉప ముఖ్యమంత్రికి సమర్పించారు.

# బాసింగ బలాలుతో మరో సంచలనం

**- తెలంగాణ జానపద సంగీతానికి కొత్త ఊపు**

**- ప్రతి పాటతో ప్రజల గుండెల్లో చోటు సంపాదిస్తున్న గాయని శ్రీనిధి**




విజన్ ఆంధ్ర(13) హైదరాబాద్ : తెలంగాణ జానపద సంగీతానికి తన మధుర గాత్రంతో ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్న యువ గాయని శ్రీనిధి ప్రస్తుతం వరుస విజయాలతో సంగీతాభిమానుల ప్రశంసలు అందుకుంటున్నారు, ఆమె ఆలపిస్తున్న ప్రతి జానపద గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్, సోషల్ మీడియా వేదికల్లో విశేష ఆదరణ పొందుతూ ప్రజల హృదయాల్లో చోటు సంపాదించుకుంటోంది, అచ్చ తెలంగాణ యాస, పల్లె సంస్కృతి, సహజమైన భావ వ్యక్తీకరణతో కూడిన ఆమె గానం నేటి యువతతో పాటు అన్ని వయసుల శ్రోతలను ఆకట్టుకుంటోంది, తెలంగాణ పల్లెల జీవన విధానం, కుటుంబ బంధాలు, ప్రేమ, అనుబంధాలు, బతుకమ్మ, బోనాలు వంటి సంప్రదాయాలను తన గాత్రంలో సజీవంగా పలికిస్తూ శ్రీనిధి జానపద సంగీతానికి కొత్త ఊపిరి పోస్తున్నారు, ఆమె స్వరంలో వినిపించే అచ్చమైన తెలంగాణ పలుకుబడి, భావానికి తగ్గ స్వరపలుకులు ప్రతి పాటను శ్రోతలకు మరింత చేరువ చేస్తున్నాయి, తాజాగా విడుదలైన బాసింగ బలాలు పాటతో శ్రీనిధి మరోసారి తన గాన ప్రతిభను కనపర్చి ప్రజా హృదయాలకు దగ్గరయింది, విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ పాట యూట్యూబ్‌తో పాటు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఇతర సోషల్ మీడియా వేదికల్లో విస్తృత ఆదరణ పొందింది, వివాహ వేడుకలు, శుభకార్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, రీల్స్, షార్ట్ వీడియోల్లో ఈపాట విస్తృతంగా వినిపిస్తూ ప్రేక్షకుల ఆదరణను చూర గొంటోంది, తెలంగాణ పెళ్లి సంప్రదాయాలు, కుటుంబ ఆప్యాయతలు, ప్రేమ, అనుబంధాలను అచ్చ తెలంగాణ భాషలో ఆవిష్కరించిన ఈ పాటకు సతీష్ రెడ్డి బండి నిర్మాతగా వ్యవహరించగా, శేఖర్ వైరస్ దర్శకత్వంతో పాటు స్వర రచన బాధ్యతలు నిర్వర్తించారు, కళ్యాణ్ కీస్ సంగీతం అందించగా, స్వామి నరేష్ దుబ్బా రచించిన సాహిత్యం పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చింది, స్వామి నరేష్ దుబ్బాతో కలిసి శ్రీనిధి ఆలపించిన గానం ఈ పాట విజయానికి ప్రధాన బలంగా నిలిచింది, పాటలో నటించిన ఈశ్వర్ సాయి, వైష్ణవి సోనీ తమ సహజమైన అభినయం, నృత్యాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు, తువ్వాలు, కొంగు, యాది, బుడ్డపోరి, దుంకి రావాలే, వంటి అచ్చ తెలంగాణ పదాలు, వాటికి తగ్గ బాణీ ఈ పాటను మరింత ప్రజాదరణ పొందేలా చేశాయి, గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించే చిత్రీకరణ కూడా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది, ఈ పాట విజయానికి ప్రధాన కారణం శ్రీనిధి గాత్రంలోని సహజత్వమేనని సంగీతా భిమానులు అభిప్రాయ పడుతున్నారు, ఎలాంటి కృత్రిమతకు తావులేకుండా పల్లె గాన సొగసును కాపాడుతూ, ప్రతి పదాన్ని భావానికి అనుగుణంగా ఆలపించే ఆమె శైలి ప్రత్యేకంగా నిలుస్తోంది, పదాల స్పష్టత, భావోద్వేగాన్ని హృదయానికి హత్తుకునేలా వ్యక్తీకరించే గాత్రం, తెలంగాణ యాసపై ఉన్న పట్టు ఆమెను నేటి జానపద గాయనుల్లో ప్రత్యేక స్థానంలో నిలబెట్టాయి, గత కొన్నేళ్లుగా తెలంగాణ జానపద సంగీతానికి లభిస్తున్న ఆదరణలో యువ గాయకుల పాత్ర విశేషంగా ఉండగా, ఆ వరుసలో శ్రీనిధి తనదైన ముద్ర వేస్తున్నారు, సంప్రదాయ జానపద సంగీతాన్ని ఆధునిక వేదికల ద్వారా కొత్త తరానికి చేరువ చేస్తూ, తెలంగాణ సంస్కృతి గొప్పతనాన్ని తన పాటల ద్వారా పరిచయం చేస్తున్నారు, వరుస విజయాలతో ముందుకు సాగుతున్న శ్రీనిధి. ప్రతి పాటతో ప్రజల గుండెల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచు కుంటున్నారు, బాసింగ బలాలు విజయం ఆమె సంగీత ప్రయాణంలో మరో మైలురాయిగా నిలవగా, రాబోయే రోజుల్లో మరెన్నో మధురమైన జానపద గీతాలతో తెలంగాణ సంగీతాభి మానులను అలరిస్తారనే నమ్మకం వ్యక్త మవుతోంది, తెలంగాణ జానపద సంగీతానికి కొత్త తరం స్వరంగా ఎదుగుతున్న శ్రీనిధి ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని సంగీత ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు.

# ఇసుకను అక్రమంగా దారి మళ్లించిన మెండోరా ఆర్.ఐను సస్పెండ్ చేసిన కలెక్టర్




నిజామాబాద్, జూలై 14 :( విజన్ ఆంధ్ర ) ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుకను అక్రమంగా దారి మళ్లించాడనే ఫిర్యాదు మేరకు, మెండోరా రెవెన్యూ ఇన్స్ పెక్టర్ (ఆర్ఐ) సదానంద్ ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికారులు గట్టి నిఘా కొనసాగిస్తున్న విషయం విదితమే. మన ఇసుక వాహనం బుకింగ్ యాప్ ద్వారా మాత్రమే ఇసుక తరలింపునకు అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మెండోరా మండల రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సదానంద్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల పేరిట ఇసుక తరలింపునకు అనుమతులు పొంది, ఇసుక నిల్వలను దారి మళ్లిస్తున్నట్లు కలెక్టర్ దృష్టికి వచ్చింది. ఈ విషయమై ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను సైతం అధికారులతో వాకబు చేయించగా, తమకు ఇసుక అందలేదని వెల్లడించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి, మెండోరా రెవెన్యూ ఇన్స్ పెక్టర్ సదానంద్ ను సస్పెండ్ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక అక్రమ దారి మళ్లింపు విషయమై పూర్తి స్థాయిలో విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని మైనింగ్ ఏ.డీని ఆదేశించారు. ఇసుక రవాణాలో అక్రమాలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

# కెపిహెచ్‌బి లులూ మాల్ వద్ద ఘర్షణ

**- గన్‌తో వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆందోళన**

**- మాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు**

హైదరాబాద్,జూలై14 : కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్‌ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్‌కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్‌లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్‌తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్‌తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్‌లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్‌లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

# బాబా అవతారంలో హంతక్ రౌడీషీటర్

**- వలపన్ని పట్టుకున్న పోలీసులు**

హైదరాబాద్,జూలై14 : హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు బాబా అవతారం ఎత్తిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మహ్మద్ జావేద్ అనే వ్యక్తి 2018లో జరిగిన మర్డర్ కేసులో నిందితుడిగా ఉన్నాడు. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేశాడు. ఆపై పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు.. 2020 ఆగస్టులో జావేద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అప్పటి నుంచి జావేద్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, పోలీసుల కళ్లుగప్పి సంగారెడ్డి జిల్లా చేర్యాలలో బాబా అవతారం ఎత్తాడు రౌడీ షీటర్. ఓ దర్గాలో బాబాగా రౌడీషీటర్ చలామణి అవుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని వాకబుచేసి జావేద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అతడికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. గాంజా సేవించినట్లు నిర్ధారించారు. మరోవైపు రౌడీషీటర్ వద్ద భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అనంతరం మహ్మద్ జావేద్‌ను సైఫాబాద్ పోలీసులకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు అప్పగించారు.

# పంజాబ్‌లో ప్రైవేట్ స్కూళ్లకు షాక్

**- పెంచిన ఫీజులను వాపస్ చేయాలని సర్కార్ హుకుం**




చండీఘడ్,జూలై14 : పంజాబ్‌లోని ప్రైవేట్ స్కూళ్లకు అక్కడి ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. గత మూడేళ్లుగా రాష్ట్రంలోని ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు.. ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించారు. ఆ సమాచారాన్ని విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఫీజు చెల్లించలేని మానసిక వేధింపుల కారణంగా ఇటీవల అమృత్‌సర్‌లో 17ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనను భగవంత్‌మాన్ ప్రస్తావించారు. ఈ ఘటన తర్వాత, అధిక ఫీజుల పెంపుపై తల్లిదండ్రుల నుండి అనేక ఫిర్యాదులు అందాయన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ పాఠశాలల (ఫీజుల నియంత్రణ) ఆర్డినెన్స్‌పై చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఆర్డినెన్స్ కోర్టులో సవాలు చేసినా తాము చట్టపరంగా ముందుకు వెళ్తామని, ఈ విషయంలో వెనుకడుగు వేసేదే లేదని స్పష్టం చేశారు. కొత్త ఆర్డినెన్స్ ప్రకారం.. ప్రైవేట్ పాఠశాలల వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధింపు, గుర్తింపు రద్దు వంటి చర్యలు తీసుకోనున్నారు. ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అంచనా.

# తెలంగాణ టెట్‌లో భారీ పరాభవం

## 14,814 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఫెయిల్

- **ఉత్తీర్ణత 37.29%కే పడిపోయింది...**
- **గతేడాదితో పోలిస్తే 13% తగ్గుదల...**
- **2028లోపు పాస్ కాకపోతే ఉద్యోగం ఊడే ప్రమాదం...**
- **సుప్రీంకోర్టు ఆదేశం..**
- **వయో పరిమితి పెంచాలని ఉపాధ్యాయ సంఘాల డిమాండ్..**
- **అందరికి ఒకే రకంగా మార్కులు ఉండేలా చూడాలని విజ్ఞప్తి..**
- **పాస్ మార్కులు తగ్గించాలని డిమాండ్...**







ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో జూలై 15,(విజన్ ఆంధ్ర): తెలంగాణ విద్యా వ్యవస్థకు షాక్ తగిలింది. గత నెలలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష - టెట్ లో ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయి. రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష రాసిన 23,623 మంది ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో కేవలం 8,809 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ఏకంగా 14,814 మంది ఫెయిల్ అయ్యారు. దీంతో ఉత్తీర్ణత శాతం 37.29%కు పడిపోయింది. గత ఏడాది 50% ఉత్తీర్ణత నమోదు కాగా, ఈసారి దాదాపు 13% తగ్గింది. ఫలితాలు వెలువడిన వెంటనే ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన, ఆవేదన వ్యక్తమవుతోంది. ఇదే సమయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన డెడ్‌లైన్ కూడా ఉపాధ్యాయుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. 2028 ఆగస్టు నెలలోపు టెట్ పాస్ కాకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందన్న సుప్రీంకోర్టు తీర్పు, ఇప్పుడు ఫెయిల్ అయిన 14 వేల మంది ఉపాధ్యాయుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది.

**ఫలితాల్లోని నిజాలు - గణాంకాలతో లెక్క**

విద్యా శాఖ విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల టెట్ ఫలితాలు - 2025 వివరాలు సంఖ్య మొత్తం 23,623 హాజరు కాగా 8,809 ఉత్తీర్ణులు అవగా 14,814 అనుత్తీర్ణులు అయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 37.29%, గత ఏడాది ఉత్తీర్ణత 50% ఉండగా సుమారు 63% మంది ఉపాధ్యాయులు ఫెయిల్ కావడం రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద తిరోగమనం. ముఖ్యంగా సీనియర్ ఉపాధ్యాయులు, గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న వారి ఫెయిల్ శాతం ఎక్కువగా ఉంది.

**"20 ఏళ్లుగా పాఠాలు చెప్పాం... ఇప్పుడు మాకు పరీక్షా?"**

ఫలితాలపై ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "మేము 1998, 2004 బ్యాచ్ లో ఉద్యోగంలో చేరాం. అప్పుడు టెట్ లేదు. ఇప్పుడు 25 ఏళ్ల సర్వీస్ తర్వాత పరీక్ష రాయాలంటున్నారు. పిల్లలకు సైన్స్, మ్యాథ్స్ చెబుతున్నాం. కానీ ఈ పరీక్షలో ఒత్తిడి ఎక్కువగా ఉంది" అని సీనియర్ ఉపాధ్యాయులు అన్నారు.ఇంకొందరు "పాఠశాల పని, మధ్యాహ్న భోజనం, ఇతర ప్రభుత్వ పనులతో సరిగా చదువుకోవడానికి సమయం లేదు. కనీసం శిక్షణ అయినా ఇవ్వాలి" అని కోరుతున్నారు.

**2028 డెడ్‌లైన్ - కత్తిలా వేలాడుతోంది**

అసలు సమస్య ఇక్కడే ఉంది. సుప్రీంకోర్టు 2018లో ఇచ్చిన తీర్పు ప్రకారం, 2028 ఆగస్టు 31లోపు దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ లేదా సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. లేకుంటే వారిని ఉద్యోగం నుంచి తొలగించాల్సిందే. ఇప్పుడు ఫెయిల్ అయిన 14,814 మందికి 2028 వరకు ఇంకా 2-3 అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఒకవేళ వారు పాస్ కాకపోతే రాష్ట్రంలో భారీగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.

**ఉపాధ్యాయ సంఘాల ఆగ్రహం - 4 ప్రధాన డిమాండ్లు**

ఫలితాలు వచ్చిన వెంటనే TGO, TUTF, STF తో పాటు అన్ని ఉపాధ్యాయ సంఘాలు ఒక్కటయ్యాయి.వారు ప్రధాన డిమాండ్లను కోరారు. 45 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులకు టెట్ నుండి పూర్తి వయస్సు మినహాయింపు ఇవ్వాలి, ప్రతి జిల్లాలో ప్రభుత్వమే ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి, రిఫ్రెషర్ కోర్సులు నిర్వహించాలని అన్నారు. పాస్ మార్కులు తగ్గించి ప్రస్తుతం 60% ఉన్న పాస్ మార్కులను 50%కు తగ్గించాలని, 2028 వరకు ఎన్ని సార్లైనా పరీక్ష రాసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులను తొలగిస్తే పాఠశాలలు మూతపడతాయి. ప్రభుత్వం మానవీయంగా ఆలోచించాలి" అని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

**విద్యా శాఖ - "నాణ్యత కోసం తప్పదు"**

ఈ అంశంపై విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందిస్తూ, "విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు అర్హత కలిగి ఉండాలి. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉల్లంఘించలేం" అని స్పష్టం చేశారు. అయితే ఫెయిల్ అయిన ఉపాధ్యాయుల కోసం ఇకపై ల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ఆన్‌లైన్ మాక్ టెస్టులు, స్టడీ మెటీరియల్ అందిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే టెట్ కు ముందు అన్ని జిల్లాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

**విద్యా వ్యవస్థపై ప్రభావం ఏంటి?**

14 వేల మంది ఉపాధ్యాయులు ఒకేసారి ఉద్యోగాలు కోల్పోతే రాష్ట్రంలోని 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధనకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. ఇప్పటికే 10 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యావేత్తలు మాట్లాడుతూ, "ఉపాధ్యాయుల అర్హత పెరగాలి. కానీ వారిని ఏకంగా తొలగించడం కంటే, శిక్షణ ఇచ్చి నాణ్యమైన ఉపాధ్యాయులుగా మార్చడం మంచిది" అని అభిప్రాయపడ్డారు.

**ప్రభుత్వం ముందున్న సవాలు**

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు ఇరకాటంలో పడింది. ఒకవైపు కోర్టు ఆదేశాలు, మరోవైపు 14 వేల కుటుంబాల భవిష్యత్తు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు మరింత అవకాశం ఇస్తుందా? లేక కఠినంగా వ్యవహరించి నిబంధనలు అమలు చేస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. 2028 వరకు ఇంకా 3 సంవత్సరాలు ఉన్నందున, ఈ లోపు ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై వేలాది ఉపాధ్యాయుల జీవితాలు ఆధారపడి ఉన్నాయి.

**సుప్రీంకోర్టు ఏమంది?**

2018లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో "విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి ఉపాధ్యాయుడు కనీస అర్హత కలిగి ఉండాలి. 2028 ఆగస్టు లోపు టెట్ పాస్ కాని ఉపాధ్యాయులను కొనసాగించరాదు" అని స్పష్టం చేసింది.

# సైబర్ నేరగాళ్ల కొత్త ఉచ్చు - OTP లేకుండానే ఖాతాలు ఖాళీ

## - ఉమ్మడి జిల్లా ఎస్పీ ల సూచన...

- ఈ మేరకు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎస్పీల సూచనలు...
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...
- రోజురోజుకు పెరుగుతున్న సైబర్ క్రైమ్ నేరాలు..




**ఉమ్మడి పాలమూరు జిల్లా బ్యూరో, జూలై 15 (విజన్ ఆంధ్ర)**

సైబర్ నేరగాళ్లు ఇప్పుడు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారు. OTP అడగకుండానే ఫోన్ కు వచ్చే లింకులు, QR కోడ్ ల ద్వారా బ్యాంక్ ఖాతాల్లోని డబ్బును కొల్లగొడుతున్నారు. డిజిటల్ అరెస్ట్ పేరుతో CBI, పోలీస్ అధికారులమని వీడియో కాల్ చేసి భయపెట్టి లక్షల వసూలు చేస్తున్నారు. AI టెక్నాలజీతో బంధువుల గొంతు కాపీ చేసి డబ్బు అడుగుతున్నారు. పార్ట్ టైం జాబ్, క్రిప్టో పెట్టుబడుల పేరుతో యువత, ఉద్యోగులు, డాక్టర్లు, వ్యాపారులు కూడా మోసపోతున్నారు. వృద్ధులు, చదువుకున్న వారు ఎవరినీ వదలకుండా టార్గెట్ చేస్తున్నారు. తెలియని లింక్ లు క్లిక్ చేయవద్దని, QR కోడ్ స్కాన్ చేయవద్దని, స్క్రీన్ షేర్ యాప్ లు డౌన్ లోడ్ చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఎస్పీ లు ప్రజలకు సూచనలు అందించారు.

**మహబూబ్‌నగర్ జిల్లా..**



మహబూబ్‌నగర్ జిల్లా లో సైబర్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలని ఎస్పీ శ్రీమతి జానకి తెలిపారు. మారుతున్న నాగరికతకు అనుకూలంగా సైబర్ నేరగాళ్లు కూడా తమ మోసాల రూపురేఖలు మార్చుకుంటున్నారని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ తెలిపారు. ఇప్పుడు ఓటీపీ అడగకుండానే, కేవలం ఫోన్ కు వచ్చే లింకులు, మెసేజ్ ల ద్వారా బ్యాంక్ ఖాతాల్లోని లక్షల రూపాయలు కొల్లగొడుతున్నారని అన్నారు.వృద్ధులు, ఉద్యోగస్తులు, వ్యాపారులు, డాక్టర్లు, పోలీసులు, రాజకీయ నాయకులు అంటూ ఎవరినీ వదలడం లేదని ఎస్పీ జానకి చెప్పారు. "చదువుకున్న వారినే టార్గెట్ చేస్తున్నారని జాగ్రత్త వహించకుంటే సైబర్ బారిన పడ్డారని హెచ్చరించారు.. జిల్లా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎస్పీ జానకి స్వయంగా సోషల్ మీడియాలో వీడియోలు, పోస్టర్ల ద్వారా ప్రచారం చేస్తున్నారు. "తెలియని లింక్ పై క్లిక్ చేయొద్దు. కస్టమర్ కేర్ పేరుతో వచ్చే కాల్స్ నమ్మొద్దు" అని ప్రజలకు సూచిస్తున్నారు. మోసపోతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని కోరారు.

**వనపర్తి జిల్లా..**



వనపర్తి జిల్లా ఎస్పీ శ్రీమతి సునీతా రెడ్డి సైబర్ నేరాల పట్ల ప్రజలను అప్రమత్తం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాలో రోజురోజుకీ సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా, గ్రామ సభల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. "సైబర్ నేరగాళ్లు ఇప్పుడు లాటరీ తగిలిందని, గిఫ్ట్ వచ్చిందని చెప్పి ప్రాసెసింగ్ ఫీజు పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని, వృద్ధులు, మహిళలు, వ్యాపారులు ఈ ఉచ్చులో పడకుండా జాగ్రత గా ఉండాలని ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. ఎవరైనా లింక్ పంపి క్లిక్ చేయమంటే వెంటనే డిలీట్ చేయండి. అనుమానం వస్తే పోలీసులను సంప్రదించండి" అని ఎస్పీ సూచించారు. జిల్లాలో సైబర్ అవగాహన పట్ల ప్రతీ రోజు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నట్లు తెలిపారు.

**నాగర్‌కర్నూల్ జిల్లా..**



నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ జిల్లాలో పెరుగుతున్న సైబర్ మోసాలపై యువత జాగ్రత్త వహించాలని ముఖ్యంగా పార్ట్ టైం జాబ్, ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో యువత, ఉద్యోగస్తులను టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. "టెలిగ్రామ్, వాట్సాప్ గ్రూపుల్లో చేర్చి మొదట చిన్న మొత్తం ఇచ్చి నమ్మకం కలిగిస్తారు. తర్వాత పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టించి డబ్బులు కొట్టేస్తున్నారు" అని ఎస్పీ పాటిల్ చెప్పారు. జిల్లాలో డాక్టర్లు, పోలీసులు, వ్యాపారులు కూడా ఈ మోసాలకు గురవుతున్నారని అన్నారు. ఎస్పీ సంగ్రామ్ సింగ్ స్వయంగా సోషల్ మీడియా లైవ్ ల ద్వారా "ముందు డబ్బు అడిగే ఏ ఉద్యోగం నిజం కాదు" అని ప్రచారం చేస్తున్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో సైబర్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

**జోగులాంబ గద్వాల జిల్లా..**



జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు జిల్లా ప్రజలను సైబర్ మోసాలపై కీలక హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు నేరగాళ్లు ఓటీపీ అడగడం మానేసి, నేరుగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని లేదా ఏపీకే యాప్ డౌన్‌లోడ్ చేయించి స్క్రీన్ షేర్ ద్వారా బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తున్నారని తెలిపారు. "ముఖ్యంగా వృద్ధులు, వ్యాపారులు కూడా ఈ మోసానికి గురవుతున్నారు. ఫోన్ వచ్చి 'మీ ఖాతా బ్లాక్ అవుతుంది' అని భయపెట్టి QR కోడ్ పంపిస్తున్నారు" అని ఎస్పీ శ్రీనివాస్ వివరించారు. ఎస్పీ శ్రీనివాస్ జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియాలో వీడియోలు, బ్యానర్ల ద్వారా "తెలియని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయొద్దు. ఫోన్ ఎవరికీ ఇవ్వొద్దు" అని ప్రచారం చేస్తున్నారు. మోసపోతే 24 గంటల్లో 1930 కు కాల్ చేయాలని సూచించారు.

**నారాయణపేట జిల్లా..**



నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పెరుగుతున్న సైబర్ పెట్టుబడి మోసాలపై జిల్లా ప్రజలను అప్రమత్తం చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ లాభం వస్తుందని చెప్పి క్రిప్టో కరెన్సీ, ఫేక్ ట్రేడింగ్ యాప్ లలో చేర్చి కోట్ల రూపాయలు కొట్టేస్తున్నారని తెలిపారు. "ఈ మోసంలో వ్యాపారులు, ప్రభుత్వ ఉద్యోగులు ఎక్కువగా బాధితులుగా ఉన్నారని చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారు" అని ఎస్పీ డాక్టర్ వినీత్ ఆవేదన వ్యక్తం చేశారు. "RBI అనుమతి లేని యాప్ లలో డబ్బు పెట్టొద్దు" అని అవగాహన కల్పిస్తున్నారు. "లింక్ వస్తే క్లిక్ చేయకండి. డబ్బు పోతే వెంటనే సైబర్ పోర్టల్ లో కంప్లైంట్ ఇవ్వండి" అని కోరారు.

**5 జిల్లాల ఎస్పీల ఉమ్మడి సూచన**

1. OTP, PIN ఎవరికీ చెప్పొద్దు
2. తెలియని లింక్, QR కోడ్ స్కాన్ చేయొద్దు
3. స్క్రీన్ షేర్ యాప్ లు ఇన్‌స్టాల్ చేయొద్దు
4. మోసపోతే వెంటనే 1930 కి కాల్ చేయండి

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.